గురువారం
24 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 305

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00




RRRలో నవాబ్ బ్యూటీ 8

ఏపీ ఎన్నికల్లో కాంగ్రెస్

ఒంటరి పోటీ

- ఊమెన్ చాందీ, రఘువీరా ప్రకటన





అమరావతి: ఏపీలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని కాంగ్రెస్ నిర్ణయం నిర్ణయించింది. పొత్తులు లేకుండా 175 స్థానాల్లో పోటీచేస్తున్నట్టు ఏపీ పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మేలు జరగాలంటే హస్తం గుర్తుకే ఓటెయ్యాలన్నారు. వేరే ఎవరికి ఓటు వేసినా.. నష్టమని.. వేరేవాళ్లకు ఓట్లు వేస్తే... వారికి మాత్రమే ప్రయోజనమన్నారు. ఇది ఏఐసీసీ తీసుకున్న నిర్ణయమని.. ఏపీ ఇంఛార్జి ఉమెన్ చాందీ ద్వారా తమకు తెలియజేశారని రఘువీరా తెలిపారు. టీడీపీతో అవగాహన జాతీయ రాజకీయాలకు మాత్రమే పరిమితమని తెలిపారు. ఈ నెల 31న అన్ని నియోజకవర్గాల నాయకులతో సమావేశం నిర్వహించి.. భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఐదు కోట్ల ప్రజల భవిష్యత్తుకు ముడిపడి ఉన్న అంశం ఇది అని తెలిపారు.

రాష్ట్రస్థాయిలో పొత్తులుండవు : ఊమెన్ చాందీ

కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశమై పొత్తులపై సుదీర్ఘ చర్చలు జరిపినట్లు సమాచారం. టీడీపీతో అవగాహన జాతీయ రాజకీయాలకే పరిమితం కావాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రస్థాయిలో పొత్తులు ఉండవని హైకమాండ్ నుంచి సంకేతాలు వచ్చాయని నేతలు చెబుతున్నారు. పొత్తులు లేకుండానే (తరువాయి 5లో)

ప్రియాంకా ఆగయీ..

- ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంకా గాంధీ
- కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నియామకం
- యూపీ తూర్పు ప్రాంతానికి పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్
- సోనియా నియోజకవర్గం రాయ్‌బరేలీ నుంచి పోటీ?
- యూపీ సీఎం యోగికి పోటీగా ప్రియాంక క్యాంపెయిన్

న్యూఢిల్లీ: యూపీఏ చైర్‌పర్సన్ సోనియా పుత్రిక, రాహుల్ సోదరి ప్రియాంకా గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం దాదాపుగా ఖరారైంది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రియాంకగాంధీ వాద్రా రాహుల్‌కు తోడుగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారు. ఇప్పటి వరకు అక్కడక్కడ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్న ప్రియాంక ఇప్పుడు నేరుగా రాజకీయాల్లోకి వచ్చారు. ప్రియాంక గాంధీ క్రియాశీలక రాజకీయాల్లోకి రావడానికి మార్గం సుగమం చేస్తూ ఆమెను తూర్పు ఉత్తరప్రదేశ్ నుంచి ఏఐసీసీ కార్యదర్శిగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారంనాడు నియమించడంతో దేశ రాజకీయాల్లో హల్‌చల్ రేగింది. యూపీ పశ్చిమ భాగానికి ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా జ్యోతిరాదిత్య సింధియాను నియమించారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్)గా కేసీ వేణుగోపాల్ నియమిస్తున్నట్లు అధిష్ఠానం ప్రకటించింది. ఫిబ్రవరి మొదటి వారం నుంచి ప్రియాంక గాంధీ తన బాధ్యతలను స్వీకరించనున్నారు. ఈ మేరకు ఏఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది.

అనేక సందర్భాల్లో కాంగ్రెస్‌కు ప్రియాంక అండ

ప్రియాంకకు రాజకీయాలు కొత్త కాదు... అనేక సందర్భాల్లో పార్టీకి అండగా ఉంటూ వచ్చిన ఆమె... ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టడం కీలక పరిణామంగా మారింది. దేశరాజకీయాల్లో కీలకంగా భావించే ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఆమె ఇకపై చురుకైన పాత్ర పోషించనున్నారు. ప్రస్తుతం యూపీ తూర్పు ప్రాంతానికి బీజేపీ తరపున సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రధాన ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారు. ప్రియాంక వాద్రాను ఇప్పుడు ఆయనకు వ్యతిరేకంగానే రంగంలోకి దించారు. నానమ్మ ఇందిరాగాంధీ పోలికలు పుష్కలంగా ఉన్న ప్రియాంక రాజకీయాల్లోకి రావాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎప్పట్నించో పట్టుపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తుండటం, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా యూపీ కీలకం కావడంతో కాంగ్రెస్ తాజా ప్రకటనతో ఆ పార్టీలో సంబరాలు మిన్నంటుతుండగా, కాంగ్రెసేతర పార్టీలు ఈక్వేషన్లు మొదలుపెట్టేశాయి.

రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక పోటీ ?

ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్న తరుణంలో ఆమె ఎక్కడ్నించి పోటీ చేస్తారనే అంశంపైనా ఊహాగానాలు మొదలయ్యాయి. పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఉత్తరప్రదేశ్లో గాంధీ కుటుంబానికి కంచుకోటగా నిలుస్తున్న రాయబరేలి నుంచి ప్రియాంక పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం రాయ్‌బరేలి లోక్‌సభ స్థానానికి ప్రియాంక తల్లి, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితుల రీత్యా సోనియాగాంధీ గతంలో మాదిరిగా రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడం లేదు. ఈసారి లోక్సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని కూడా అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోనియాగాంధీ నియోజకవర్గమైన రాయబరేలి నుంచే ప్రియాంకను ఎన్నికల బరిలోకి దింపితే ఆమె గెలుపు నల్లేరుమీద నడకే అవుతుందని పార్టీ సీనియర్ నేతలు అధిష్టానానికి సూచించినట్టు తెలుస్తోంది.

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో సంబరాలు

ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంక గాంధీ ఆరంగేట్రం ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణులు ఫుల్ జోష్ లోకి వచ్చేశాయి. 'ప్రియాంక గాంధీ ఆంధీ హై, దూస్రీ సోనియా గాంధీ హై' అనే నినాదాలు హోరెత్తుతున్నాయి. (తరువాయి 5లో)



కుటుంబ పాలనకు

నిదర్శనం: మోడీ

- రాహుల్‌కు ప్రియాంక ఓ ఊతకర్ర: బీజేపీ
- సోదరి చాలా సమర్థురాలు: రాహుల్
- ప్రియాంక నియామకంపై కాంగ్రెస్‌లో సంబరాలు

ఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోదరి ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం పరోక్షంగా స్పందించారు. ఆయన మహారాష్ట్రలోని బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ కొందరికి కుటుంబమే పార్టీ అని, అయితే బీజేపీకి మాత్రం పార్టీయే కుటుంబమని చెప్పారు.

"మన పార్టీలో నిర్ణయాలు ఒక కుటుంబం లేదా వ్యక్తి ఆలోచనల ప్రాతిపదికపై ఉండవు. చాలా సందర్భాల్లో కుటుంబమే పార్టీగా ఉంటోందని అంటూ ఉంటారు. కానీ బీజేపీకి మాత్రం పార్టీయే కుటుంబం" అని చెప్పారు. "మన పార్టీలో నిర్ణయాలు తీసుకునేటపుడు ఎవరు ఏ కుటుంబానికి చెందినవారనే విషయాన్ని చూడబోం. ఫలానా కుటుంబం ఏం కోరుకుంటోందనే ప్రాతిపదికపై మన పార్టీలో నిర్ణయాలు జరగవు" అన్నారు.



ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంపై బీజేపీ స్పందించింది. తూర్పు ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ ఇన్చార్జిగా ప్రియాంక నియమితురాలైన నేపథ్యంలో బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా బుధవారం మాట్లాడారు. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం వల్ల ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విఫలమైనట్లు, పార్టీ నైరాశ్యంలో ఉన్నట్లు వెల్లడవుతోందని అన్నారు.

"రాష్ట్రాల్లో మహా కూటమిలో భాగస్వామి అయ్యేందుకు కాంగ్రెస్ను అంగీకరించకపోవడంతో, కుటుంబంలో ఓ ఊత కర్ర కోసం అన్వేషణ జరుగుతోంది. ప్రియాంక, ఆయన (రాహుల్ గాంధీ) కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి, ఆమె ఆయనకు ఊత కర్ర వంటివారు" అని సంబిత్ పాత్రా అన్నారు.

ప్రియాంక, జ్యోతిరాదిత్య..ఇద్దరూ సమర్థులే: రాహుల్

తన సోదరి ప్రియాంక చాలా సమర్థురాలని, తనతో కలిసి పని చేస్తారని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రియాంక నియామకం తనకు చాలా సంతోషకరమని చెప్పారు. జ్యోతిరాదిత్య సింధియా కూడా చాలా సమర్థుడని చెప్పారు. ప్రియాంక, జ్యోతిరాదిత్యలకు తాను ఓ కార్యక్రమాన్ని అప్పగించానన్నారు.

మత, విభజన రాజకీయాలపై కాంగ్రెస్ సైద్ధాంతిక పోరాటం చేస్తోందని రాహుల్ గాంధీ అన్నారు. ప్రియాంక, జ్యోతిరాదిత్య (తరువాయి 5లో)

వచ్చే నెల 6 నుంచి..

ఏపీఎస్ ఆర్టీసీ సమ్మె

- 13 డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళన
- మద్దతు పలికిన అధికారుల సంఘం



విజయక్రాంతి, హైదరాబాద్: ఏపీఎస్ ఆర్టీసీలో కార్మిక సంఘాలు సమ్మె సైరన్ మోగించాయి. ఫిబ్రవరి 6 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లేందుకు కార్మిక సంఘాలు నిర్ణయం తీసుకున్నాయి. తమ డిమాండ్లను సాధించుకోవడానికి కార్మిక సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడ్డాయి. సంక్రాంతికి ముందే సమ్మెకు వెళ్లాలనుకున్న జేఏసీ నిర్ణయం తీసుకున్నప్పటికీ.. పండుగ తర్వాత డిమాండ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తామని ఆర్టీసీ యాజమాన్యం హామీ ఇవ్వడంతో వాయిదా వేసుకుంది. పండుగ తర్వాత జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఫిబ్రవరి 6 నుంచి నిరవధిక సమ్మెకు దిగాలని కార్మిక సంఘాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు కార్మిక జేఏసీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ 13 డిమాండ్లను ప్రభుత్వం (తరువాయి 5లో)

కన్నుల పండువగా జరిగిన 3వ రోజు

- సహస్ర చండీయాగము
- 300 చండీ పారాయణాలు– 2 లక్షల నవార్ణజపాలు పూర్తి



విజయక్రాంతి, హైదరాబాద్: దేశ ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ లోక కళ్యాణార్థం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తలపెట్టిన సహస్ర చండీయాగము మూడవ రోజైన బుధవారం కన్నుల పండుగగా జరిగింది. ఉదయం చతుర్వేద యాగ పురస్సర మహారుద్ర జపాభిషేక హవన సహిత సహస్ర చండీ మహా యాగాన్ని పురస్కరించుకుని ప్రాతఃకాల పూజానంతరం 300 చండీ పారాయణాలు పూర్తి చేసి సాయంకాలం 4 గంటల నుండి నవార్ణజపము 2 లక్షలు పూర్తి చేశారు. సాయంత్రం 7 గంటలకు ముఖ్యమంత్రి దంపతులు మహాహారతి, మంత్ర పుష్పము తీర్థ ప్రసాద వితరణతో సహస్ర చండీయగము మూడవ రోజు పరిసమాప్తి అయింది.

మహారుద్ర యాగము

శాంతి పాఠముతో ప్రారంభమై ఆవాహిత దేవతా పూజనము 41 ఏకాదశ రుద్ర అభిషేకములు పూర్తి చేసుకొని మధ్యాహ్నం 3 గంటల నుండి 41 ఏకాదశ హోమములు, క్రమార్చన హారతీ మంత్ర పుష్పములు జరిపి, అనంతరం జరిగిన భజన కార్యక్రమము ముఖ్యమంత్రి దంపతులను, భక్త జనులను విశేషంగా ఆకర్షించింది. తీర్థప్రసాద వితరణతో మహారుద్రము మూడవ రోజు పరిసమాప్తి అయింది.

రాజశ్యామల యాగము

రాజశ్యామల యాగంలో భాగంగా రాజశ్యామల మూల మంత్ర జపం, మంట ప్రార్చనలు, మూల మంత్ర హవనాలు, శరభ సాలువ మూల మంత్ర జపం హవనం, మాతంగి మహా విద్య హవనము, ప్రదోష కాల మంట ప్రార్చనలు, కుంకుమార్చన, సహస్ర నామార్చన, హారతి మంత్ర పుష్పము చతుర్వేద స్వస్తి పూజా కార్యక్రమాలు జరిగాయి.

బగళా ముఖి

బగళా ముఖ దేవతా ప్రిత్యర్థం ఆవాహిత దేవతా పూజానంతరం 10 వేల జపము పూర్తి చేసి సాయంత్రం 4 గంటలకు హరిద్రన్నముతో 2 వేల మూల మంత్ర హవనము పూర్తి చేసి రాత్రి 7.30 కు హారతి మంత్ర పుష్పము, తీర్థ ప్రసాద వితరణతో కార్యక్రమము పూర్తయింది.. వీటితో పాటు అరుణ పారాయణము మహాసారము, పంచ కాఠకముల పారాయణములు, నవగ్రహ జపానుష్టానములు, మహా మృత్యుంజయ జపములు నిర్వహించబడుతున్నాయి. ప్రతి యాగ మంటపములో జరిగే హారతి మంత్ర పుష్ప కార్యక్రమాలకు ముఖ్యమంత్రి దంపతులు హాజరవుతున్నారు. ఈ కార్యక్రమాలన్నీ శృంగేరి పీఠాధిపతులు, శారదా పీఠాధిపతుల దివ్య ఆశీస్సులతో విద్వదాహితాగ్ని బ్రహ్మశ్రీ మాడ్గుల మాణిక్య సోమయాజులు గురువు గారి పర్యవేక్షణలో జరుగుతున్నాయి. పూజా కార్యక్రమాలు వేద పండితులు పురాణం మహేశ్వర శర్మ, మంగళంపల్లి వేణుగోపాల శర్మ, శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, ఫణి శశాంక శర్మ, గంగవరం నారాయణ శర్మ, జి.కామేశ్వర శర్మ, కాసుల చంద్ర శేఖర శర్మల నిర్వహణలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం కార్యక్రమంలో మాజీ మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటెల రాజేందర్, ఎంపీలు వినోద్ కుమార్, కల్వకుంట్ల కవిత, జోగినపల్లి సంతోష్ కుమార్, హోంశాఖ సలహాదారు అనురాగ్ శర్మ, సరస్వతీ అవధాన పీఠంకు చెందిన మాడుగుల నాగఫణిశర్మ ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు, శేరి సుభాష్ రెడ్డి, దేవీ ప్రసాద్ , గ్యాదరి బాలమల్లు, మారం శ్రీనివాస్ రెడ్డి, మల్లయ్య యాదవ్, టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రావుల శ్రావణ్ కుమార్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

మీడియా సంస్థలు

ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయి

- జర్నలిస్టుల సమస్యలను పరిష్కారిస్తాం
- మేం చెప్పిందే వినాలి అనే డ్రామాలు ఇక నుంచి నడవవు
- కేటీఆర్



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఐదేళ్లు అవుతున్నప్పటికీ కొన్ని పత్రిక, మీడియా సంస్థలు ఇంకా ఆధిపత్య భావజాలం ప్రదర్శిస్తున్నాయని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జర్నలిస్టు, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌ను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కొన్ని పత్రికలు, మీడియా సంస్థలు మేం ఏం చేసిన కరెక్ట్, మేం ఏది చెప్తే అదే వేదమని తెలంగాణపై అధిపత్యాన్ని ప్రదర్శించే ధోరణిని మానుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అలాంటి అధిపత్య దోరణి ప్రదర్శించకపోతే మంచిదని సూచించారు. మీడియా సంస్థలతో తాము ఎలాంటి వివాదం కోరుకోవడం లేదన్నారు. తెలంగాణ తన అస్థిత్వాన్ని చాటుకునే దిశగా పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తు చేశారు. కానీ ఇక్కడ పొద్దున్నే లేవగానే అమరావతి వార్తలు దర్శనమిస్తున్నాయని, కానీ అమరావతిలో కూడా తెలంగాణ వార్తలు వేయాలనే సంస్కారం ఉండాలని అన్నారు. ఢిల్లీలో కూడా తెలంగాణ వార్తలు ఉండడం లేదని, తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఉన్నట్లు వార్తలు కనబడడం లేదన్నారు. అదేమని అడిగితే ఆంధ్రా ఎడిషన్ అని చెబుతున్నారని, తెలంగాణ ఎడిషన్‌లో ఆంధ్రా వార్తలు ఎందుకని ప్రశ్నించారు. ఈ అంశాలపై జర్నలిస్టులు ఆలోచన చేయాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ భావజాలాన్ని అణువణువునా నింపుకున్న తెలంగాణ పత్రికలను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడి ఐదేళ్లు అవుతున్నప్పటికీ తెలంగాణ వాదాన్ని, అస్థిత్వాన్ని తొక్కిపెడుతున్న ధిక్కార ధోరణి పోవాల్సిన అవసరం ఉందన్నారు. మేం చెప్పిందే వినాలి అనే డ్రామాలు ఇక నుంచి నడవవు అని స్పష్టం చేశారు. తెలంగాణ పత్రికలు, మాధ్యమాలకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులకు పెద్దపీత వేశామని గుర్తు చేశారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా జర్నలిస్టుల సంక్షేమానికి టీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనదే బాధ్యత అని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఓ సంక్షేమ నిధిని ఏర్పాటు చేశామన్నారు. కోర్టు వివాదాలు లేకుండా ఇళ్ల స్థలాలు, ఆరోగ్య కార్డుల పంపిణీకి చిత్తశుద్ధితో ముందుకు పోతున్నామని చెప్పారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల భవనానికి స్థలం కేటాయించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడుతామని హామీ ఇచ్చారు.

దిమాక్ ఖరాబ్



ఈశ్వరీబాయి సేవలు మరువలేనివి

- ఘనంగా శతజయంతి ఉత్సవాలు
- గద్దర్‌కు పురస్కారం



విజయక్రాంతి, హైదరాబాద్: ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు, మాజీ మంత్రి ఈశ్వరీబాయి శతజయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి.ఈ ఉత్సవాల సందర్భంగా రవీంద్రభారతి లో జరిగిన కార్యక్రంలో లోక్‌సభ లో కాంగ్రెసుపక్ష నాయుకుడు మల్లిఖార్జునఖర్గే ముఖ్యఅతిథి గా పాల్గొని ప్రసంగించారు. ఈశ్వరీబాయి సేవలు మరువలేనివని, ఆమె శత జయంతి ఉత్సవాలలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ చైర్ పర్సన్,మాజీ మంత్రి జె. గీతారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో విప్లవ గాయకుడు గద్దర్‌కు ఈశ్వరీబాయి మెమోరియల్ అవార్డును అంద చేశారు. ఈ సభలో మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్ రెడ్డి ప్రసంగిస్తూ బడుగువర్గాల అభ్యున్నతికి ఈశ్వరీబాయి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. మాజీమంత్రి కె.జానారెడ్డి ప్రసంగిస్తూ క్రమం తప్పకుండా ప్రతీయేటా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్న గీతారెడ్డిని అభినందించారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రత్నప్రభ మాట్లాడుతూ బలహీనవర్గాల అభివృద్ధికి ఆమె చేసిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. అట్టడుగువర్గాలవారి అభ్యున్నతికి పాటుపడిన ప్రజాగాయకుడు గద్దర్‌కు ఈశ్వరీబాయి అవార్డు ప్రదానం చెయ్యడం పట్ల సమావేశంలో పాల్గొన్న అతిథులంతా ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యకమంలో పార్లమెంటు మాజీ సభ్యుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారి పల్లె – కృష్ణపట్నం మధ్య

కొత్త రైల్వే మార్గంపై సమీక్ష

- 15.19 మిలియన్ టన్నుల సరుకు రవాణా



విజయక్రాంతి, హైదరాబాద్ : కృష్ణపట్నం పోర్టు నుంచి గత సంవత్సరం డిసెంబర్ నాటికి 15.19 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే కేంద్ర కార్యాలయం రైల్ నిలయంలో బుధవారం ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్.మధుసూదన రావు అధ్యక్షతన కృష్ణపట్నం పోర్టు రవాణా వినియోగదారుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఉదే ఉత్సాహంతో 20.25 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తామని సరుకు రవాణా వినియోగదారులు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే అదికారులు, సరుకు రవాణా ఎగుమతిలో మెరుగుదల కోసం రవాణా వినియోగదారులకు ఇస్తున్న వివిధ రాయితీ పథకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిచారు. సమావేశంలో త్వరలో ప్రారంభించబోయే ఓబులవారి పల్లె – కృష్ణపట్నం మధ్య కొత్త రైల్వే మార్గం నిర్మాణం, రవాణఅభివృద్ధికై చేపట్టిన కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. కార్యక్రమంలో చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బి.నాగ్యాతో పాటు ఆపరేటింగ్, కమర్షియల్ విభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.






శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ వికంబి నామ సంవత్సరం
ఉత్తరాయణం
హేమంత ఋతువు
పుష్య మాసం

సూర్యోదయం	: ఉ. 06:49	యోగం	: శోభన 18:12
సూర్యాస్తమయం	: సా. 06:06	కరణం	: బవ 10:23 భాలవ 20:53
పక్షము	: కృష్ణపక్షం	రాహుకాలం	: మ. 1:51, 3:15
తిథి	: చవితి 20:53	యమగండం	: ఉ. 6:53, 8:16
	తదుపరి చవితి	వర్జ్యం	: ఉ. 12:59, 2:27
నక్షత్రం	: పుబ్బ 18:22	అమృతకాలం	: సా. 12:36, 2:03




సూక్తి సుధ

తన స్వంత మాంసానికి కొవ్వు పట్టేలా చేసేందుకు, ఒక జంతువు మాంసాన్ని తినేవాడు నిజమైన కరుణను ఎలా అభ్యసించగలడు?

– తిరువల్లువార్

శతాబ్దికి చైతన్య స్ఫూర్తి షిరిడీ సాయిబాబా






గురు బోధనలు విశ్వవ్యాప్తం షిరిడీ సాయిబాబా. ఈ శతాబ్దికి చైతన్య స్ఫూర్తి. బాబా గురించి ఎంత చెప్పుకున్నా తనివితీరదు. బాబా సమాధి అయ్యి వంద సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రస్తుతం షిరిడీనాథుడికి విశ్వ వ్యాప్తంగా కోట్లాది భక్తులు ఉన్నారు. షిరిడీ సాయిబాబా నేడు కోట్లాది భక్తుల ఆరాధ్య దైవం గురు పరంపరలో సాయిబాబా ఎన్నో వారనేది చెప్పడం కష్టం. ఆయన చాలా సామాన్యంగా జీవిస్తు కోట్లాది భక్తులకు గురువయ్యారు. దక్షణాదిలో అందులోను తెలుగు రాష్ట్రాలలో సాయి ఆలయం లేని ఊరు కాని, పట్టణం కాని లేవనే చెప్పాలి. షిరిడీ సాయికి 55 దేశాల్లో 9 వేల ఆలయాలు ఉన్నాయి. తన భౌతిక దేహానంతరం కూడా తాను అప్రమత్తుడనేనని, భక్తులను కాపాడతానని బాబా ప్రకటించారు. షిరిడీ బాబా గురించి ఎంత చెప్పినా తనివి తీరదు. ఆయన బోధనలు అలాంటివి. ఆయన తనను నమ్మిన భక్తులను కాపాడిన విధం కూడా అటువంటిదే.

బాబా బోధనలు:

తాను ఎక్కడి నుంచి వచ్చాడు, తన తల్లిదండ్రులు ఎవరు అన్న విషయాలను బాబా తన జీవిత కాలంలో ఎప్పుడూ చెప్పలేదు. ఎవరైనా బాబా దగ్గర కుల మతాల ప్రస్తావన తెస్తే కోప్పడేవారు. ఎప్పుడూ "సబ్‌కా మాలిక్ ఏక్ హై" అనేవారు. షిరిడీలో శ్రీరామనవమి పండుగను శాస్త్రోక్తంగా జరిపేవారు. అలాగే ఈదుల్ ఫితర్ పండుగ నాడు మసీదులో నమాజు చేయించేవారు. ఒకసారి బాబా ఓ ఇంటి కప్పు మీదకి ఎక్కడానికి నిచ్చెన తెమ్మన్నారు. అది తెచ్చిన కుర్రాడికి రెండు రూపాయలు ఇచ్చారు. ఆ రోజుల్లో రెండు రూపాయలంటే చాలా ఎక్కువ. దాంతో అక్కడున్న భక్తులు నిచ్చెన తెచ్చినందుకు అంత ఇవ్వాల్సిన అవసరం ఏమిటని అడిగారు. దానికి సాయిబాబా మనం ఎవరితో నైనా పని చేయించుకుంటే వారికి సరిపడా కూలీ ఇవ్వాలి. లేక పోతే రుణపడి పోతాం అనేవారు. నిష్ఠ, నియమం విజయానికి సోపానాలని బాబా చెప్పేవారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెడితే తనకు పెట్టినట్లే అంటారు బాబా. దాహంతో ఉన్న వారికి నీళ్లు, పేదవారికి బట్టలు, అలసి వచ్చిన వారికి విశ్రాంతి తీసుకోవడానికి నీ అరుగు మీద ఇంత చోటు ఇస్తే భక్తితో నన్ను సేవించినట్లే అని బాబా చెప్పేవారు. దేవుడిని ప్రసన్నం చేసుకోవాలంటే పెద్ద పెద్ద పూజలు చేయాల్సిన అవసరం లేదు. ఉపవాసాలు ఉండనక్కరలేదు. శ్రద్ధ, సహనం ఉంటే చాలు అనేది బాబా వాక్కు. ఇతరుల గురించి చెడుగా మాట్లాడితే బాబా చాలా కోపగించేవారు. బాబా వ్యక్తుల్లో ఒక వ్యక్తి సాఠే వాడలో కూర్చుని ఉన్నప్పుడూ మరో వ్యక్తి గురించి చెడుగా మాట్లాడేవాడట. ఒకరోజు బాబా అతడిని పిలిచి, పంది అందరూ అసహ్యించుకునే అశుద్ధాన్ని ఇష్టంగా తింటుంది. అలాగే నువ్వు నీ తోటి వారి గురించి చెడుగా మాట్లాడి, నీ నాలుకతో వారు చేసుకున్న పాపాలను కడుగుతున్నావని అన్నారు. ఒకర్ని నిందించినా ఒకరి గురించి తప్పుగా మాట్లాడినా వారి పాపాన్ని శుభ్రంచేస్తున్నట్లే అనేవారు.



సదా నింబ వృక్షస్య మూలాది వాసాత్
సుధా స్రావిణం తిక్త మప్య ప్రియంతం
తరుం కల్ప వృక్షాధికం సాధయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం

బాబా షిరిడీలో చెట్టు కింద కూర్చుని ధ్యానం చేసుకునే వారు. దీంతో ఆ వేప చెట్టు ఆకుల్లో చేదు పోయింది. మరి ఆయనను మనసులో నిలుపుకుంటే మన కష్టాలు తొలగి పోతాయని ఈ శ్లోకంలోని భావం.

భక్తులు ఎన్ని కానుకలు ఇచ్చినా సాయినాధుడు అవేవి తనవి కాదనేవారు. భిక్ష పాత్ర, జోలె, సటకా మాత్రమే తన ఆస్తులనేవారు. సంపాదించిన కొద్దీ కోరికలు పెరుగుతాయి. ఆ కోరికలని తీర్చుకోనే క్రమంలో కష్టాలు పెరుగుతాయి. వైరాగ్యంతో జీవించడానికి మించిన సంతోషం ఉండదే అని బోధించేవారు. మానవత్వమే సాయితత్వం. తాను నిరాడంబరంగా ఉంటూ శ్రద్ద సహనం, ప్రేమ, దయతో ఉండాలని సూచించారు షిరడీ సాయి బాబా. నా కోసం మీరు ఒక అడుగు వేస్తే, నేను మీ కోసం పది అడుగులు వేస్తాను అనే వారు బాబా. నా జీవిత కథను నేను రాస్తాను. రాస్తున్న వారు కేవలం పనిముట్టు మాత్రమే. నా బోధనలు వింటూ వింటూ ఆత్మ సాక్షాత్కారం, ఆపై బ్రహ్మానందం లభించి సాధకుడు తరిస్తాడు. ఈ మాటలు షిరిడీ బాబావి. ఈ శతాబ్దికి మార్గదర్శి, దిక్సూచి సాయినాధుడే. బాబా నామం, రూపం, భావం కోట్లాది మందికి అన్నం పెడుతూనే ఉన్నాయి.

ఓం శ్రీసాయి నాధాయనమః

– రామ్‌మనోహర్ శివకోటి

ప్రతి విషయానికి మార్గం ఒకటుంటుంది



చాణక్యం

శ్లో॥ భస్మనా శుధ్యతే కాంస్యం తామ్రమమ్లేవ శుధ్యతి।
రజసా శుధ్యతే నారీ నదీ వేగేన శుధ్యతి॥

కంచుపాత్ర బూడిదతోను, రాగిపాత్ర చింతపులుసుతోను, స్త్రీ రజస్వల అయిన తర్వాత, నది తీవ్ర గమనం కలిగి(వరద వచ్చుటచే) నిర్మలములగునని ప్రముఖ ఆర్థిక నీతిజ్ఞుడు, అపర చాణుక్యుల వారు పై శ్లోకంలో తెలియచేస్తున్నారు. ఈ శ్లోకాన్ని విశ్లేషిస్తే దుష్టుల ద్వారా దూషిత అయిన స్త్రీ రజస్వల అయినచో శుద్ధమనగా అనేక కారణాలచేతనైన స్త్రీ దుష్టులచే బలాత్కరింపబడి చెఱపబడినను రజస్వలానంతరం శుద్ధయై స్వీకరింపదగినదగును.

దీనికి అనుసంధా నంగా ఇంకో ఉదాహరణ చెబుతున్నారు. ఉమ్మి, మలమూత్రాదులు, చెత్త చెదారంతో మలినమైనట్టిది ఒక బలమైన ప్రవాహము వచ్చి వాటిని ముందుకు తోసివేస్తే ఎలా పరిశుభ్రమగునో అలానే పవిత్రమవుతున్నది. ఇక్కడ అపరిశుభ్రమైన వానిని ఏదైనా మార్గం తో పరిశుభ్రం చేసినయెడల అది మరల మనం ఉపయోగించుకోవడానికి అనువుగా ఉంటుందంటున్నారు. కంచుపాత్రను కొద్దికాలం పాటు వాడకుండా ఉండటం వల్ల అది కిలుము పట్టి మరల వాడటానికి వీలు లేకుండా ఉంటుంది. అటువంటి పాత్రను బూడిదగాని, ఏ ఇతర పదార్థముల వల్లను గాని తోమితే శుభ్రమవుతుందంటున్నారు. అలాగే రాగిపాత్రను చింత పండు నుండి తీసిన పులుసును ఉపయోగించి తుడిస్తే పాత్రపై ఉన్న మలిన పదార్థం అంతా పోయి కొత్త పాత్ర వలె మెరుస్తూ పరిశుభ్రంగా కానవస్తుంది. దాన్ని నిరాక్షేపంగా ఉపయోగించవచ్చునన్నమాట. పై పాత్రలను శుభ్రం చేసి మరల ఉపయోగకరంగా మార్చుకుంటామో అదే విధంగా ఏ కారణం చేతనైనా దుర్మార్గుల పాలన పడి ఆ స్త్రీ మలినమైనచో ఇక ఆమె ఈ సంఘంలో ఎందుకూ పనికి రాదని ముద్ర వేసి పట్టించుకోరు. కానీ ఇక్కడ చాణక్యుల వారు ఆమె కూడా పై వస్తువుల వలె ఉపయోగకరం కాదని వదిలివేయకూడదని, దీనికి పరిహారం కూడా ఉందని తెలియచేస్తున్నారు. ఆమె తదనంతరం మరల రజస్వల అయిన తర్వాత తనలోని మలిన పదార్థాలను విసర్జిస్తుందని ఆ తర్వాత ఆమెను పరిశుభ్రంగా భావించి స్వీకరించవచ్చునని తెలియచేస్తున్నారు. ఇలా ఏ విషయానికైనా పరిహారం ఉంటుందని చాణక్యుల వారు తెలుపుతున్నారు.

– యామిజాల సుబ్రహ్మణ్యం

ధర్మ సందేహాలకు సమాధానాలు

ఘంట ఎప్పుడెప్పుడు మ్రోగించాలి?

ఉద్ఘాటనే కవాటస్య ప్రస్తుతే పూజనే తథా
అవాహనాఽర్ఘ్యే స్నపనే పుష్పే ధూపేచ దీపకే।
నీరాజనే యవనికాసముద్ధారే నివేదనే
హోమ భూత బలౌ కర్మణ్యద్వాహే చలనం మణేః॥



ఆలయం/ పూజామందిరం తెరిచేటప్పుడు, ప్రార్థన చేసేటప్పుడు, పూజచేసేటప్పుడు ఆవాహన చేసేటప్పుడు అర్ఘ్యం ఒసగేటప్పుడు, స్నానం చేయించేటప్పుడు, నివేదనం చేసేటప్పుడు, పుష్పాలు, ధూప–దీప నీరాజనాలు సమర్పించేటప్పుడు తెర తీసేటప్పుడు, నివేదనం చేసేటప్పుడు హోమం చేసేటప్పుడు, భూతబలి ఇచ్చేటప్పుడు, కల్యాణ సమయమప్పుడు గంట మ్రోగించాలి. అయితే కొన్ని ప్రమాణాలు నివేదన సమయంలో ఘంట మ్రోగించరాదు అని ఉండటం వల్ల వారివారి సంప్రదాయానుసారం నివేదన సమయంలో ఘంట మ్రోగించాలా? వద్దా? అన్నది నిర్ణయించుకోవాలి.

ఘంటకు అధి దేవతలు ఎవరు?

ఘంటాయాం వాసుదేవంచ జిహ్వాయాంతు సరస్వతీం
తాడనం వహ్నిదైవత్యం దండే చైవతు భాస్కరమ్
నాదంతు ఈశ్వరం ప్రోక్తం ఘంటాయా మధి దైవతాః

అంటే ఘంటకు– వాసుదేవుడు, ఘంటకు లోపల ఉండే నాలుక (పిడికిలి)కి– సరస్వతి, మ్రోగించుటకు– అగ్ని దేవుడు, ఘంటపై భాగాన ఉండే పిడికిలికి– సూర్యుడు, మ్రోగెడు మ్రోతకు ఈశ్వరుడు అధిదైవతాలు.

ఘంట వాయించినందుకు ఫలితం ఏమిటి?

శ్లో॥ ఉత్పాదనం పిశాచాదేః ప్రణనంచహరేఃపరం
సన్నిధాన మమర్త్యానాం ఘంటాయాత్ చాలానాద్భవేత్

దుష్టశక్తులయిన పిశాచాలు మొదలైయినవి ఆ చోటు వదలి పోతాయి. పరమ పురుషుడగు శ్రీహరి ప్రీతి పొందేందుకు, మానవులకు శుభాలు కూర్చేందుకు, దేవతలు వచ్చేందుకు ఘంటాచలనం చేయాలి.

డా॥ పి. భాస్కర యోగి

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. ఋష్యశృంగుని భార్య ?
2. అర్జునికి ఉలూపి అనే నాగకన్యకు కలిగిన కుమారుడు?
3. త్రిశంకుడు ఏ వంశానికి చెందిన వాడు?
4. విచిత్ర వీరుని భార్యలు?
5. అయోధ్యానగరాన్ని పాలించిన సగరుని భార్యల పేర్లు?
6. కంసుని సోదరులు?
7. సగరుడు ఎన్ని సంవత్సరాలు తపస్సు చేసాడు?
8. దేవమీఢుని కుమార్తెలలో ప్రసిద్ధిచెందినది?
9. జహ్ను మహర్షి చెవుల నుంచి వచ్చింది కనుక, గంగని ఏమని పిలుస్తారు?
10. ఛాయ, సూర్యులకు జన్మించినవారు?

జవాబులు

1. శాంత
2. ఇరావంతుడు
3. సూర్య
4. అంబిక, అంబాలిక
5. కేశిని, సుమతి
6. [illegible]
7. 100 ఏళ్లు
8. రోహిణి
9. జాహ్నవి
10. [illegible]

బృహన్మానసకరణం

వేద విజ్ఞానం

భాగం-83

బెరూని అభిప్రాయంలో, దీని గ్రంథకర్త మనువు. దీనికి ఉత్పలుడు వ్యాఖ్యానం రాశాడు. లఘు మానసమనే పేరుతో ముంజాలుడు సంక్షిప్త గ్రంథాన్ని రాశాడు. లఘు మానసం శక. 854కు చెందినది కావడంతో బృహన్మానస కరణం శక.800 ప్రాంతంలో సంకలనం చేయబడి ఉండవచ్చని తెలుస్తోంది.

బలభద్రుడు


బెరూని తన గ్రంథాలలో చాలా సందర్భాలలో బలభద్రుని వచనాలను, అతని గ్రంథాల నుండి, అతని వ్యాఖ్యానాల నుండి, వచనాలను సేకరించి ఉదహరించడం జరిగింది. బెరూని ప్రకారం, సిద్ధాంతం, సంహిత, జాతకాలపై బలభద్రుడు రచనలు చేశాడు. అంతే కాక, 'ఖండఖాద్యం, బృహజ్జాతకా'లపై వ్యాఖ్యానాలు రాశాడు. బలభద్రుని 'గణిత'మును బెరూని 'తంత్ర' గ్రంథాన్ని అని పేర్కొన్నాడు. దాని ప్రకారం, యుగాదిగా అహర్గణాన్ని చేయాలని ఇందు సూచించబడినట్లు తెలియచేశాడు. బెరూని వచనాల ప్రకారం, బ్రహ్మగుప్త సిద్ధాంతంపై బలభద్రుని వ్యాఖ్యానం ఉండేదని తెలుస్తోంది. అలాగే బెరూని పతంజలి యోగ శాస్త్రం నుండి అనేక ఉదాహరణలను ఇచ్చాడు. ఈ విషయం గురించి ప్రొ.సచావు తెలియచేస్తూ, వచనాల సందర్భాన్ని పరిశీలించగా, ఇవి బలభద్రునితో రాయబడి ఉండాలని పేర్కొన్నాడు. ఎక్కువ భాగం ఖగోళశాస్త్రానికి సంబంధించిన విశేషాలు ఉదహరించబడుటంతో, అతని అభిప్రాయం సత్యం కావచ్చునని తోస్తోంది. బలభద్రుడు తన గ్రంథాలలో కనౌజు, స్థానేశ్వర ప్రాంతాల రేఖాంశాలు తెలియచేయడం కారణంగా, అతను ఆ ప్రాంతంలో నివశించే వాడేమోనని అనిపిస్తుంది. ఇతని కాలం సుమారు శక.800 సంవత్సరం కావచ్చును.

విత్తేశ్వరునిడు – కరణసారము (శక.821)

భదత్త (లేదా మిథత్తుని) కుమారుడైన విత్తేశ్వరుడు కరణసారం అనే గ్రంథాన్ని సంకలనం చేశాడు. శక.821ను గ్రహగణిత సంవత్సరంగా తీసుకున్నాడు. బెరూని అభిప్రాయంలో, విత్తేశ్వరుడు నాగపూరు వాస్తవ్యుడు. ఈ గ్రంథంలో కాశ్మీరు అక్షాంశం 34డిగ్రీల 9' అని చూపాడు. సప్తర్షి మండలం గతిని పరిగణనలోనికి తీసుకోవడం, ఇప్పటికీ కాశ్మీరు ప్రాంతంలో కాలగణనలో ఇది ప్రాచుర్యంలో ఉండడం మూలంగాను, విత్తేశ్వరుడు కాశ్మీరు దేశస్థుడని ఈ రచయిత (దీక్షిత్) విశ్వసించాడు. కరణసారంలో, గ్రహగణిత సంవత్సరంలో మధ్యమేష సంక్రమణ సమయానికి ఉన్న గ్రహ స్థితులను బట్టి, గ్రహాల సగటు అక్షాంశాలను కనుగొనే విధానం వివరించబడినది. ఇందు బెరూని మేష సంక్రమణానికి భాగాలలో తిథిశుద్ధిని చేసే విధానం (మధ్యమేష సంక్రమణ సమయానికి ఉన్న తిథిని కనుగొనడం) చెప్పబడింది. దీనిని వివరించడానికి, అలాగే మహాయుగంలో చంద్ర భగణాలు 57753336గా గ్రహించబడ్డాయి. ఈ సంఖ్య సూర్యసిద్ధాంతంలో, ఉత్పలుని పౌలిశ సిద్ధాంతంలోను బెరూని కంటే ముందే అరబిక్ భాషలోకి అనువాదమైన మొదటి ఆర్యభట సిద్ధాంతంలోను చెప్పబడి ఉంది. ఆఫ్రెచ్ కేటలాగులో ఈ గ్రంథం గురించి ప్రస్తావన లేదు. దీన్నిబట్టి, ప్రస్తుతం ఇది ఎక్కడా కూడా లభించకపోవచ్చునని అనిపిస్తోంది. ఖగోళశాస్త్ర గ్రంథాలను రచించిన ఒక విత్తేశ్వరుడు ఉండేవాడని తెలుస్తోంది. ఆల్‌బెరూని పేర్కొన్న విత్తేశ్వరుడే వటేశ్వరుడు కావచ్చునని అనిపిస్తోంది

–డా॥ రేమెళ్ల అవధానులు

సమాధి అంటే ఏమిటి?



ఈ మధ్యాహ్నం భగవాన్ భక్తులతో ఇష్టాగోష్టిగా అనేక విషయాలు మాట్లాడుతూ మధ్య మధ్య బోధ చేస్తూ చాలా ప్రొద్దు గడిపారు. విసుగు విరామం లేకుండా మాట్లాడటం చూచి, కొత్తగా వచ్చిన సాంధులోకరు లేచి, "భగవాన్! తామెప్పుడు సమాధిలోకి వెడతారు?" అని ప్రశ్నించారు. భక్తులంతా పక్కున నవ్వారు. భగవంతులకు కూడా నవ్వు వచ్చింది. రవంత తాళి "ఓహో, అదా నీ సందేహం. సరే చెబుతాగాని అసలు సమాధి అంటే ఏమి? ఎక్కడికి పోవాలి? కొండమీదికా, గుహలోకా? ఆకాశం మీదికా? సమాధి అంటే ఎట్లా ఉండాలి? ఏమిటి చెప్పు" అన్నారు భగవాన్.

పాపమతడేమీ చెప్పలేక చతికిలబడి కొంతసేపు పలకకుండా ఉండి "ఇంద్రియ సంచలన మణగితేగాని సమాధి కాదంటారే, ఆ సమాధిలోకి తామెప్పుడు దయచేస్తారని అడిగా" నన్నాడు. "ఆ, అదీ సమాచారం. ఏమిరా, యీ స్వామి ఎప్పుడు మాట్లాడుతూనే ఉంటాడే. ఈయన ఏమి జ్ఞాని? అని వారి ఉద్దేశ్యం. పద్మాసనం వేసుకొని, చేతులు కట్టుకొని ఊపిరి బిగబట్టి కూర్చుంటే గాని సమాధి కాదు.ఒక గుహ కూడా ఉండాలి. నిత్యం దానిలోకి పోతూ, వస్తూ ఉండాలి. అప్పుడ 'ఈ స్వామి బలే దొడ్డవాడురా!' అంటారు. నేనో ఈ భక్తులు, ఈ కార్యక్రమం అంతా పెట్టుకొని ఎప్పుడూ మాట్లాడుతూ ఉంటే, ఇదేమి స్వామిరా! అని వారి సందేహం. పాపం, ఏ జేసేది నేను? పూర్వం కూడా జరిగింది ఇలా రెండుసార్లు. నేను గురుమూర్తంలో ఉండగా చూచిన వారొకరిద్దరు స్కందాశ్రమం వచ్చి, అందరితో మాట్లాడుతూ కార్యక్రమం గమనిస్తూ ఉండటం చూచి చాలా ఆదుర్దాతో 'స్వామి, స్వామి, మీ వెనుకటి రూపంతో దర్శనమీయండి స్వామి' అని దుఃఖించడం కూడా కద్దు. అయ్యో యీ స్వామి చెడిపోతున్నాడే, అని వారి తలంపు. మనమే చేస్తాం? అప్పుడట్లా ఉండవలసి వచ్చింది. ఇప్పుడిట్లా ఉండవలసి వచ్చింది. ఏ కాలానికి ఎట్లా నడవాలో అట్లా నడుస్తుంది. కాని, వీరి దృష్టికి అన్నం తినకుండాను, మాట్లాడకుండానే ఉంటే చాలు, స్వామిత్వం వచ్చేస్తుంది. లోకం ఇదే భ్రమలో పడతారు" అన్నారు భగవాన్.

– సూరి నాగమ్మ (రమణాశ్రమ లేఖలు)

సప్తవర్ణ స్వరూపిణి

'దీపాకారోర్ధమాత్రశ్చ లలాటే వృత్త ఇష్యతేః
అర్ధచంద్రస్తథాకారః పాదమాత్రస్తదూర్ధ్వతః"

నుదుటిపై దీపం వలె ప్రకాశించే 'ఓం' లేక 'హ్రీం'లలో పూర్ణ బిందువు ఉంది. పైభాగంలో దీపాకారమై పాదామాత్రకాలం కలిగిన అర్ధచంద్రుడు అని వివరణ, రెండు అర్ధచంద్రికల వంటి కనుబొమ్మలతో ప్రకాశించునది అని అర్థం. సర్వవర్ణే మహాదేవి సంధ్యావిద్యే సరస్వతి' ఇక్కడ భువనేశ్వరీదేవి ఏడురంగులతో ఉంటుంది. అగ్ని సూర్య తేజస్సులను కలిగినపుడు ఉద్భవించే సప్తవర్ణ స్వరూపిణిగా ఆమెను వర్ణించడమైంది. ఆమె అత్యద్భుత వర్చస్సుని సౌందర్య అతిశయానికి గుర్తుగా ఈ వర్ణన వివరిస్తున్నది.

పరంజ్యోతి స్వరూపమైన బీజస్వరూపిణి నుండి అణిమాది ఆవరణ దేవతల ప్రభావంతో సూర్యచంద్రులకు, అగ్నికి కూడా ఈ సప్తవర్ణాల వెలుగులు ప్రసరిస్తుంటాయి. ఈ కిరణాలకు లెక్క లేదు, అనంతమైనవి. చంద్రకిరణాలు, సూర్యకిరణాలు, అగ్నికిరణాలు పరమేశ్వరి నుండి సృష్టిలోకి ప్రసరించి, ప్రకృతిని రసమయంగా మారుస్తాయి. సూర్యుడితో పగలు, చంద్రునితో రాత్రి అగ్నికి ప్రజ్వలనా శక్తి వేడిని అందించే సమ్మోహనమైన ఆదిపరాశక్తి అని దీని అర్థం. బ్రహ్మపదార్థంగా తేజోమయమైన పరమేశ్వరీదేవి మహత్తును వర్ణించడానికి భాష చాలదు, పదాలు లేవు, శక్తి లేదు. కోట్లాది సూర్యుల కాంతులతో విరాజిల్లుతున్నప్పటికీ లక్షల కోట్ల చంద్రుల చల్లదనాన్నీ కలిగి ఉన్నది. కొన్ని కోట్ల మెరుపులు ఒక్కసారి మెరిసినట్టు అమ్మవారు ప్రత్యక్షం అవుతుంది. ఈ కాంతిపుంజంతో కళ్ళు మిరుమిట్లు గొలిపి దృష్టి శూన్యమవుతుంది. ముందు ఏమీ కనబడదు. ఇటువంటి మహోజ్వలమైన తేజోకాంతిని తగ్గించు కోమని పరాశక్తిని వేడుకోవాలి. అప్పుడు శాంత స్వరూపంగా మన ఇంద్రియాలకు గోచరం కావడానికి మనలను అనుగ్రహి స్తుంది.



అవ్యక్తమైన రూపాన్ని వ్యక్తం చేయగలగడమే అమ్మవారి మహత్తు. పరాత్పరురాలైన ఈశ్వరి జగత్తులో సర్వజీవులకు వారి వారి కర్మలను అనుసరించి దేహేంద్రియాలను ప్రసాదిస్తుంది. కర్మను నిర్దేశిస్తుంది. కర్మఫలాన్ని ఒకసారి ఈ జన్మలో, మరోసారి మరోజన్మలో ప్రసాదిస్తుంది. సూక్ష్మరూపిణియై మానవ శరీరంలో ఇంద్రధనుప్రభగా స్థిరపడుతుంది. మనకు ఏకాగ్రతను ధ్యానశక్తిని ప్రసాదించే ఇంద్రధనుప్రభ అద్భుతమైన దేవత.


'హృదయస్థా': హృదయ స్థానంలో సూర్యమండలం ఉంది. ఆ స్థానంలో ఉండే పరమశివుని ప్రదేశమే 'హృదయం' అని ఉపనిషత్తులో వివరించారు. మర్రి విత్తనంలోని శక్తి అంతటా వ్యాపించినట్లు, హృదయస్థానంలోని శక్తి కూడా జగత్తు అంతా వ్యాపించి ఉంది. 'పద్మకోశ ప్రతికాశగ్ం హృదయం చాప్యధోముఖమ్' హృదయంలో ఆమెను ధ్యానించగలిగిన స్వరూపంతో ఉన్నది. అమ్మవారి పరాబీజానికే 'హృదయమని' పేరు. పరమాత్మ పరాబీజం తెలిసిన వాళ్ళకు అడుగడుగునా సుఖం కలుగుతుందని చెప్పబడింది. విత్తు నుండి హృదయం పుట్టినట్టు సర్వజగత్తులు కూడా హృదయం నుండే ఉద్భవిస్తున్నవి.

త్రిగుణాత్మక స్వరూపిణి



– సి. విజయలక్ష్మి రాజం





ఇంటిలోని ధనము నిది నాది యననుచును
మంటిలోన దాచు మంకుజీవి
కొండబోడు వెంట గుల్లకా సైనను
విశ్వదాభిరామ వినుర వేమ

తనువు లస్థిరమని ధనము లస్థిరమని
తెలుప గలదు తాను తెలియ లేదు
చెప్పవచ్చు పనులు చేయుట కష్టమౌ
విశ్వదాభిరామ వినుర వేమ

విజ్ఞత..కృతజ్ఞత..

వికాసమే విజయం

- మనం పొందిన కష్టాలను ఇసుకలో రాసుకోవాలి, మనకు అందిన కరుణను రాయిపై రాసుకోవాలి! మనకు ప్రసాదించిన వాటి పట్ల మనం కృతజ్ఞత చూపితే, మనకు మరింతగా ప్రసాదించబడుతుంది.
- చెడులో మంచిని చూడటం, విషాదంలో సంతోషాన్ని చూడటం, కష్టంలో లాభాన్ని చూడటాన్ని మనం అభ్యసించాలి. అప్పుడు మనం ద్వేషానికి బదులుగా కృతజ్ఞతను పెంపొందించుకోగలం.
- చేసిన ఉపకారాన్ని మరవడం.. అజ్ఞత,
  ఉపకారికి ఉపకారం చేయడం...విజ్ఞత,
  ఉపకారికి అపకారం చేయడం.. కృతజ్ఞత,
  త అపకారికి ఉపకారం చేయడం.. ధన్యత!

సుఖాల్ని పొందినందుకు దేవుడికి మనం కృతజ్ఞులుగా ఉండడం అనవసరం అనుకుంటే.. దుఃఖాల్ని పొందినందుకైనా కృతజ్ఞులుగా ఉండొచ్చు గదా!

– స్వామి పార్ధసఖానంద

శివానందలహరి

శ్రీ ఆదిశంకరాచార్యుల విరచితం-15



శ్లోకం:

అసారే సంసారే నిజభజనదూరే జడ ధియా
భ్రమంతం మామంధం పరమకృపయా పాతుముచితమ్ |
మదన్యః కోదీనస్తవ కృపణరక్షాతినిపుణః
త్వదన్యః కో వా మే త్రిజగతి శరణ్యః పశుపతే || 13 ||

భావం: మహాదేవ! నీ సేవకు దూరమైన నిస్సారమైన ఈ సంసారంలో గ్రుడ్డివాడనై భ్రమించు నాకు, మిక్కిలి కరుణతో జ్ఞానమిచ్చి బ్రోవవయ్యా!. నాకన్నా దీనుడు నీకు ఎవరున్నారు? ముల్లోకాలకూ నీవే దీన రక్షకుడవు, శరణువేడదగినవాడవు.

వివరణ: గృహస్థాశ్రమధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక, సంసారం అంటే అర్థమే తెలియక,

గృహస్థాశ్రమాన్ని, సంసారాన్ని తమ సాధనకు, తమ ఆధ్యాత్మిక చింతనకు అడ్డుపడేవిగా అపార్థం చేసుకొని తిట్టుకుంటూ దైన్యమైన జీవితాన్ని గడుపుతూ ఉండేవారు కొందరుంటారు. సంసారాన్ని చేసి చేసి శాశ్వతానందాన్ని ఇచ్చే సుఖం దైహిక, సాంసారిక సుఖాల ద్వారా లభించదని తెలుసుకుని సంసారాన్ని నిస్సారంగా భావించేవారూ ఉంటారు. భగవదారాధనకు ఆధ్యాత్మిక చింతనకు దూరం చేసిన సంసార సుఖంలో పడి ఇంతవరకు తాము గ్రుడ్డివారుగా బ్రతికామనే భావన కలుగుతుంది. తమ దీనస్థితి నుండి బయట పడవేయడానికి తగిన రక్షకుడెవరు అని తపన చెంది ఆలోచించినపుడు దీనజన బాంధవుడైన పరమేశ్వరుడు ముందు గుర్తుకు వస్తాడు. బేషరతుగా దీనులను రక్షించే స్వభావం ఒక్క భగవంతునికి తప్ప ఇతరులకుండదు. ఆయన రక్షణకు దీనత్వమే అర్హత గాని మిగిలినవి కావు. 'ముజ్జగాల్లోను ముక్కంటిని మించిన ముక్తి ప్రదాత, ఆది దేవుని మించిన ఆత్మజ్ఞాన ప్రదాత మరొకరు లేరని ఈ శ్లోకమందు అది ఈ శ్లోకంలో ఆది శంకరులు నొక్కి వక్కాణించారు.

ఆ ఆదిదంపతుల పాదపద్మాలకు నమస్కరిస్తూ
సర్వేజనా సుఖినోభవంతు

–డా॥ శ్రీరామ్, హైదరాబాద్

సీతారాముల వంశ చరిత్ర

మరుసటి రోజు ఉదయాన్నే దశరథుడు జనక మహారాజుతో ఇలా అన్నాడు 'మహానుభావుడైన విశ్వామిత్రుడి అనుమతితో నాకు ఎంతో కాలం పురోహితుడిగా ఉంటున్న, మా వంశాభివృద్ధిని కోరుకునే వశిష్ఠ మహర్షి మా వంశం గురించి చెప్తారు' అన్నారు. అయోధ్య నగరాన్ని పరిపాలించిన దశరథ మహారాజుగారి పూర్వీకుల గురించి చెప్తాను అని వశిష్ఠుడు చెప్పడం మొదలుపెట్టాడు..

మొదట బ్రహ్మగారు జన్మించారు, ఆ బ్రహ్మ నుండి మరీచి జన్మించాడు. మరీచికి కాశ్యపుడు, ఆయనకిసూర్యుడు, సూర్యుడికి మనువు, మనువుకి ఇక్ష్వాకు, ఇక్ష్వాకుకి కుక్షి, కుక్షికి వికుక్షి, వికుక్షికి బాణుడు, బాణుడికి అనరణ్యుడు, అనరణ్యుడికి పృథువ, పృథువకి త్రిశంకువు, త్రిశంకువుకి ధుంధుమారుడు, ధుంధుమారుడికి మాంధాత, మాంధాతకి సుసంధి, సుసంధికి ధ్రువసంధి, ప్రసేనజిత్ అని ఇద్దరు కుమారులు, పెద్దవాడైన ధ్రువసంధికి భరతుడు, భరతుడికి అసితుడు, ఈ అసితుడ వరకు రాజ్య పాలనం చేశారు, ఈ అసితుడు హైహయ, తాలజంఘా, శశబింద్వ అనే వంశాల వాళ్ళతో యుద్ధంలో ఓడిపోయాడు, తరువాత ఆయన హిమాలయాల పర్వతాలకి తన ఇద్దరి భార్యలతో వెళ్ళిపోయాడు, ఇంతలో ఒక భార్య గర్భం దాల్చింది మరొక భార్యకి సంతానం కలగలేదు. వేరొక భార్యకి సంతానం కలుగుతుందని ఇంకొక భార్య ఆమెకి విష ప్రయోగం చేసింది. అప్పుడే అక్కడికి వచ్చిన చ్యవన మహర్షి ఒక భార్య కడుపులో ఉన్న పిండాన్ని సంహరించడానికి రెండవ భార్య విష ప్రయోగం చేసిందని చెప్పారు. విషప్రయోగం జరిగినా చావకుండా ఆ విషంతోనే జన్మించాడు కనుక ఆ పుట్టినవాడికి సగరుడు అని(గరళం అంటే విషం) పేరు పెట్టారు. ఆ సగర చక్రవర్తి ఇద్దరి భార్యలలో ఒక భార్య కుమారులైన 60,000 మంది సగరులని కపిల మహర్షిభస్మం చేశారు. మరొక భార్య కుమారుడు అసమంజసుడు, అసమంజసుడికి అంశుమంతుడు, అంశుమంతుడికి దిలీపుడు, దిలీపుడికి భగీరథుడు, భగీరథుడికి కాకుత్సుడు, కాకుత్సుడికి రఘువు, రఘువుకి ప్రవృద్ధుడు(ఒకసారి ఈ ప్రవృద్ధుడు ధర్మం తప్పి ప్రవర్తిస్తే వశిష్ఠుడు ఆయనని శపించాడు, అప్పుడా రాజు తిరిగి వశిష్ఠుడిని శపిద్దామనుకుంటే ఆయన భార్య అడ్డుపడి కుల గురువుని శపించద్దు అనింది, కాని అప్పటికే తన కమండలంలోని నీళ్ళు చేతిలో పోసుకున్నాడు కనుక ఆ నీళ్ళని తిరిగి తన కాళ్ళ మీద పోసుకున్నాడు, అందుకని ఆయనని కల్మషపాదుడు అని పిలిచారు), ప్రవృద్ధుడికి శంఖణుడు, శంఖణుడికి సుదర్శనుడు, సుదర్శనుడికి అగ్నివర్ణుడు, అగ్నివర్ణుడికి శీఘ్రగుడు, శీఘ్రగుడికి మరువు, మరువుకి ప్రశుశ్రుకుడు, ప్రశుశ్రుకుడికి అంబరీషుడు, అంబరీషుడికి నహుషుడు, నహుషుడికి యయాతి, యయాతికి నభాగుడు, నభాగుడికి అజుడు, అజుడికి దశరథుడు, దశరథుడికి రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు. ఇది దశరథుడి వంశం, ఈ వంశంలోని రాజులు ఎన్నో వేల వేల సంవత్సరాలు రాజ్యపాలన చేసి, యాగాలు చేసి స్వర్గానికి వెళ్ళారు' అని వశిష్ఠుడు చెప్పాడు.



ఇదంతా విన్న జనకుడు ఎంతో సంతోషించాడు. మా వంశం గురించి కూడా చెప్తానని జనకుడు చెప్పడం ప్రారంభించాడు. 'మా వంశంలో మొదటివాడు నిమి చక్రవర్తి, నిమికి మిథి(ఈయన నిర్మించినదే మిథిలా నగరం), మిథికి ఉదావసువు, ఉదావసువుకి నందివర్ధనుడు, నందివర్ధనుడికి సుకేతు, సుకేతుకిదేవరాతుడు, దేవరాతుడికి బృహద్రథుడు, బృహద్రథుడికి శూరుడు, మహావీరుడు అని ఇద్దరు కుమారులు, మహావీరుడికి సుధృతి, సుధృతికి ధృష్టకేతువు, ధృష్టకేతువుకి హర్యశ్వుడు, హర్యశ్వుడికి మరుడు, మరుడికి ప్రతీంధకుడు, ప్రతీంధకుడికి కీర్తిరథుడు, కీర్తిరథుడికి దేవమీఢ, దేవమీఢకి విబుధుడు, విబుధుడికి మహీధ్రకుడు, మహీధ్రకుడికి కీర్తిరాతుడు, కీర్తిరాతుడికి మహారోముడు, మహారోముడికి స్వర్ణరోముడు, స్వర్ణరోముడికి హ్రస్వరోముడు, హ్రస్వరోముడికి జనకుడు, కుశధ్వజుడు. జనకుడికి సీతమ్మ అయోనిజగా లభించింది. తరవాత ఊర్మిళ పుట్టింది' అని జనకుడు చెప్పుకున్నాడు.

సాంకాశ్యం అనే నగరాన్ని పరిపాలిస్తున్న తన తమ్ముడైన కుశధ్వజుడిని తీసుకురమ్మని జనకుడు ఆదేశించాడు. కుశధ్వజుడు వచ్చాక..

వీర్య శుల్కాం మమ సుతాం సీతాం సుర సుత ఉపమాం |
ద్వితీయాం ఊర్మిలాం చైవ త్రిః వదామి న సంశయః ||

నా ఇద్దరు కుమార్తెలైన సీతమ్మని, ఊర్మిళని నీ కుమారులైన రామలక్ష్మణులకు ఇచ్చి వివాహం చెయ్యాలని అనుకుంటున్నాను, అలాగే నా తమ్ముడి కుమార్తెలైన శ్రుతకీర్తిని శత్రుఘ్నుడికి, మాండవిని భరతుడికి ఇచ్చి వివాహం చెయ్యాలని అనుకుంటున్నాను అని జనకుడు దశరథుడితో

ప్రవచనం

– డా॥ శ్రీ చాగంటి కోటేశ్వర రావు

అన్నాడు. దశరథుడు సంతోషంగా ఒప్పుకున్నాడు. తరువాత దశరథుడిని తన ఇద్దరు కుమారులతో మిథిలా నగరంలో గోదానం, పితృకార్యం చెయ్యమన్నాడు. నేటికి రెండు రోజుల తరువాత ఉత్తర ఫాల్గుని నక్షత్రంతో కూడి భగుడు అధిష్టాన దేవతగా ఉండగా వివాహం చేద్దామని ఋషులు నిర్ణయించారు. దశరథుడు గోదానం, పితృకార్యం మొదలైన కర్మలను పూర్తిచేసాడు. తరువాత ఆయన నాలుగు లక్షల గోవులు(బంగారు కొమ్ములు కలిగినవి), ఒక్కో కుమారుడితో లక్ష గోవుల్ని దానం చేయించాడు. అలాగే బ్రాహ్మణులకి బంగారం, వెండి దానం చేశాడు. వశిష్ఠుడిని, విశ్వామిత్రుడిని పిలిచి వివాహానికి కావలసిన అగ్నివేది సిద్ధం చెయ్యమన్నారు. దశరథ మహారాజు కన్యాదానం పుచ్చుకోడానికి బయట ఉండి జనక మహారాజుకి కబురు చేశారు. మిమ్మల్ని అక్కడెవరన్నా ద్వారపాలకులు ఆపుతున్నారా, దశరథుడి ఇంటికి జనకుడి ఇంటికి తేడా లేదు, మీరు తిన్నగా వచ్చేయండని జనకుడన్నాడు. అగ్నివేది సిద్ధం చేశాక, అందులో అగ్నిహోత్రాన్ని నిక్షేపించారు, అక్షతలని సమాహారణం చేయించారు, గంధ పుష్పాలని వేశారు. జనక మహారాజు ఆ అగ్నిహోత్రం దగ్గర నిలబడ్డారు. రాముడు కూడా వచ్చి ఆ అగ్నిహోత్రం దగ్గర నిలుచుని ఉండగా సీతమ్మని తీసుకొచ్చారు. అప్పుడు జనకుడు రాముడితో ఇలా అన్నాడు..

ఇయం సీతా మమ సుతా సహ ధర్మ చరీ తవ |
ప్రతీచ్ఛ చ ఏనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా |
పతివ్రతా మహభాగా ఛాయ ఇవ అనుగతా సదా ||

రామయ్యా! నీకు సీత ఎవరో తెలీదు కదా, ఇదుగో ఈమే సీత. ఈమె నా కూతురు. నేను నీకు ఈమెని కామ పత్నిగా ఇవ్వడంలేదు, నీతోపాటు ధర్మంలో అనువర్తించడానికని ఈ పిల్లని ఇస్తున్నాను. అందుకనిధర్మపత్నిగా స్వీకరించు రామ. ఆడపిల్ల తండ్రిని కదా, అందుకని ఆనందంలో ఇన్ని మాటలు అనేశాను, కాబట్టి నన్ను క్షమించు, ఈమెని నువ్వు పుచ్చుకో, నీ చేతితో మా అమ్మాయి అరచేతిని బాగా రాసి పట్టుకో(సూర్యవంశం వాళ్ళకి అరచేతిని అరచేతితో రాసి పట్టుకుంటే సుముహూర్తం, మనం జీలకర్రబెల్లం పెడతాం సుముహూర్తానికి), ఈ క్షణం నుంచి మా అమ్మాయి ఏది చేసినా అది, నా భర్త అని నీ కోసమే చేస్తుంది. రామా! మాది విదేహ వంశం, మాకు దేహానందు భ్రాంతి ఉండదు. నా కూతురిని అలా పెంచాను. ఒక ఏడాది తరువాత నా కూతురు నీతో కలిసి పుట్టింటికి వచ్చినప్పుడు నేను నేర్పిన సంప్రదాయాన్ని మరిచిపోతే, అది నీ వల్లే రామ, ఎందుకంటే నేను నేర్పినదాన్ని భర్త ఉద్ధరించాలి. ఆ ఉద్ధరించడంలో పొరపాటు వస్తే అది నీదే అవుతుంది. ఆమె నిన్ను నీడలా అనుగమిస్తుంది. [ఇదంతా పై శ్లోకం యొక్క రహస్యార్థం.]

– సేకరణ: నరేందర్ చింతం

భారతీయ వ్యవసాయ విజ్ఞానం



వ్యవసాయం, వానలు, పొలం దున్నటం, విత్తనాలు, నీరు, జలాశయాలు, ధాన్యంనిల్వ, ఇలాంటి వ్యవసాయ సంబంధ విషయాలు, విజ్ఞానం మనకు

వేదాలలో	ఋగ్వేదం
క్రీ.పూ.100 నాటి	కృషి పరాశర – పరాశరుడు
క్రీ. శ. 400 నాటి	అగ్ని పురాణం
క్రీ. శ. 500 నాటి	బృహత్ సంహిత – వరాహమిహిరుడు
క్రీ. శ. 800–900నాటి	కృషిసూక్తి – కాశ్యపుడు
క్రీ. శ. 1000 నాటి	వృక్ష ఆయుర్వేదం – సురపాలుడు
క్రీ. శ. 1100 నాటి	మనసోల్లాస – సోమేశ్వరదేవుడు
క్రీ. శ. 1300 నాటి	ఉపవన వినోదం – సారంగధరుడు

వంటి ఇంకా ఎన్నో గ్రంథాలలో విస్తారంగా చర్చించి ఉన్నారు

ఋగ్వేదంలో వ్యవసాయం గురించిన ప్రస్తావన ఉంది. సంప్రదాయ పూజాకార్యక్రమాలతో పొలందున్నడానికి ఎలా సమాయత్తం కావాలో అందులో వివరించబడింది. ఋగ్వేదం సూర్యణ్ణి దేవునిగా కీర్తించింది. సకల జీవరాసులకూ వెలుగునిచ్చే వానిగా గుర్తించింది. ఎండకు నీరు ఆవిరై, తిరిగి మేఘాలలోని నీరు వర్షించే విధానాన్ని 'నీటి చక్రాన్ని' వివరించింది.

రైతులకు సాధారణంగా కావలసిన పశుసంపద, వృక్ష సంపదల పరిరక్షణ తెలియజేసే విద్యావిధానాలను కూడా ఋగ్వేదం చర్చించింది.

క్రీ.పూ. 400 సంవత్సరానికి చెందిన కౌటిల్యుని 'అర్థశాస్త్రం'లో వర్షపాతం ఎలా కొలవ వచ్చో చెప్పబడింది. మన దేశంలో ఆనాడు వివిధ ప్రాంతాలలో వర్షాకాలంలో కురిసిన వర్షపాతం వివరాలను మనం ఈ పుస్తకంలో చూసి తెలుసుకోవచ్చు. వరాహమిహురుడు తన 'బృహత్ సంహిత'లో వర్షపాతం కొలిచే విధానాన్ని 'అధిక'లని వివరించాడు. 20 అంగుళాలల వ్యాసం , 8 అంగుళాల లోతు ఉన్న గిన్నె నిండేలా కురిసిన వర్షపాతాన్ని ఒక 'అధిక' అంటారు. అలాంటి 4 అధికలను 'ద్రోణ' అంటారు. వర్షం – గాలి, వాన, వెలుతురు, మెరుపులు, మేఘాలు ఇలా ఐదు కారణాల సమ్మేళనంగా ఏర్పడితే...ఆ వాన సుమారు 400 చదరపు మైల్ల విస్తీర్ణంలో కురుస్తుందని, కేవలం గాలి, మేఘాలతోనే కూడిన వర్షం తక్కువ ప్రాంతంలో తక్కువ సాంద్రతతో కురుస్తుందనీ వివరించాడు. వేద విజ్ఞానంలో 'కృత్రిమ వర్ష' వివరాలు కూడా ఉన్నాయి.

కాశ్యపుని 'కృషి – సూక్తం'లో వరి పండించేందుకు అనువైన నేలలు, మెట్ట పంటలను పండించే డ్రైల్యాండ్స్‌నూ విడివిడిగా వివరించాడు. ఇక క్రీ.పూ. 400 సంవత్సరాల నాటి అమరకోశంలో వ్యవసాయానికి పనికివచ్చే 12 రకాల నేలల గురించిన వివరాలు ఉన్నాయి.సురఫలుని'వృక్ష ఆయుర్వేదం' క్రీ. శ. 1000 సంవత్సరాల నాటిది. దీనిలో మూడు రకాలూన వ్యవసాయ భూముల గురించి వివరణలు ఉన్నాయి. పరాశరుడు – తన 'కృషి పరాశరం'లో విత్తనాలను తయారు చేయటం, వాటిని నాణ్యమైనవిగా ఉంచటానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాడు.

కౌటిల్యుడు కూడా విత్తనశుద్ధికి పేడ, పాలు, చేపలు, ఎముకలు ఎలా ఉపయోగపడతాయో వివరించాడు. కాశ్యపుడు, కౌటిల్యుడు తమ గ్రంథాలలో ఆనాటి రాజులు ఎలా వర్షపు నీటిని కుంటలలో, చెరువులలో, జలాశయాలలో నిలువ ఉంచి రైతులకు వ్యవసాయానుగుణంగా వాటిని వినియోగించుకునే వీలు కల్పించారో వివరించారు. క్రీ.పూ. 4వ శతాబ్దంలోనే నేటి గుజరాత్ ప్రాంతంలో అతిపెద్ద 'సుదర్శన జలాశయం' నిర్మింపబడింది. క్రీ. పూ. నాటి బౌద్ధ సాహిత్యంలో నీటి నిల్వల గురించి సవివరంగా ఉంది. 'విశ్వవల్లభ' అనే తన పుస్తకంలో 'చక్రపాణి' భూగర్భంలోని 'నీటి జాడలు' తెలుసుకునే విధానం, నీటి నిల్వల కోసం జలాశయాల నిర్మాణం గురించి, వాటి నిర్వహణ గురించి కూడా వివరించాడు.

క్రీ. శ. 6వ శతాబ్దానికి చెందిన 'వరాహమిహిరుడు' తన 'బృహత్ సంహిత'లో చెట్లు, పుట్టలు వాటి ప్రదేశం, ఎదుగుదల మొదలైన వాటి ఆధారంగా నీటి జాడలు కనిపెట్టే విజ్ఞానం మనకు అందించాడు. పరాశరుడు ధాన్యం నిల్వచేయటం, అందులో జాగ్రత్తల గురించి చాలా చక్కగా వర్ణించాడు. ఫిబ్రవరి మాసం ధాన్యం నిల్వ చేయటానికి తగిన మాసంగా ఆయన పేర్కొన్నాడు.క్రీ.పూ. 400 సంవత్సరం నాటి కౌటిల్యుని అర్థశాస్త్రంలోనే 'సేంద్రియ ఎరువుల' గురించిన ప్రస్తావన ఉంది. పంట మార్పిడి, పంటల విశ్రాంతిని కూడా ఆచార్య కౌటిల్యుడు వివరించి ఉన్నాడు.

ఇక వేదకాలం నుంచీ మనం జంతువులను పూజిస్తూ, ప్రేమిస్తూ, వాటిని కూడా జీవితంలో భాగంగా మార్చుకుని జీవిస్తున్నాం. వ్యవసాయాధారమైన భారత జీవనంలో 'పశుసంపద' ముఖ్యమైనది.

వేదాలు, చరకసంహిత, సుశ్రుతసంహిత, మనుస్మృతి, అగ్ని పురాణాలలో పశువుల ఉత్పత్తి, పెంపకం, జీవితకాలం వంటి ఎన్నో విషయాలు మనకు తెలుస్తాయి.'బృహత్ పరాశర సంహిత'లో పశు పెంపకాల గురించి చక్కగా వివరించబడి ఉంది.

క్రీ. శ. 500–700 సంవత్సరం నాటిదైన 'విష్ణు ధర్మోత్తర మహాపురాణం'లో పశుసంపద, వాటి వ్యాధులు, నివారణ విపులంగా చర్చించబడింది.

కృత్రిమ వర్షం

నేడు ఆధునిక విజ్ఞానం ప్రకారం సోడియం క్లోరైడ్, సిల్వర్ అయొడైడ్‌ను ఆకాశంలోని మేఘాల మీద చల్లి వర్షపాతం కురిపిస్తారు. ఇందుకు తప్పనిసరిగా 'మేఘాలు' ఉండి తీరాలి. అయినా ఫలితం 30 నుంచి 40 శాతం మాత్రమే. ఆనాటి యజ్ఞంలో వాడిన వివిధ పదార్థాలలోని రసాయనాలు, ఆధునిక కృత్రిమ వర్షానికి ఉపయోగించే రసాయనాలతో సరిపోలినాయి. ఇక వారు 'మేఘాల' మీద ఆధారపడకుండా తమ మంత్ర శక్తులతో ప్రకృతిని ప్రార్థించి, మేఘాలను సృష్టించారు. భగవద్గీతలో శ్రీ కృష్ణుడు

'అన్నాద్భవన్తి భూతాని పర్జన్యాదన్న సంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మ సముద్భవః

'ప్రాణులన్నీ అన్నం నుండే జన్మించును. అన్నోత్పత్తి వర్షముల వలన ఏర్పడును. యజ్ఞముల వలన వర్షములు కురియును అని అంటాడు.

శ్రీ మన్నవ గంగాధరప్రసాద్

కూర్చున్న దగ్గర నుండే

బ్రహ్మాండ రహస్యాలు చెప్పే యోగి

హిమాలయ యోగులు – మోక్షసాధనలు

సుషుమ్న ముఖద్వారం మూలాధారంలో కుండలిని నిద్రావస్థలో ఉంది. ప్రాణయామం ద్వారా 6 చక్రాలను దాటుకొని బ్రహ్మరంధ్రం వద్ద శివునిలో ఐక్యమవుతుంది. (నారాయణునిలో ఐక్యమవుతుంది) ముక్తి లభిస్తుంది. సుషుమ్న నాడి మధ్యలో ఖాళీ ప్రదేశం శూన్యప్రదేశాన్ని బ్రహ్మరంధ్రం అంటారు. బ్రహ్మరంధ్రంలో సూక్ష్మమైన వజ్రనాడి, దానిలో ఇంకా సూక్ష్మమైన చిత్రనాడి, అందులో ఇంకా సూక్ష్మమైన మనోహరమైన 6 చక్రాలు ఉన్నాయి. అవి దివ్యప్రకాశంతో బ్రహ్మాండమంతా దర్శింపచేస్తాయి. చిత్రనాడి మధ్యలో (బ్రహ్మన్నిచేరు రంధ్రం) బ్రహ్మరంధ్రమును అందులో 6 చక్రాలు ఉన్నాయి పొడుగునా సహస్రారం జీవన్ముక్తికి స్థానం, భోగ, ఐశ్వర్య, ముక్తినొసగే శివునిస్థానం. ఇదే సత్య లోకం. సిద్ధదేవుడు కామనలు తీర్చే మహాదేవి యాకినీదేవి ఉన్నారు. ఏడవ చక్రంలో తేజోమయుడు కోటి సూర్యుల దివ్య తేజస్సు దేవాది దేవుడు మహాదేవుడున్నాడు. అమృతమయం, సుధాసాగరం, పరిపూర్ణం, గురుతత్వమును మించి తత్వం ఏదీలేదు.

దీనికావల మరేది లేదు. సహస్రారంలో సుషుమ్న మధ్యలో బ్రహ్మరంధ్రములో సహస్రార చక్రంలో గురుతత్వం ధ్యానించగనే స్మరణమాత్రం చేత బ్రహ్మ జ్ఞానం కలుగుతుంది. పాపాపుణ్యం తొలగి జన్మలేకుండును. సాధకయోగి బ్రహ్మ రంధ్రములో క్షణకాలం నిలిచి ఉంటే సర్వపాపాలు తొలుగును. ఏ యోగి మనస్సు సహస్రారంలో లీనమౌతుందో స్వేచ్ఛగ ఆణిమాది అష్టసిద్ధుల మహాశ్వర్యం పొందును. కానీ అక్కడ కోరికలు లేనిస్థితి ముక్తావస్థ జీవన్ముక్త స్థితి సిద్ధించును.

ఈ విధంగా బాలక్ పురియగి శట్చక్ర ధ్యానఫలితాలు,యోగశాస్త్ర పరిజ్ఞానం అంతర్ముఖమై రెండురోజులు బోధించిరి. ప్రశ్న:– చివరికి బాబని బాబ జంతువులంటే ఎందుకు తమరికి ప్రేమ. జ:– చాలాకతుంది నాయన, పూర్వజన్మలో నేను గొప్ప తపస్విని. ఒక యాత్రికుడు కుక్కతో యాత్రచేస్తు నిండుచూలాలు కుక్కను నావద్ద వదిలిపోయెను. ఆ కుక్క రెండు పిల్లల వేసి చనిపోయింది. నేను వృద్ధసాధువును. ఆ కుక్కపిల్లలు నాతో ఆడుకునేవి, నేను చనిపోయే ముందు వీటికి నేను పాలు పోస్తాను. వీటికి దిక్కెవరకు అనుకుంటూ స్మరిస్తూ దేహత్యాగం చేశాను. ఏ భావంతో చనిపోతే అదే జన్మ కనుక శాస్త్ర ప్రకారం కుక్కజన్మ వచ్చింది. ఎంతో బాధపడి ఇతడ కుక్కలతో కలవకుండ అడవిలో ఒక్కడిగా ఉండి కూడ పూర్వవాసనచే తపస్సు చేసి మానవజన్మ పొందాను. కఠోర సాధన 50 సంవత్సరాలు చేసి జీవన్ముక్తావస్థ పొందాను. పాలలో నుండి వచ్చిన నెయ్యి తిరిగి అందులో కలవనట్టు, సాధన దశలో అన్నీ ప్రతిబంధాలు కాని జీవన్ముక్తావస్థలో ఏ ప్రతిబంధకాలుండవు. పూర్వజన్మలో సాధక దశలో ఉన్నందున అలా జరిగెను. అందుకు నాడు జంతువుల భాష బాగా తెలుసు. నాకు అన్ని సమానమే లోపల దేనిపై అజ్ఞానులవలె జ్ఞానులకు మమకారం, నేను నాది అనే భావన ఉండదు. వ్యవహారంలో కనిపించిన లోపల అజ్ఞానుల భావనలు జీవన్ముక్తులకుండవు. వారికి ఏ ప్రతిబంధకాలుండవు. కొత్తసాధకులకే అన్ని నియమాలు. రిటైర్ ఉద్యోగికి పూర్వం చేసిన శ్రమ పెన్షన్ రూపంలో పొందును.

అవధూత పూర్వసాధనల ఫలితం బ్రహానంద రూపంలో ప్రతిక్షణం అనుభవించును అని బోధించిరి. పూర్వం ఒక కోటీశ్వరుడు పిల్లలపై, ధనంపై వ్యామోహంతో చనిపోయేటప్పుడు కుటంబాన్ని స్మరిస్తూ చనిపోయి కుక్కగా పుట్టి ఇంటిలోని ధనం రక్షణకు గేటుకావలి ఉండెను.

మళ్లీ చనిపోయి నేను పూర్వ జన్మలో సంపాదించింది ఎవరు కాపాడుతారని, పాము జన్మ ఎత్తి బీరువా కావాలి అన్నాడు. బీరువాలో నగలకై అమ్మగారు తెరవగా పామును చూసి భయపడి కేకలు వేయగా అయ్యగారు కర్రతో పామును కొట్టి చంపారు. అప్పుడు పూర్వజన్మలో గాడిదలా కష్టపడి కోట్లు సంపాదించి కుక్కజన్మ ఎత్తి దొంగలు రాకుండా కాపాడితి. తిరిగి పాము జన్మలో కూడా కాపాడితి. కానీ ఈ మూర్ఖులు స్వార్థపరులు కొట్టి చంపిరి. ఈ మూర్ఖులపై ఇంకా నాకేల మమకారం అని ఆయన మమకారం చచ్చెను. అలాగే మమకారం దెబ్బకు అందరు బలి అయిపోతున్నారు.

నావాళ్ళు నాది అనేది మమకారం ఉన్నంత వరకు జన్మ పరంపరలు తప్పవు. మనుష్యులకు శరీరం సంసారంలో మనస్సు పరమాత్మపై సాధనలో నిమగ్నం చేసి, పూర్వ ఋషులలాగ జీవించాలనే భావనని శుద్ధంగా ఉంచుకోవాలి. పరమాత్మ భావనతో ఎల్లప్పుడుండాలి. ఏది స్మరిస్తూ దేహంవిడిస్తే అదే జన్మ ('గీత') వచ్చును. వివేకవంతులు ఆశ మమకారం దూరం చేసుకొని దైవస్మరణతో ఆత్మభావనతో దేహత్యాగం చేయాలి. తిరగి మానవ జన్మనైన పొంది తిరిగి సాధన చేయగలరు. జంతు జన్మ దేవత జన్మలు సాధనకు కుదరవు (కర్మభోగజన్మలు అవి) అని బాబ ఎన్నో విషయాలు భోధించిరి బాలక్‌పురి బాబకు ప్రణామాలర్పించి సెలవు తీసుకుంటిమి.

–స్వామి జ్ఞానానందగిరి

భక్తి ఉంటే దేనినైనా సాధించవచ్చు


(గణపతి – కుమారస్వామి – రత్నాలహారము)

(పరమహంస గూఢార్థ కథలు)

"భగవంతుడి మీద ప్రేమ ఉంటే దేనినైనా సాధించవచ్చు. భగవంతుడి మీద ప్రేమ కలిగిన వారికి కొదవ అనేదే ఉండదు."

'వినాయకుని విషయం చెపుతాను విను! ఒకసారి పార్వతీదేవికి ఇరువైపుల వినాయకుడు, కుమారస్వామి కూర్చొని ఉన్నారు. పార్వతీదేవి మెడలో అప్పుడు ధగధగ మెరుస్తున్న ఒక రత్నాలహారం ఉన్నది. కుమారులిద్దరి చూపు దానిమీద పడింది. అప్పుడు భగవతి, 'అబ్బాయిలూ! మీలో ఎవరు ముందుగా ఈ ప్రపంచాన్ని చుట్టివస్తారో వాళ్లకు ఈ హారాన్ని ఇస్తాను' అని చెపింది. తల్లి నోటి నుండి ఈ మాట వెలువడిందో లేదో, కుమారస్వామి తన నెమలిని ఎక్కి విశ్వాన్ని చుట్టి రావడానికి బయలుదేరాడు. తన నెమలి అతివేగంగా ఎగరగలదని, తాను ముందుగా తిరిగి రాగలనని అతడి నమ్మకం.'

'ఇక గణపతి శాంతంగా కూర్చున్నాడు. తన తల్లియైన జగన్మాత గర్భంలో బ్రహ్మాండాలన్నీ ఇమిడి ఉన్నాయని అతడికి తెలుసు. అందువల్ల నెమ్మదిగా లేచి భక్తిశ్రద్ధలతో తల్లికి ప్రదక్షిణం చేసి పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసి కూర్చున్నాడు. దేవి సంప్రీతురాలై తన రత్నాలహారం తీసి వినాయకునికి ఇచ్చింది. నెమలి వాహనం మీద బయలుదేరిన కుమారస్వామి స్వయంగా ప్రయాణం చెయ్యాలి కనుక, విశ్వమంతా చుట్టి, ఎంతోసేపటికి తిరిగివచ్చి, తానే ముందు



వచ్చాననుకుంటూ తల్లి దగ్గరకు వచ్చాడు. వచ్చి చూచేసరికి వినాయకుడు తన మెడలో రత్నాలహారం ధరించి ఉండటం కనిపించింది. విషయం అప్పుడు గ్రహించాడు. కాబట్టి భక్తి వల్ల దేనినైనా సాధించవచ్చు. కావాలంటే భక్తివల్ల బ్రహ్మజ్ఞానం కూడా లభిస్తుంది."

ఈ కథను శ్రీగురుదేవులు 'శ్రీరామకృష్ణ కథామృత' రచయిత అయిన మహేంద్రనాథ గుప్తకు చెప్పారు. తాను దివ్యజననిని ప్రార్థించిన విధానాన్ని కూడా మహేంద్రునికి తెలుపుతూ, "అమ్మా! వేద వేదాంతాలలో ప్రతిపాదింపబడినదంతా నాకు తెలియజెయ్యి! తంత్రాలలోను, పురాణాలలోను చెప్పబడినదంతా కూడా నాకు అనుగ్రహించమ్మా!' అని అమ్మను ప్రార్థించానని చెప్పారు.

జీవితావకాశాన్ని తిరస్కరించాడు



శ్రీభగవాన్ ఉవాచ

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషిదదాసి యత్।
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్॥

తాత్పర్యము: ఓ అర్జునా! నీవు ఆచరించు కర్మనూ, భుజించెడి ఆహారమునూ, హోమముచేయు హవ్యమునూ, అర్పించు దానమునూ, ఆచరించు తపస్సునూ నాకే సమర్పింపుము–కృష్ణుడు.

నీతి: పైన చెప్పబడిన పద్ధతిలో సమర్పించడం సులభమే. కాని అందుకు అలవాటు ఉండాలి. ఫలితం అద్భుతంగా ఉంటుంది. అందుకే ఈ పద్ధతిని మనం చిన్నప్పటి నుండే అలవాటు చేసుకోవాలి.

ముఖ్యపదం: అవకాశం



బాల మకరందం

మధురకు రాజైన కంసుడు తలపెట్టిన ధనుర్ యజ్ఞానికి బలరామకృష్ణులకు ఆహ్వానం అందింది. ఎలాగైనా ఆ సోదరులను చంపాలన్నదే ఆ ఆహ్వానం తాలూకు అంతరార్థం. అప్పటికి కృష్ణుడి వయస్సు 11 సంవత్సరాలే అయినా అతడు ధైర్యంగా మధురకు వెళ్ళి ముష్టిక, చానుర యోధులను ఓడించాడు. శిక్షణ ఇవ్వడబడిన పెద్ద ఏనుగు 'కువలయాపీడ' ను కూడా వధించాడు. ఆపై ఎలాంటి ఆయుధం లేకుండానే కంసుడిని సంహరించాడు. కంస సంహారం జరిగాక, మధుర వాసులు, ఆ రాజ్యన్ని కూడా హస్తగతం చేసుకోమని కృష్ణుడిని కోరారు. కృష్ణుడు కూడా వృష్ణి వంశానికి చెందినవాడు. కావున రాజ్యాన్ని తీసుకోవడానికి తగినవాడే కాని ఆ అవకాశాన్ని తిరస్కరించాడు. అతడి నీతి, ప్రవర్తనలు ఎప్పుడూ ఖచ్చితంగా ఉంటాయి. కృష్ణుడు మరణించి పడి ఉన్న కంసుడి తలపై ఉన్న కిరీటాన్ని తీసుకుని, చెఱసాలలో ఉన్న కంసుడి తండ్రి ఉగ్రసేనుడి వద్దకు వెళ్ళాడు. అత్యంత వినయంగా ఆ కిరీటాన్ని ఆయనకు బహూకరించాడు. తను తలపెట్టిన కార్యాన్ని నిబద్ధతో పూర్తిచేస్తాడని కృష్ణుడు నిరూపించాడు. దుష్టుడైన రాజును రాజభ్రష్టుడిని చేయడం ద్వారా కృష్ణుడు తన కర్తవ్యం నిర్వహించాడు. ఉగ్రసేనుడికి పట్టాభిషేకం చేయడం ద్వారా అతడు తన కోసమే ఆ కార్యం చేయలేదని, లోకకళ్యాణార్థం చేశాడని తెలియచేశాడు.

గ్రహించవలసిన లక్షణం– నిస్వార్థము.

–డా॥హరేక్రిష్ణ చంద్రశేకరన్

అక్రమ కట్టడాలకు ఇంటి నెంబర్లు ఇవ్వొద్దు

విజయక్రాంతి, ఉప్పల్: బోడుప్పల్ రెవెన్యూ గ్రామ సర్వేనెంబర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మించిన అక్రమ కట్టడాలకు మల్లాపూర్ రెవెన్యూ గ్రామ సర్వే నెంబర్‌లతో ఇంటి నెంబర్లు తీసుకొని హట్ రిజిస్ట్రేషన్ (ఇల్లు కట్టి ఇంటి నెంబర్లుతో రిజిస్ట్రేషన్) లు చేస్తున్నారని స్థానిక మల్లాపూర్ కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి కాప్రా డిప్యూటి కమిషనర్ దశరథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాప్రా సర్కిల్ మల్లాపూర్ డివిజన్ గోకుల్ నగర్ కాలనీ కి ఆనుకొని ఉన్న బోడుప్పల్ రెవెన్యూ పరిధి లోని సర్వేనెంబర్. 63, ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసి, మల్లాపూర్‌కు రెవెన్యూకి చెందిన సర్వే నెంబరులు 96,97,98 లను వేసుకొని గత కొంత కాలం క్రితం అక్రమ నిర్మాణాలు వెలిశాయి. గవర్నమెంటు భూమిని కబ్జా చేసి మల్లాపూర్ రెవెన్యూ గ్రామ సర్వే నెంబర్‌తో ఇంటి నెంబర్లు తీసుకొని హట్ రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారని, పైన తెలిపిన సర్వేనెంబరులకు సంబంధించిన డాక్యుమెంట్లు పరిశీలించి లే అవుట్‌లో ఉన్న ప్లాట్లకే ఇంటి నెంబర్‌లను కేటాయించాలని కోరారు.

వివాహానికి ముందే స్థిరనివాసం

మారుతున్న యువత ఆలోచన

- స్థిర నివాసం కోసం అనేక అంశాలను పరిశీలిస్తున్న వినియోగదారులు
- వినియోగదారుల ఆలోచనలకు అనువుగా లే అవుట్‌ల అభివృద్ధి
- రుణాలు మంజూరు చేయడానికి ముందుకు వస్తున్న ఆర్థిక సంస్థలు



విజయక్రాంతి, హైదరాబాద్: అభివృద్ధి చెందుతున్న మహానగరాల్లో సొంతింటి కల నెరవేర్చుకునే వినియోగదారులు ఖచ్చితంగా కొన్ని నియమాలను పరిశీలించి కొనుగోలు చేస్తున్నారు.

కొనుగోలుదారుల ఆలోచనల్లో ఎప్పటికప్పుడు మార్పులు వస్తూండడంతో దానికి తగ్గట్టుగా స్థలాలను ఎంపిక చేసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా కొనుగోలు దారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని దానికి తగ్గట్టుగా స్థలాలను అభివృద్ధి చేస్తున్నారు. దాంతోపాటు హైదరాబాద్‌లాంటి మహానగరాల్లో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో చేస్తున్న యువకులకు రెండు పదుల వయసులోనే ఐదంకెల వేతనం అందుకుంటుండటంతో పెళ్లి కన్నా ముందే సొంతింటి ఆలోచన చేస్తున్నారు. అల్పాదాయ వర్గాలకు సొంతిల్లు ఇప్పటికీ కలనే. వీరి ఆలోచనలు నిరంతరం ఇంటి చుట్టూ తిరుగుతుంటాయి. అయితే తలంపు రాగానే అన్నీ మన చెంతకు చేరవు. దానికి తగిన ప్రయత్నాలు చేయాలనే ఆలోచనలో వినియోగదారులు పలు అంశాలను పరిశీలిస్తున్నారు. ఆర్థిక పరిస్థితిని బట్టి 120 చదరపు గజాల నుంచి 267 వరకు మధ్య తరగతి వారికి అనువుగా ఉంటుందనే ఆలోచనలో కొంతమంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు కొనుగోళ్లవైపు మొగ్గు చూపిస్తున్నారు. దాంతోబాటు కొనుగోలు చేసే స్థలం లోతట్టు, గుంతలమయం కాకుండా ఎటువంటి ప్రమాదం వచ్చినా స్థలం తట్టుకునే విధంగా ఉండాలని కోరుకుంటున్నారు. అదే విధంగా రహదారికి దగ్గరగా రవాణా సౌకర్యానికి అందుబాటులో ఉండే విధంగా ఎంపిక చేసుకుంటున్నారు. అదేవిధంగా

ప్రభుత్వ అనుమతులు ఉన్న లేఅవుట్లలో కొనుగోలు చేయడం మేలనే ఆలోచనలో దగ్గరలో ఉన్న ప్రభుత్వ శాఖలను సంప్రదించి సంబంధిత లేఅవుట్‌లకు అన్ని అనుమతులు ఉన్నాయని పరిశీలించిన తరువాతే స్థలాల ఎంపికకు మక్కువ చూపిస్తున్నారు. రియల్ ఎస్టేట్ అక్రమాల్లో భాగంగా అనుమతి లేని లేఅవుట్లలో ఒక స్థలాన్ని ఇద్దరికి అమ్మడం, ఇతరులు ఆక్రమించడం వంటి సంఘటనలు జరుగుతుండడం వల్ల పూర్తిగా హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులతోపాటు రవాణా సౌకర్యం, విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ తదితర సౌకర్యాలను కూడా కొనుగోలు దారులు పరిశీలిస్తున్నారు. దీంతోపాటు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల వైపే మొగ్గు చూపిస్తుండడంతో రవాణా సౌకర్యం, అవుటర్ రింగ్ రోడ్డు, ఎంఎంటీఎస్ తదితర సౌకర్యాలు ఉన్న ప్రాంతాల వైపు కొనుగోలుదారులు ముందుకు వస్తుండడంతో యాదాద్రి, భువనగిరి తదితర ప్రాంతాల్లో కొనుగోలు చేయాలనే ఆలోచనలో వినియోగదారులు ఉంటున్నారని రియల్ ఎస్టేట్ యజమానులు అభిప్రాయపడుతున్నారు.

ఇక తక్కువ ధరలో కొనుగోలు చేసే వారు నగరానికి దూరంగా వెళ్లడానికి ఇష్టపడుతున్న ఆ ప్రాంతం అభివృద్ధికి ఎంత సమయం పడుతుందన్న దానిపై అంచనా లు వేస్తున్నారు. దానికి తగ్గట్టుగా ఆ ప్రాంతాలలో స్థలాలపై పెట్టుబడులు పెట్టి సుమారు 20 సంవత్సరాల తరువాత స్థిర నివాసం ఏర్పర్చుకోవడానికి అవకాశం ఉన్నవారు దూర ప్రాంతాలపై దృష్టి సారిస్తున్నారు. దీన్ని బట్టి తాము ఏర్పాటు చేసుకున్న స్థిర నివాసానికి తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. వివిధ ఆర్థిక సంస్థలు కూడా గృహ నిర్మాణ రుణాలు మంజూరు చేయడానికి ముందుకు వస్తుండడంతో ముందు స్థలం ఎంపిక చేసుకొని ప్రణాళిక ప్రకారం ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు వస్తున్నారు. అదేవిధంగా ఆ ప్రాంతాల్లో ఉండే డిమాండ్‌ను బట్టి తమ నివాసయోగ్యత తోపాటు మరొక కొంతభాగం అద్దెకిచ్చుకునేవిధంగా ప్రణాళికలను రూపొందిస్తూ ముందుకు వెళుతున్నారు. తమతోపాటు వేరే కుటుంబం కూడా ఉంటే ఆర్థికంగా వెసులుబాటుతోపాటు భద్రతకు ఢోకా ఉండదని పలువురు భావిస్తున్నారు.

ఇక భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆర్థిక పరిస్థితులు అంచనా వేసుకొని హంగులు, అర్భాటాలకు పోకుండా అవసరాలు తీరేటట్లుగా చూస్తూ ఆర్థికంగా స్థిరపడిన తర్వాత తమ జీవనశైలికి తగ్గట్టుగా మార్చుకోవచ్చనే అభిప్రాయంలో పలువురు ఆలోచిస్తున్నారు.

వాస్తు ముఖ్యమే..

వాస్తును మూఢ నమ్మకంగా కాక శాస్త్రీయ దృక్పథంతో చూడాలి. సహజ వనరులైన గాలి వెలుతురు అన్ని గదులలో ప్రసరించేటట్లుగా ఉండాలి. ఫలితంగా ఇంటిలో ఉన్న ప్రతికూల శక్తులను దూరం చేసి సానుకూల శక్తి పెంపొందిస్తుంది. తద్వారా ఆరోగ్యం, చేసే ఆలోచనలల్లో సానుకూలతతో పాటూ విద్యుత్తు ఆదా లాంటి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి.

జీహెచ్ఎంసీపై రాంకీ కార్మికుల ఆగ్రహం

విజయక్రాంతి, హైదరాబాద్: గ్రేటర్‌లో రాంకీ ప్రాబల్యం మరోసారి తెరపైకి వచ్చింది. నగరంలో శానిటేషన్‌ను రాంకీకి ఇవ్వాలని ఇప్పటికే డిసైడ్ చేసిన జిహెచ్ఎంసి, కార్మిక సంఘాల వ్యతిరేఖతతో వెనక్కి తగ్గింది. ప్రస్తుతం పూర్తి స్థాయిలోకాకుండా డంపింగ్ యార్డు వరకే రాంకీ తన కార్యకలాపాలు చేపడుతోంది. గత కొన్ని రోజులుగా నగరంలో చెత్త పేరుకుపోతుండటంతో ట్రాన్స్‌పోర్ట్ పనులను రాంకీకి ఇచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ముందునుంచి రాంకీని వ్యతిరేకిస్తున్న అధికారపార్టీ ఇప్పుడు రాంకీకి సై అంటుందా, కార్పొరేషన్ లోని కార్మిక సంఘాలు ఇందుకు ఒప్పుకుంటాయా అనేది ఇప్పుడు బల్దియా హాట్ టాపిక్‌గా మారింది.

ఐదు వేల టన్నులకు ప్రతినెలా పదకొండున్నర కోట్ల చెప్పున జీహెచ్ఎంసి చెల్లిస్తోంది. అయితే రవాణా భాధ్యతలు కూడా రాంకీకి అప్పగిస్తే ప్రతి మెట్రిక్ టన్నుకు 20శాతం అదనంగా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. అయితే ఇంత భారీగా ఖర్చు చేయటాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. జీహెచ్ఎంసినే ఈ పనులు చేస్తే భారీగా డబ్బు ఆదా అవుతుందంటున్నారు కార్మిక సంఘాల నేతలు.

ప్రారంభం నుంచి ఈ కాంట్రాక్టును కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగాయి. బల్దియా కార్మికుల పొట్టకొట్టోద్దంటూ సమ్మెలు చేశాయి. దాంతో ఇప్పటి వరకు కేవలం డంపింగ్ యార్డుకు మాత్రమే రాంకీ సేవలు పరిమితమయ్యాయి. తాజాగా అధికారులు రాంకీ వాహనాలను రంగంలోకి దింపడంతో కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పుడు రాంకీకి ఈ విభాగాన్ని అప్పజెప్పడం ద్వారా పర్మనెంట్ కార్మికులకు పని ఉండకపోగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువౌతుందని భావిస్తున్నారు కార్మికనేతలు. కాగా కార్మికులు వ్యక్తం చేస్తున్న అనుమానాలపై కమిషనర్ దాన కిషోర్ స్పందించారు. సంస్థకు గానీ, కార్మికుల ప్రయోజనాలకు గానీ ఇబ్బంది కలిగించే నిర్ణయాలు తీసుకునే సాహసం చేయనని చెప్పారు. ప్రైవేట్ సంస్థకు చెత్త సేకరణ, తరలింపు అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తప్పు పట్టారు. 2009లో జరిగిన ఒప్పందం ప్రకారం ఒక్కో అంశాన్ని రాంకీకి కట్టబెడుతున్నారు అధికారులు. ఇక మిగిలిపోయిన 40శాతం పని ఇంటింటి నుంచి చెత్త సేకరణ పనులు కూడా వారికి కట్టబెడితే గ్రేటర్‌లో 100శాతం చెత్త నిర్వహణ రాంకీనే చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అధికారుల తీరును కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. దీనిపై ఆందోళనలకు కూడా దిగుతామని హెచ్చరిస్తున్నాయి.

రియల్‌లో తెలంగాణ రెండో స్థానం

- హైదరాబాద్‌లో భారీ ప్రాజెక్టులు
- 98 ప్రాజెక్టులకు పర్యావరణ క్లియరెన్స్‌లు
- నిర్మాణ దశలో 54 మెగా ప్రాజెక్టులు
- సీయా సర్వే నివేదికలో వెల్లడి

దుర్గం శ్రీనివాస్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఏస్టేట్ రంగం ఊపందుకున్నది. దేశంలోనే రియల్ రంగంలో తెలంగాణ రెండోస్థానాన్ని ఆక్రమించింది. దేశంలోనే గుజరాత్ తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనే రియల్ ఏస్టేట్ రంగం ఊపందుకున్నట్లు స్టేట్ ఎన్వీరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (సీయా) సర్వేలో పేర్కొన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయస్థాయి కంపెనీలు రాష్ట్రానికి రావడంతో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. పైగా ఐటీ కంపెనీలతో పాటు పలు రంగాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు భారీ ఎత్తున పెట్టుబడులను పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో రియల్ రంగానికి భారీ స్పందన వస్తుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని కుత్బుల్లాపూర్, రాజేంద్‌నగర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, కొండాపూర్, మాధాపూర్, నానక్‌రామ్‌గూడలో పలు కొత్త ఐటీ కంపెనీలను పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే 98 కంపెనీలు పర్యావరణం క్లియరెన్స్ సర్టిఫికేట్లు తీసుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. వీటిలో 16–17 ప్రాజెక్టులు కమర్షియల్ ఉత్పత్తులకు సంబంధించి కంపెనీలున్నట్లు తెలిసింది. మిగతావన్ని నిర్మాణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టులున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



గడిచిన 10 నెలల్లోనే ఈ కంపెనీలు జీహెచ్ఎంసీ పరిధిలో పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరో 54 ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటిలో శేరిలింగం పల్లిలో 27, రాజేంద్రనగర్‌లో 17, కుత్బుల్లాపూర్‌లో 10 ప్రాజెక్టులున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. మరో కొన్ని భారీ ప్రాజెక్టుల్లో రామచంద్రాపురంలో 7, పటాన్‌చెరువు 5 , మల్కాజ్‌గిరి 4, సరూర్‌నగర్ 4, ఉప్పల్ 3, అమీర్‌పేట్ 3, బాలానగర్ 2, శంకర్‌పల్లి 2, ఖైరతాబాద్ 2, మహేశ్వరం 2, శామీర్‌పేట్, సంగారెడ్డి, సికింద్రాబా, మేడ్చేల్, షేక్‌పేట్, గోల్కొండ, చౌటుప్పల్‌లో ఒక్కో ప్రాజెక్టు లు న్నాయి. ఈ ప్రాజెక్టుల నిర్మాణాలను ఈసీలకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.

ఇదిలా ఉండగా గుజరాత్ రాష్ట్రంలో 175 ప్రాజెక్టులు ఈసీల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సీయా సర్వేలో పేర్కొన్నది.

ఈ ప్రాజెక్టులను అహ్మదాబాద్, సూరత్, వడోదర, రాజ్‌కోట్, వల్‌సద్ నగరా ల్లో చేపడుతున్నది. కానీ తెలంగాణలో జీహెచ్ఎంసీ పరిధిలోనే అన్ని ప్రాజెక్టులను చేపట్టడం విశేషం. దీంతో హైదరాబాద్ రియల్ రంగం బాగా పెరిగిందని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. వరుస ప్రాజెక్టుల నేపథ్యంలో రియల్‌బూమ్ పెరగడంతో భాగ్యనగరంలో జనాభా సంఖ్య మరింత పెరగనుంది. ఈ పరిణామం అభివృద్ధికి కూడా బాటలు వేస్తుందని అభిప్రాయం.

గృహాల కొనుగోలుకు.. పీఎంఏఓ సబ్సిడీ



విజయక్రాంతి, హైదరాబాద్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం తమ సొంతింటి కళను నెరవేరుస్తుందనే ఆశతో పేద, మధ్యతరగతికి చెందిన అనేకమంది ఆశపడుతున్నారు. ఇటీవల ప్రకటించిన ఈ పథకం ద్వారా సొంత నివాసం ఏర్పర్చు కునేవారికి రెండున్నర లక్షల వరకూ సబ్సిడీని అందించే పథకమే ఈ ఆవాస్ యోజన. ఈ పథకం ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం అంతం వరకు ఉన్న గడువును పొడిగిం చడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో సొంతింటి ఆశలు నెరవేరుతాయని పలువురు భావిస్తున్నారు. ఈ పథకం గడువును 2020 మార్చి 31 వరకు కేంద్రం పొడిగించింది. ఈ పథకం ద్వారా దేశంలోని అందరికీ స్థిర నివాసం ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఈ పథకంలో భాగంగా కొనుగోలు దారులు తన పేరుతో మొదటిసారిగా గృహాలు కొనుగోలు చేసినట్లయితే వారికి కూడా గృహ రుణంలో వడ్డీ రాయితీకి అర్హులుగా పరిగణిస్తారు. గృహ రుణం తీసుకున్న బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో దరఖాస్తు చేసుకొని వారి ఇంటి కొనుగోలు వివరాలను సంబంధిత ఆర్థిక సంస్థలకు తెలియజేయాల్సి ఉంటుంది. కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఉన్న వినియోగదారులు వడ్డీరాయితీని సంబంధిత ఆర్థిక సంస్థల నుంచి పొందవచ్చుననే నిబంధన చాలామంది మొదటిసారి గృహాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు మేలు చేకూరుస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా స్థల పరిణామం 1614 చ.గజాల వరకు ఇంటికి దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతో ప్రతీనెలా ఆర్థిక సంస్థలకు కట్టే బకాయి మొత్తాలు (ఈఎంఐ) వినియోగదారులకు భారం తగ్గుతుంది. కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం ఈ పథకం కింద గత సంవత్సరాంతానికి 3,39,713 మంది ప్రయోజనం పొందారని, ఈ ఆర్థిక సంవత్సరం చివరికి మరో లక్ష మంది వరకు లబ్ధి పొందుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

సమగ్రాభివృద్ధిపై
విజన్ డాక్యుమెంట్

విజయక్రాంతి, హైదరాబాద్: నగర సమగ్రాభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేయడానికిగాను హైదరాబాద్ నగరాభివృద్ధిపై విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. హైదరాబాద్ నగరంలో స్వచ్ఛ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతూ నగరవాసులను భాగస్వాములను చేసేదిశగా చైతన్య, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ ఈ కార్యక్రమాల్లో కాలనీ సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు, పారిశుధ్య రంగంలో నిపుణులు తదితరులతో పూర్తిస్థాయిలో చర్చించి త్వరలోనే హైదరాబాద్ విజన్ డాక్యుమెంట్ను ప్రకటించనున్నట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ ఎం.దానకిషోర్ వెల్లడించారు. ఇప్పటికే జీహెచ్ఎంసీలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా జీహెచ్ఎంసీ దేశవ్యాప్త గుర్తింపు పొందిందని, ముఖ్యంగా బాండ్ల సేకరణ, జవహర్‌నగర్ డంప్‌యార్డ్ క్యాపింగ్, ఎస్.ఆర్.డి.పి, డబుల్ బెడ్రూం, స్వచ్ఛ కార్యక్రమాలను చేపట్టిన విషయాన్ని కమిషనర్ గుర్తుచేశారు. అయితే స్వచ్ఛ సర్వేక్షణ్, ఓడిఎఫ్ ప్రకటన తదితర సర్వేలప్పుడే నగరంలో పారిశుధ్య కార్యక్రమాలపై మరింత శ్రద్ధ చూపడం జరుగుతుందని, ఈ కార్యక్రమాలను నిరంతరం చేపట్టేలా ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించనున్నామని తెలియజేశారు. ప్రధానంగా స్వచ్ఛసేన ఏర్పాటు, నానో మొబిలిటి వాహనాల ఏర్పాటు, మలవ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటు, స్వచ్ఛ వార్డు అధికారులు, స్వచ్ఛ విజిల్ యాప్ రూపకల్పన, నో కాంప్రమైజ్ జోన్లు, టెక్నాలజి సహాయం తదితర కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టడం ఈ విజన్ డాక్యుమెంట్లో ప్రకటిస్తామని వివరించారు.

హరితహారంలో 3కోట్ల మొక్కల పంపిణీ

హరితహారం 2019కి గాను హైదరాబాద్ నగరంలో 3కోట్ల మొక్కలను నాటాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్ధేశించిందని, ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. 3మొక్కలను పెంచేందుకు గ్రేటర్ హైదరాబాద్లో స్థలాభాగం ఉందని, మొక్కలను పెంచేందుకుగాను నర్సరీల ఏర్పాటుకు హైదరాబాద్తో పాటు ఔటర్ రింగ్రోడ్ పరిధిలోపల తగు ఖాళీ స్థలాలను కేటాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరామని కమిషనర్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 2,600 ఖాళీ స్థలాలు ఉన్నప్పటికీ వీటిలో 1300 స్థలాల్లో మాత్రమే నర్సరీల ఏర్పాటుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 4వ తేదీ వరకు ఓటరు నమోదు

హైదరాబాద్ నగరంలో 18ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటు నమోదు చేసుకునేందుకు ఫిబ్రవరి 4వ తేదీ వరకు గడువు ఉందని కమిషనర్ దానకిషోర్ పేర్కొన్నారు. ఈ నెల 22, 23, 24 తేదీలలో అన్ని పోలింగ్ లొకేషన్ల వద్ద సాయంత్రం 4గంటల నుండి 7గంటల వరకు బి.ఎల్.ఓలు అందుబాటులో ఉంటున్నారని, దీంతో పాటు హైదరాబాద్ జిల్లాలోని అన్ని వార్డు కార్యాలయాల్లో ఓటర్ల జాబితాతో జీహెచ్ఎంసీ సిబ్బంది ఉంటారని తెలిపారు. హైదరాబాద్లోని ప్రతిఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నది లేనిది తెలుసుకోవడంతో పాటు లేనివారు వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు గుర్తింపు కార్డు ఉన్నప్పటికీ తమ పేరును మరోసారి జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు.

ఏ ఒక్కరిని తొలగించం

హైదరాబాద్ నగరంలో పారిశుధ్య కార్యక్రమాలను ప్రైవేట్ పరం చేస్తున్నామని వచ్చిన వార్తలో వాస్తవంలేదని కమిషనర్ దానకిషోర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీలో పనిచేసే ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎట్టి పరిస్థితిలోనూ తొలగించేదిలేదని పేర్కొన్నారు. ఈ విషయంలో పత్రికల్లో వస్తున్న వార్తలు వాస్తవం కాదని తెలియజేశారు. ఏ ఒక్కరికి అన్యాయం కలిగించే చర్యలు చేపట్టమని అన్నారు.

ఆస్తిపన్ను బకాయిలను చెల్లించండి

హైదరాబాద్ నగర అభివృద్ధికిగాను ఆస్తిపన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని నగరవాసులకు జీహెచ్ఎంసీ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో ప్రస్తుత ఆర్తిక సంవత్సరం పన్ను వసూళ్ల లక్ష్యం రూ. 1500 కోట్లు కాగా ఇప్పటి వరకు 9,40,202 మంది రూ. 897.09 కోట్లను ఆస్తపన్ను రూపెణ చెల్లించారని దానకిషోర్ వెల్లడించారు. గత సంవత్సరం ఇదే సమయానికి రూ. 845.76 కోట్లు మాత్రమే వసూలయ్యాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో చేపడుతున్న ఎస్.ఆర్.డి.పి పనులకు నిధుల కొరతలేదని తెలిపారు. త్వరలోనే మరో విడుత బాండ్ల ద్వారా నిధులను సేకరించనున్నామని తెలిపారు.

నానో మానిటరింగ్ కార్ పరిశీలన

నానో కార్కు కెమెరాలను అమర్చి వాటి ద్వారా పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించే విధానాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ ఎం.దానకిషోర్ నేడు పరిశీలించారు. అడిషనల్ కమిషనర్ ముషారఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ నానో కార్ పనితీరును కమిషనర్కు ముషారఫ్ అలీ వివరించారు. ఈ నానో కార్ ద్వారా నగరంలో ప్రధాన రహదారుల్లో శానిటేషన్ పర్యవేక్షణ, గార్బేజ్ ఎత్తివేత, రోడ్ల పరిస్థితి తదితర అంశాలను ఫోటోతీసి కేంద్ర కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్కు పంపిస్తారు. ఈ చిత్రాల ద్వారా స్వచ్ఛ ఉల్లంఘనులకు జరిమానా విధించే విధానాన్ని రూపొందిస్తారు. ఈ నానో మానిటరింగ్ కార్ను ప్రయోగాత్మకంగా ఖైరతాబాద్ జోన్లో ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ దానకిషోర్ వివరించారు.

విశ్వనగరం దిశగా జీహెచ్ఎంసీ

కొనసాగుతున్న భారీ ప్రాజెక్టులు

బర్ల శ్రీనివాస్

హైదరాబాద్: ఎస్.ఆర్.డి.పి పనుల పూర్తితో హైదరాబాద్ నగర రూపురేఖలు మరో రెండేళ్లలో పూర్తిగా మారి నగరవాసుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్: హైదరాబాద్ పరిరక్షణకు అత్యంత ప్రాదాన్యతను ఇచ్చేందుకుగాను జీహెచ్ఎంసీలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను 2018 ఆగష్టు 11న ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అనుకొని ఉపద్రవాల నుంచి రక్షించడం, అక్రమ కట్టడాలు, నిర్మాణాలను తొలగించడం, జీహెచ్ఎంసీ ఆస్తుల పరిరక్షణ, అగ్నిప్రమాదాలు తదితర ఉపద్రవాలను ఎదుర్కునేందుకు ఐపీఎస్ అధికారి నేతృత్వంలో ఈ డి.ఆర్.ఎఫ్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరంలో పుట్‌ఫాత్‌ల ఆక్రమణలను, రోడ్డు విస్తరణ పనులను ఈ విభాగం ఆధ్వర్యంలో సమర్థవంతంగా చేపట్టారు.

లూకేఫేల ఏర్పాటు: హైదరాబాద్ నగర ప్రజలకోసం లగ్జరీ లూకేఫేలను టి.పి.పి పద్ధతిలో ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ లూకేఫేలో ఏసీ టాయిలెట్లు, నాప్కిన్ వెండింగ్ మిషన్లు, నాప్కిన్ ఇన్సినరేషన్, కిడ్స్ డైపర్ చేంజ్ రూమ్, కేఫే, వైఫై సౌకర్యం, వాటర్ ఏటిఎం, బ్యాంకు ఏటిఎం తదితర సౌకర్యాలు ఉంటాయి. వీటిని నగరవాసులు ఉచితంగా వినియోగించుకోవడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

చార్మినార్ ఫెడెస్టేరియన్ ప్రాజెక్ట్: ప్రపంచ ప్రఖ్యాత చార్మినార్ను మరింత పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి రూ. 35.10 కోట్ల వ్యయంతో చేపట్టిన చార్మినార్ ఫెడెస్టేరియన్ ప్రాజెక్ట్ పనులు తుది దశలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టో భాగంగా 5.40 కిలోమీటర్ల ఔటర్రింగ్ రోడ్ పనులు, 2.30 కిలోమీటర్ల ఇన్నర్ రింగ్రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. ముర్గిచౌక్, మోజంజాహీ మార్కెట్, చార్ కమాన్ అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. సాలర్ జంగ్ మ్యూజియం సమీపంలో మూసిపై వీధి వ్యాపారుల సౌకర్యార్థం ప్రత్యేకంగా బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి అనుమతికై ప్రభుత్వానికి సమర్పించడం జరిగింది.

గ్రేటర్‌లో హరితహారం: గ్రేటర్ హైదరాబాద్‌లో గత మూడు సంవత్సరాలుగా హరితహారంలో భాగంగా రెండు కోట్ల మొక్కలకుపైగా నాటారు. హరితహారం 2016–17లో 84.91లక్షల మొక్కలు, 2017–18లో 76లక్షల మొక్కలు, 2018–19లో 40లక్షలకు పైగా మొక్కలు నాటారు. నాటిన మొక్కలను పరిరక్షించడానికి జీహెచ్ఎంసీ ప్రత్యేక



చర్యలను చేపట్టింది.

బాండ్ల ద్వారా నిధుల సేకరణ: హైదరాబాద్ నగరం లో చేపట్టిన ఎస్.ఆర్.డి.పి పథకానికి నిధుల సేకరణకై బాండ్ల ద్వారా రెండు విడతలుగా రూ. 395 కోట్లను సేకరించింది. బాండ్ల ద్వారా నిధులను సేకరించిన రెండవ నగరంగా జీహెచ్హఎంసీ నిలిచింది. పూణే అనంతరం బాండ్లద్వారా నిధులను సేకరించినందుకు గాను హైదరాబాద్‌కు ప్రోత్సాహకంగా రూ.26 కోట్ల నగదు పురస్కారాన్నీ కేంద్ర ప్రభుత్వం అందచేసింది. ఎస్ఆర్‌డీపీలో చేపడుతున్న 100 కి.మీ. స్కైవేలు, 166 కి.మీ. మేజర్ కారిడార్లు, 1400 కీ.మీ. రోడ్ల నిర్మాణాలకు ఈ నిధులు వెచ్చించనున్నారు. తాజాగా మూడో విడత నిదుల సేకరణకు కసరత్తు ప్రారంభించారు.

రూ.1047 కోట్లతో రోడ్లనిర్మాణం: గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న 9103 కీ.మీ. విస్తీర్ణం లో ఉన్న రోడ్లను రీకార్పెటింగ్, మరమ్మతులు చేపట్టడానికి రూ. 1047 కోట్లతో పనులు పురోగతి లో ఉన్నాయి. వీటిలో రూ. 781. 86 కోట్ల వ్యయంతో 120 పీ.పీ.ఎం రోడ్ల నిర్మాణ పనులు చేపట్టగా ఇప్పటివరకు 65% బీటీ రోడ్ల నిర్మాణం, 40% సి.సి. రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ. 275.59 కోట్లను పీ.పీ.ఎం కాకుండా ఇతర రోడ్ల నిర్మాణాలకు కేటాయించగా దీనిలో 1911 పనులకు గాను 893 పనులు పూర్తయ్యాయి.

మోడల్ మార్కెట్ల నిర్మాణం: గ్రేటర్‌లో రూ. 19.37 కోట్ల వ్యయం తో 38 మోడల్ మార్కెట్ల నిర్మాణం చేపట్టగా 35 మార్కెట్లు పూర్తయ్యాయి. మరో 3 మార్కెట్ల నిర్మాణం ఈ ఫిబ్రవరి మాసాంతంలోగా పూర్తికానున్నాయి.

భారీగా నియామకాలు, పదోన్నతులు: జీహెచ్ఎంసీలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా పదోన్నతులు, నూతన నియామకాలు జరిగాయి. వివిధ కాటగిరీలకు సంబంధించి 144 మందికి పదోన్నతులు కల్పించగా, కారుణ్య నియామకం కింద వంద మందికి, బ్యాక్‌లాగ్ ఖాళీలుగా ఉన్న 79 మంది దివ్యాంగులకు ఉద్యోగ నియమాకాలు కల్పించారు. వీటిలో 27మంది ఏఎంసిలు, 103 మంది సూపరింటెండెంట్లకు పదోన్నతి కల్పించారు. 2013 నుంచి 2018 వరకు గ్రేటర్ హైదరాబాద్‌లో వివిధ కారణాల వల్ల మరణించిన 117 మందికి మేయర్ నిధుల నుంచి రూ. 1,68,88,764లను ఎక్స్‌గ్రేషియాగా అందించారు. జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న పలు పథకాలు, కార్యక్రమాలను చత్తీస్‌ఘడ్, అమృత్‌సర్, బెంగళూర్, చంద్రాపూర్, హరియాణాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు అధ్య యనానికై జీహెచ్ఎంసీని సందర్శించారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో హరితహారం: గ్రేటర్ హైదరాబాద్‌లో గత మూడు సంవత్సరాలుగా హరితహారంలో భాగంగా రెండు కోట్ల మొక్కలకుపైగా నాటారు. హరితహారం 201617లో 81లక్షల మొక్కలు, 201718లో 76.90లక్షల మొక్కలు, 201819లో 43.13లక్షలకు పైగా మొక్కలు నాటారు. నాటిన మొక్కలను పరిరక్షించడానికి జీహెచ్ఎంసీ ప్రత్యేక చర్యలను చేపట్టింది. కిషన్‌బాగ్‌లో రూ. 70లక్షల వ్యయంతో ప్రత్యేకంగా మేజర్ పార్కును ఏర్పాటు చేశారు. 76 కాలనీలలో ఉన్న ఖాళీ స్థలాలను పార్కులుగా రూపొందించారు. రాంగోపాల్‌పేట్, ఉప్పల్, సనత్‌నగర్, జియాగూడా, నలగండ్ల ట్రాన్స్‌ఫారేషన్లలో దుర్గందపూరిత వాసనలు రాకుండా ఔషధ మొక్కలతో గ్రీనరీని అభివృద్ధి చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాలు, ఫ్లైఓవర్ పిల్లర్లపై 13 ప్రాంతాల్లో వర్టికల్ గార్డెన్లను ఏర్పాటు చేశారు.

ఈ ఆఫీస్ ద్వారా కార్యాలయ నిర్వహణ: కాగితం అసవరం లేకుండా ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఫైళ్లను నిర్వహించే విధానాన్ని 2014లో ప్రారంభించారు. ఎలక్ట్రానిక్ ఫైళ్లను అమలు చేస్తున్న మొట్టమొదటి అతిపెద్ద సంస్థగా నిలిచిన జీహెచ్ఎంసీలో డిజిటల్ ఫైళ్ల వల్ల ఫైల్ ట్రాకింగ్, ఫైళ్ల నిర్వహణ వేగవంతం అవుతున్నాయి. అవినీతి రహితంగా, పారదర్శకంగా నిర్వహించే ఈ–ఆఫీస్ ద్వారా ఇప్పటి వరకు లక్షలాది ఫైళ్లు చలామణిలో ఉన్నాయి.

ఎల్.ఇ.డి లైటింగ్: 2018 జనవరి నాటికి గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎల్.ఇ.డి లైట్ల ఏర్పాటు ప్రాజెక్ట్ పూర్తయ్యింది. ముఖ్యంగా ప్రధాన మార్గాలు, వాటి అనుబంధ మార్గాలన్నీ ఎల్.ఇ.డి లైట్లతో వెలిగిపోతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రూ. 271.40 కోట్లతో చేపట్టారు. నగరంలోని 4.53 లక్షల సంప్రదాయ లైట్ల స్థానంలో ఎల్.ఇ.డి లైట్లను అమర్చే ప్రక్రియను జీహెచ్ఎంసీ అధికారులు 2017 జూలైలో చేపట్టారు.

డిసెంబర్లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకోగా లక్ష్యానికి అనుగుణంగా ప్రధాన మార్గాలన్నింటిలో ఎల్.ఇ.డి లైట్లు ఏర్పాటు చేశారు.

(ఇంకావుంది..)

26న భారతమాత మహా హారతి

విజయక్రాంతి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న భరతమాతకు మహాహారతి ఇస్తున్నట్టు భారతమాత ఫౌండేషన్ తెలిపింది. ఈ మేరకు ఫౌండేషన్ ఛైర్మన్ జీ కిషన్‌రెడ్డి ఒక ప్రకటన చేస్తు దేశభక్తి పెంపొందించే విధంగా పీపుల్స్ ప్లాజా (నెక్లెస్‌రోడ్) వద్ద కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా 3000 మంది విద్యార్థినులు భారతమాత వేషధారణలో త్రివర్ణ పతాకాలు చేతబట్టి ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నారని చెప్పారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు చాగంటి కోటేశ్వరరావు సహా పలువురు సాహితి వేత్తలు ప్రసంగాలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిరుద్యోగ భృతి కల్పించాలి

విజయక్రాంతి, హైదరాబాద్: వయోపరిమితి ఆధారంగానే నిరుద్యోగ పట్టభద్రులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని విద్యార్థి నిరుద్యోగ ఫ్రంట్ ఛైర్మన్ చనగాని దయాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన నిరుద్యోగ భృతి రూ. 3016 లు కాలయాపన చేయకుండా ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. ఉస్మానియా యూనివవర్సిటీ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో విద్యార్థి నాయకులతో కలిసి మాట్లాడారు. డిగ్రీ చదువుతున్న ప్రతి విద్యార్థికి నిరుద్యోగ భృతి ఇవ్వాలని, నియమాలు, నిబంధనల పేరుతో కుదించే అవకాశం లేకుండా నిరుద్యోగులందరికీ ఇవ్వాలన్నారు.

ప్రియాంకా ఆగయీ..

(మొదటిపేజీ తరువాయి) ముఖ్యంగా రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథీ, సోనియా గాంధీ ఎన్నికైన రాయ్ బరేలీలో ప్రియాంకను పార్టీ జనరల్ సెక్రటరీగా చేయడంపై కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. టపాకాయలు కాల్చి, డాన్సులు చేస్తూ ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటున్నారు. ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సైతం పండుగ వాతావర ణం నెలకొంది. పెద్ద సంఖ్యలో చేరుకున్న కార్యకర్తలు లడ్డూలు పంచారు. డోలు వాయిస్తూ చిందులు తొక్కారు. బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో ప్రియాంక గాంధీని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. గాంధీభవన్‌లో బుధవారం టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు.



స్వాగతించిన నేతలు

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు కెప్టెన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి మధు యాష్కీ, ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌లు, ప్రియాంక గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి రావడాన్ని స్వాగతించారు. ఏఐసీసీ కార్యదర్శి. వి.హను మంతరావు, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి తదితరులు ప్రియాంక రాక దేశ రాజకీయాలను మలుపు తిప్పుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కుటుంబపాలనకు నిదర్శనం: మోడీ

(మొదటిపేజీ తరువాయి) సింధియా వంటి యువ నేతలతో తాము ఈ పోరాటంలో ముందడుగు వేస్తామన్నారు. పేదలు, బలహీన వర్గాల కోసం తాము పోరాడుతామన్నారు. తాము ఉత్తర ప్రదేశ్‌కు , ఉత్తర ప్రదేశ్ యువతకు అవసరమైనవాటి కోసం పోరాడుతామన్నారు. బ్యాక్‌ఫుట్ మీద ఆడే పార్టీ తమది కాదన్నారు. ఎక్కడైనాసరే ఫ్రంట్ ఫుట్‌తోనే ఆడతామన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో ఓ కొత్త, సానుకూల మార్పు వస్తుందన్నారు. మాయావతి, అఖిలేశ్‌ను తాను గౌరవిస్తానన్నారు. తమ ముగ్గురి లక్ష్యం ఒకటేనని, అది బీజేపీని ఓడించడమేనని చెప్పారు. మాయావతి, అఖిలేశ్‌తో తమకు వైరం ఏదీ లేదన్నారు. తమ మధ్య భావసారూప్యత ఉందన్నారు. వారికి సహకరించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

దేశ రాజకీయాల్లో కీలక మార్పులు: మోతీలాల్ వోహ్రా

ఎన్నికల వేళ ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంక గాంధీ రావడంపై పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత మోతిలాల్ వోహ్రా మాట్లాడుతూ చాలా కీలక బాధ్యతలను ప్రియాంక గాంధీకి అప్పగించారని అన్నారు. యూపీ తూర్పు ప్రాంతాన్నే కాకుండా ఇతర ప్రాంతాల్లోను ఆమె ప్రభావం కనిపించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


అందరూ స్వాగతించే నిర్ణయం: కపిల్ సిబల్



ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా ప్రియాంక గాంధీని నియమించడాన్ని స్వాగతిస్తున్నాం. ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఆమె ప్రవేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపనుంది. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఉత్ప్రేరకంగా పనిచేయనుంద'ని సీనియర్ నేత కపిల్ సిబల్ పేర్కొన్నారు.

పార్టీకి జరిగిన పెద్ద శస్త్ర చికిత్స: వీరప్ప మొయిలీ

ప్రియాంక గాంధీ నియామకం పార్టీకి కొత్త ఉత్సాహం తీసుకువస్తుందన్న నమ్మకాన్ని మరో సీనియర్ నేత వీరప్ప మొయిలీ వ్యక్తం చేశారు. ప్రియాంక నియామకాన్ని కాంగ్రెస్ పార్టీకి రాహుల్ గాంధీ చేసిన పెద్ద శస్త్రచికిత్సగా అభివర్ణించారు. అమేథి, రాయబరేలి నియోజకవర్గాలను పర్యవేక్షిస్తున్న ప్రియాంక గాంధీకి పార్టీలోని కార్యకర్తలందరితో పరిచయాలు ఉన్నాయని రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ తెలిపారు. విదేశాల నుంచి తిరిగి రాగానే ఫిబ్రవరి 1న ప్రియాంక బాధ్యతలు చేపడతారని రాజీవ్ శుక్లా వెల్లడించారు. కాగా, ప్రియాంక ప్రత్యక్ష రాజకీయ ప్రవేశంపై కాంగ్రెస్ కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. 'ఇందిరా గాంధీ మళ్లీ వచ్చారంటూ' పోస్టర్లు ప్రదర్శించారు.



కీలక పరిణామం: షీలా దీక్షిత్

ప్రియాంక గాంధీ క్రియాశీలక రాజకీయాల్లోకి రావడాన్ని 1998 నుంచి 2013 వరకూ వరుసగా మూడు సార్లు ఢిల్లీ ముఖ్యమంత్రిగా పనిచేసిన షీలాదీక్షిత్ స్వాగతించారు. ప్రియాంక రాజకీయాల్లోకి రావడం చాలా పెద్ద పరిణామమని అన్నారు. పార్టీకి కొత్త శక్తి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. 'కాంగ్రెస్ నేతలు, శ్రేణులతో సహా పార్టీ చాలా సంతోషంగా ఉంది. పరిస్థితుల్లో ఎంతో మార్పు వస్తుందనే బలమైన అంచనాలున్నాయి' అని షీలాదీక్షిత్ అన్నారు. తూర్పు ఉత్తరప్రదేశ్ బాధ్యతలు ప్రియాంకకు అప్పగించడం శుభ పరిణామమని, యూపీ ప్రజలకు ప్రియాంక అంటే ఎంతో ఇష్టమని, అందుకు అనుగుణంగా ప్రజల కోసం ప్రియంక ఎంతో చేస్తారన్న నమ్మకం తనకు ఉందని చెప్పారు.

వచ్చే నెల 6 నుంచి..

ఏపీఎస్ ఆర్టీసీ సమ్మె

(మొదటిపేజీ తరువాయి) పరిష్కరించక పోవడంతో సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందని యూనియన్ నేతలు పేర్కొన్నారు. వేతన సవరణపై గుర్తింపు కార్మిక సంఘం, యాజమాన్యం మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఆర్టీసీలోని 8 కార్మిక సంఘాలు తమ ప్రదానమైన డిమాండ్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు వేతన సవరణ అమలు చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలనే తదితర డిమాండ్లతో సమ్మెకు దిగాలని నిర్ణయం తీసుకున్నాయి. కార్మిక జేఏసీకి ఆర్టీసీ అధికారుల సంఘం కూడా మద్దతు పలికింది. సమ్మెను విజయవంతం చేయడం కోసం ఆర్టీసీ గుర్తింపు సంఘమైన ఎంప్లాయిస్ యూనియన్ (ఏయూ), మరో పెద్ద యూనియనైన ఎన్ఎంయూతో సంప్రదింపులు జరుపుతోంది. గతంలో ఈ రెండు సంఘాలూ ఏకమై 43శాతం ఫిట్‌మెంట్ సాధించుకున్నాయి. అదే అనుభవంతో ఇప్పుడు మరోసారి ఐక్యంగా సమ్మెబాట పట్టాలని కార్మిక సంఘాల జేఏసీ ముందుకు సాగుతోంది.

ఏపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరి పోటీ

(మొదటిపేజీ తరువాయి) 175 స్థానాల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక హోదా, విభజన హామీలపై ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటనతో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ పెరిగిందని నేతలు భావిస్తున్నారు. ఏపీలో ఒంటరిగానే పోటీ చేయాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుందని నేతలు చెబుతున్నారు. సమావేశం అనంతరం ఏపీ కాంగ్రెస్ ఇన్చార్జి ఊమెన్ చాందీ మీడియాతో మాట్లాడుతూ ఏపీలో ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. 175 అసెంబ్లీ, 25 లోక్సభ స్థానాల్లో పోటీ చేస్తామని, ఏఐసీసీ ఆదేశాల మేరకు ఎన్నికల కమిటీలను ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. ఫిబ్రవరిలో 13 జిల్లాల్లో బస్సుయాత్ర నిర్వహించాలని నిర్ణ యం తీసుకున్నామని, బస్సుయాత్రపై ఈనెల 31న భేటీలో చర్చిస్తామని ఊమెన్‌చాందీ చెప్పారు.

విద్యార్థులకు ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలు పంపిణీ

విజయక్రాంతి, అంబర్‌పేట్: కాచిగూడ డివిజన్‌లోని కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంబర్‌పేట్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు భారత ప్రధాని నరేంద్రమోడి రచించిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బి.సంతోష్‌కుమార్, కృష్ణాకుమార్, క్షీర్‌సాగర్, అరవింద్, వాసు, ఎస్ఎస్.రాము, మురళి, సోమేష్, నాగరాజు, అసీఫ్‌ఆల్లీ, భీంరాజ్, ప్రశురాం, రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఏఎస్ రావు ఒలంపియాడ్‌లో

ఆలిండియా నెం.1 గా శ్రీ చైతన్య

విజయక్రాంతి, హైదరాబాద్: డాక్టర్ ఏఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ గత ఏడాది డిసెంబర్ 30న 31వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఫైనల్ పరిక్షలు నిర్వహించింది. ఈ పరిక్షల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు రెండు ప్రకటించారు. ఈ రెండు ర్యాంకులు శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు సాధించారని అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. టాప్ 10 లో 13 ర్యాంకులు, టాప్ 20లో 24 ర్యాంకులు శ్రీ చైతన్య విద్యార్థులు సాధించారని వివరించారు. గత ఏడు సంవత్సరాలుగా ఏఎస్ రావు ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తు నెంబర్ 1 గా నిలిచారని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు తెలిపారు. అదే విధంగా ఇటీవల విడుదలైన ఐఎంవో పరిక్షా పలితాల్లో రెండు ఇంటర్ నేషనల్ ఫస్ట్ ర్యాంకులు సాధించామని పేర్కొన్నారు.

నారాయణ స్కూల్స్ సెన్సేషనల్ విక్టరీ

విజయక్రాంతి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అసోసియేషన్ ఆఫ్ మ్యాథ్స్ టీచర్స్ ఆఫ్ ఇంఇయా తుది దశ పోటీ పరిక్షల్లో నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో మెరిశారు. నారాయణ విద్యార్థులు అలిండియా టాప్ 10 ర్యాంకుల్లో 2,5,6,7,8, 10 వంటి ర్యాంకులను చేజిక్కుంచుకున్నారని నారాయణ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ తెలిపారు. ఫలితాలు విడుదలైన అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతు ప్రపంచీకరణలో భాంగా విద్యా వ్యవస్థ పరిధి విస్తృతం అవుతోందన్నారు. న్యూమరికల్ స్కిల్స్‌ను పెంపొందించడంతో పాటు ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.



అతిగా మద్యం తాగితే...

సాధారణంగా పార్టీలలో చాలామంది ఆహారంతో పాటు, మద్యం కూడా తీసుకుంటూ ఉంటారు. మద్యం ఎక్కువగా తీసుకుంటే మరుసటి రోజు తల బరువుగా అనిపించి, వాంతులు, కళ్ళు తిరగటం, అలసటగా ఉంటుంది. ఇలా ఎక్కువ మద్యం త్రాగడం వల్ల వచ్చేది 'హ్యాంగోవర్'. నిజానికి హ్యాంగోవర్‌కు చాలా కారణాలు ఉంటాయి. మద్యం తాగడం వల్ల శరీరంలోని హార్మోన్లు బ్యాలెన్స్ తప్పుతాయి. ఆ సమయంలో కొందరు మూత్రానికి ఎక్కువగా వెళ్తారు. దాంతో వారి శరీరంలో నీరు తగ్గినందువల్ల కూడా తల బరువుగా మారచ్చు. మద్యం తాగడం వల్ల నిద్రపై కూడా ప్రభావం పడుతుంది. కొందరు తరచూ అర్ధరాత్రి వరకూ మద్యం తాగుతుంటారు. ఫలితంగా వారికి సరిగా నిద్రపట్టదు. అలసటగా ఉండడానికి ఇది కూడా ఒక కారణం. ఎక్కువ మద్యం తాగిన తర్వాత శరీరం దానితో పోరాడేందుకు ప్రయత్నిస్తుంది. అంటే అది మద్యం వల్ల శరీరంపై చెడు ప్రభావం పడకుండా చేయాలని చూస్తుంది. బహుశా దానివల్ల కూడా జనం ఎక్కువ తాగిన తర్వాత గందరగోళానికి గురైనట్లు కనిపిస్తారు అని నెదర్లాండ్ ఉట్రెక్ట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ యోరిస్ సి వర్సటర్ చెప్పారు. ఈజిప్టులో 1900 ఏళ్ల క్రితం ఒక మెనూలో హ్యాంగోవర్ దించుకోడానికి వారు ఒక మందును వాడేవారని, దానిని ఈరోజుల్లో అమల్లోకి తీసుకురావడం చాలా కష్టమని చెబుతున్నారు. ఉప్పు చల్లిన రేగుపండ్లు, పచ్చి గుడ్డు, టమాటా జ్యూస్, సాస్ తదితరాలు తినమంటారు. కొందరు అరటిపండు తింటే ఉపశమనం లభిస్తుందని, అరటిపండు తినడం వల్ల శరీరానికి పొటాషియం లోటు తీరుతుందని, హ్యాంగోవర్ కూడా దిగిపోతుందని చెబుతారు. కానీ, అరటిపండు తినగానే తీరిపోయేలా పొటాషియం లోపం అనేది ఎప్పుడో ఒకసారి అతిగా మద్యం తాగడం వల్ల ఏర్పడదు. గుడ్డులో ఉన్న అమైనో ఆమ్లాలు ఎసిటాల్డిహైడ్‌ను విరేచేయడానికి సాయపడటం వల్ల గుడ్డును తినమని, బాగా నీళ్ళు తాగమని, ఒక ఆస్ప్రిన్ మాత్ర వేసుకోవడం అన్నిటికంటే మంచిదని అంటున్నారు. మద్యం తాగే ముందు బాగా తినడం వల్ల, మెల్లమెల్లగా తాగడం వల్ల కూడా హ్యాంగోవర్ తక్కువగా ఉంటుంది. ఎక్కువ మద్యం తాగడం వల్ల వచ్చిన ఆ హ్యాంగోవర్‌ను కేవలం సమయం మాత్రమే తగ్గించగలదు. ఎక్కువగా విశ్రాంతి తీసుకోవడం మంచిది. ఇంకో ముఖ్యమైన విషయం ఎక్కువ మద్యం తాగకపోవడం అనేది మరీ మంచిది.

టెంపుల్ టూరిజంను పట్టించుకోరా?

టూరిజం విభాగం అడ్వెంచర్ టూరిజం, మెడికల్ టూరిజం వంటి వాటిని ప్రోత్సహిస్తున్నట్టే టెంపుల్ టూరిజం, తీర్థయాత్ర టూరిజంకి కూడా ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆర్థికరంగ కార్యకలాపాలను ప్రోత్సహిస్తూ, ప్రజల ఆదాయాన్ని పెంచుతూ, పంచుతూ ఉన్న ఈ రంగానికి కూడా దన్ను ఇవ్వవలసిన ఆవశ్యకత ఉంది. భారతదేశంలో ధార్మిక, మత పరమైన కార్యక్రమాలతో ఆర్థిక వ్యవస్థ ముడిపడి ఉంటుందన్నది ఇప్పుడిప్పుడే ఆర్థిక వేత్తలు గుర్తించడం ముదావహం.

భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఇటీవల జనవరి 15 (మకర సంక్రాంతి) నుంచి మార్చి నెల 4వ తేదీ (మహాశివరాత్రి) వరకూ ప్రయాగరాజ్ లో జరిగే కుంభమేళా వల్ల ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి రూ. 1.2 లక్షల కోట్ల మేరకు ఆదాయం సమకూరుతుందని, కుంభమేళా వల్ల ఆరు లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేసింది. దాదాపు మూడు నెలల పాటు కొనసాగే ఈ ధార్మిక మహాపర్వంలో దాదాపు పదిహేను కోట్ల మంది గంగస్నానాలు చేస్తారని కూడా సీఐఐ అంచనా వేయడం గమనార్హం. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కుంభమేళా నిర్వహణకు చేసిన ఖర్చు మొత్తం రూ. 4.200 కోట్లు. ఆధ్యాత్మిక అనుభూతి, శ్రద్ధాళువుల సమాగమం వంటివి పక్కన బెట్టి కేవలం ఆదాయవ్యయాల చిట్టా ఆవర్జాలనే లెక్క వేసి చూస్తే ఇంత తక్కువ పెట్టుబడికి ఇంత ఎక్కువ ఆదాయం వచ్చే మరో వాణిజ్య కార్యకలాపం మరొక్కటి కనిపించదు. ఒక్క హోటల్ రంగంలోనే రెండున్నర లక్షల మందికి, విమానయానం, విమానాశ్రయాల రంగంలో లక్షన్నర మందికి, పర్యాటక రంగంలో 45000 మందికి, పర్యావరణ టూరిజం, వైద్య టూరిజం వంటి రంగాలలో 85000 మందికి ఉపాధి లభిస్తుందని సీఐఐ అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఇవే కాక అసంఘటిత రంగంలో టూర్ గైడ్లు, టాక్సీ డ్రైవర్లు, దుబాషీల వంటి 55000 మంది కుంభమేళా వల్ల లబ్ధి పొందుతారు. కుంభమేళా వల్ల కేవలం ఉత్తరప్రదేశ్‌కే కాక, పొరుగున ఉన్న రాజస్థాన్, ఉత్తరాఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలోనూ టూరిజం, హోటల్ రంగాలకు అదనపు ఆదాయం పెరుగుతుందని సీఐఐ అంచనా వేసింది. ఆస్ట్రేలియా, యూకే, కెనడా, మలేషియా, సింగపూర్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, మారిషస్, జింబాంబ్వే, శ్రీలంక వంటి పలు దేశాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో రావడం వల్ల విలువైన విదేశీ మారకం మనకు లభిస్తుందని సీఐఐ పేర్కొంది.

హార్వర్డ్ విశ్వవిద్యాలయం కూడా ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసి కుంభమేళాకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను అధ్యయనం చేస్తోంది. హార్వర్డ్ ఫాకల్టీ ఆఫ్ ఆరట్స్ అండ్ సైన్సెస్, హార్వర్డ్ డివినిటీ స్కూల్, హార్వర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ డిసైన్, హార్వర్డ్ బిజినెస్ స్కూల్, హార్వర్డ్ మెడికల్ స్కూల్, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ వంటి సంస్థల విద్యార్థులు, పరిశోధకులు అక్కడే మకాం వేసి ఉన్నారు. ఒక అంచనా ప్రకారం కుంభమేళా జరిగే దాదాపు మూడు నెలల కాల వ్యవధిలో క్షురకుడు రోజుకు రెండువేల రూపాయల వరకు, పూలు, పూజ సామగ్రి అమ్మేవారు రూ. మూడు వేల వరకు, పడవ నడిపేవారు రోజుకు రూ. 1800 , పూజారులు, పాండాలు దాదాపుగా రూ. 12 వేల వరకు సంపాదిస్తారన్నది అంచనా. ప్రయాగలో దాదాపు వెయ్యికి పైగా పడవలు ఉంటాయి. రోజుకు పాతిక వేల టన్నుల ఆహారధాన్యాలు భక్తుల ఆకలి తీర్చేందుకు ఖర్చవుతున్నాయి. యాత్రికుల నిమిత్తం డెబ్బై వేలకు పైగా గుడారాలను ఏర్పాటు చేయడం జరిగింది. నిజానికి పండుగల ఆర్థిక ప్రాముఖ్యాన్ని, ఆర్థిక కార్యకలాపాలకు బూస్టర్ డోస్ ఇవ్వడంలో పండుగలు, జాతరలు, తీర్థయాత్రల ప్రాముఖ్యాన్ని ఆర్థికవేత్తలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు. నిజానికి కోల్‌కత్తాలో దుర్గాపూజ ఉత్సవాలు దాదాపు పదివేల కోట్ల రూపాయల లావాదేవీలను ప్రోత్సహిస్తాయి. విగ్రహాల తయారీ నుంచి పూజా మండపాల అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాల వరకూ లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది. హైదరాబాద్‌లోని తొమ్మిది రోజుల గణేశోత్సవాలకు కూడా దాదాపు అయిదువేల కోట్ల రూపాయల వరకూ ఆర్థిక లావాదేవీలు జరుగుతాయని ఆర్థిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉత్తరాదిలో కావడ్ యాత్ర, దక్షిణాదిలో అయ్యప్ప యాత్ర, రకరకాల ధార్మిక దీక్షలు, ఉత్సవాలు ఆర్థిక కార్యకలాపాలకు వేగాన్ని, ఊపును ఇస్తాయి. దురదృష్టవశాత్తూ ఈ అంశాలపై మన దేశంలోనే సరైన అవగాహన లేదు. ఉదాహరణకు శ్రావణ మాసంలో జరిగే కావడ్ యాత్రలో ఉత్తర భారతదేశంలో దాదాపు మూడు కోట్ల మంది పాలుపంచుకుంటారు. వీరంతా ఒక్కొక్కరూ అయిదు వేల రూపాయలు ఖర్చు చేసినా ఏ మేరకు ఆర్థిక లావాదేవీలు జరుగుతాయన్నది అంచనా వేసుకోవచ్చు.

కొన్నేళ్ల క్రితం తమిళనాట జరిగిన ఒక అధ్యయనం ప్రకారం దేశంలోని దేవాలయాలన్నిటిలో ఏటా హుండీలలో రూ. 18427 కోట్ల రూపాయల మేరకు దక్షిణలు సమర్పించుకోవడం జరుగుతోంది. అంతే కాదు. దాతల్లో 95 శాతం మంది నెలకు పదివేల రూపాయల లోపు మాసిక ఆదాయం ఉన్నవారేనని కూడా ఈ అధ్యయనం తేల్చి చెప్పింది. పరిమిత మోతాదులో వస్తువుల కొనుగోలును పెంచడం, పలు వస్తువులకు మార్కెట్‌ను కల్పించడంలో ఉత్సవాలు, తీర్థయాత్రలు తమదైన పాత్రను పోషిస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం టెంపుల్ టూరిజం, తీర్థయాత్ర ఆర్థిక వ్యవస్థల పట్ల దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా అడుగులు వేయడం అవసరం.

పగలూ వెలుగుతున్న వీధి దీపాలు

పలు గ్రామాలలో రాత్రిపూట వెలగాల్సిన విద్యుత్ దీపాలు పగలు కూడా వెలుగుతూ విద్యుత్తు వృధా అవుతుండటంతో పాటు విద్యుత్తు శాఖకి తీవ్ర నష్టం కలుగుతోంది. ప్రతి గ్రామంలోని కొంతు స్తంభాలకు బల్బులను బిగించి వాటికి ఆన్ అండ్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో నిరంతరం లైట్లు వెలుగుతున్నాయి. అధిక వేడిమి వల్ల కొన్ని బల్బులు మాడిపోతున్నాయి. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, జూనియర్ లైన్‌మెన్ల అవగాహన రాహిత్యం వల్ల పట్టపగలే లైట్లు వెలుగుతున్నాయి. అక్రమ విద్యుత్ వినియోగదారులపై కొరడా ఝులిపిస్తూ కొంతు బిల్లులు కట్టనివారికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తూ, కరెంటును పొదుపుగా వాడుకోవాలని ప్రజలను చైతన్య పరచాల్సిన విద్యుత్ అధికారులు పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతున్న లైట్లను గుర్తించుకోవటం లేదు. మండల స్థాయిలో ఏ.ఈ లు, ఏ.డి.ఇలు నిరంతరం విద్యుత్ వాడకంపై సమీక్షలు నిర్వహిస్తూ తంతుగా విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సర్పంచులు ఈ తతంగం తెలిసినా వారు పట్టించుకోవటం లేదు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేసి గ్రామాలలో రాత్రివేళ మాత్రమే విద్యుత్ బల్బులు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– కామిడి సతీష్ రెడ్డి
జడలపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

నూతన అధ్యయనమే పరిశోధన



పరిశోధన అంతరాళలను (భూమ్యాకాశాలు కలిసే చోటు) విస్తరింపచేసేది. నీలోనూ, నీ కుటుంబసభ్యులలోనూ, నీ పిల్లలలోనూ, విద్యార్థులు, సహోద్యోగులలోనూ దాగిఉన్న బంగారు నిధులను తొలుచుకుంటూ సాధ్యాలను పరిశీలించు. బోధనలో, క్రొత్త విషయాలలో, నూతనరీతులనూ, పిల్లలకు, యువతకు, మధ్య వయసువారికి, పెద్దలకు వివరించడానికి నూతనమార్గాలను పరిశోధించు. నీకు అభిరుచి కలిగిన విషయాలలో ఏంజరుగుతోందో ఇంటర్నెట్, వెబ్‌సైట్‌ల ద్వారా ఎప్పుడూ తెలుసుకుంటూ ఉండడం కూడా పరిశోధనే. భారతదేశంలో పర్యటిస్తూ అరణ్యాల అందాలను, నదులను, పర్వతాలను, ఎడారులను, సరస్సులను, గొప్ప యాత్రాస్థలాలలను పరిశోధించు.

పరిశోధన అనేది నూతన అధ్యయనం, భవిష్యద్దర్శనాలను నూతన గురువులతో కలుస్తూ కనుక్కో!

నిన్ను, ఇంతవరకూ నీ జీవితంలో నీ సాధనలను పరిశీలించి, నీకు నీవు ఎలా విలువలు ఆపాదించుకోగలవో చూడు. నీ తరగతిని పరిశీలించు, వారిలో ఏ ఇద్దరు అత్యున్నతంగా నిలువగలరో గుర్తించు. అలాగే వారిలో ఏ ఇద్దరికి ప్రేమ, పోషణ, చేయూత, పుష్టి కావాలో గుర్తించు. అందువలన వారు సఫలురు కాగలరు. వారి ఉన్నతికి, ఎదుగుదలకు నీవంతు ప్రయత్నం చేయి.

నీ ప్రియమైన కూతురు పరిస్థితిని, ఎదుగుదలను నీ సంతానంగా, విద్యార్థిగా, కుటుంబసభ్యురాలిగా, సమాజంలోని వ్యక్తిగా పరిశీలించు. ఆమె ఎంచుకున్న విషయాలలో శ్రేష్ఠతను అలవా టుగా పొందటానికి ఏంచేయా లో పరిశోధించు.

నీలోనూ, నీ వారిలోనూ దాగి ఉన్న బలహీనతలను, బలాలను లోతైన ఆలోచనలతో తొలుచుకుంటూ పరిశోధించి, బలహీనతలు దూర ంచేయటానికి, బలాలు అతిశయించటానికి సాధ్యాలను పరిశీలించు.

నీ కుటుంబసభ్యులతోనూ, నీ విద్యార్థులతోనూ అద్భుతమైన ప్రదేశాలైన ఉదయ్‌పూర్, మన్థని, భీమ్‌తల్, ఇంకా తక్కిన ప్రదేశాలకు విహారయాత్రలకు వెళ్ళు. కాలినడకతో, ఆటోలో, బస్సులో, కారులో, రైలులో, విమానంలో, పడవలో, ఇంకా తక్కిన ప్రయాణసాధనాలలో భారతదేశ వివిధవిభాగాలను అధ్యయనం చేయడానికి పర్యటించు. రెండవ తరగతిలో ప్రయాణంచేస్తూ సాధారణ సాధ్యాల అద్భుతాలను పరిశోధించు.

నీకు వారానికి సరిపడేవి, తాజాగా ఉండే చక్కటి కూరలను తక్కువ ధరలో దొరికే ఖాండేరావు కూరగాయల మార్కెట్‌కి వెళ్ళి కొని ఆర్థికతను పరిశోధించు.

సాహిత్యం, కవిత్వం, సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, తక్కిన కళలను పుస్తకాలద్వారా, స్వయంగా దర్శించటం ద్వారా పరి శోధించు. ఇప్పటికే దొరుకుతున్న 'గురుబోధ్' పుస్తకాన్ని మన విలువలు, సంస్కృతిని తెలుసుకోవటానికి పరిశోధించు. అద్భుతమైన దేశభక్తి గీతాలైన 'వందేమాతరం', 'సారే జహాఁసే అచ్ఛా', 'జనగణమన', 'నమామి భారతమాతరమ్' పాటల అర్థాలను తొలుచుకుంటూ, పరిశీలిస్తూ, పరిశోధిస్తూ నీ అవగాహనా పరిధులను పెంచుకో!

చూడూ! పరిశోధన దృష్టిని, అంతర్దృష్టిని, అనుభవాన్ని కలిగిస్తుంది. భారతదేశ, ప్రపంచ శ్రేష్ఠతలను పరిశోధిస్తూ, పరిశీలిస్తూ, తొలుచుకుంటూ, హద్దులను దాటు తూ పరవశాన్ని అనుభవించు. పరవశం అద్భుతమైన క్రొత్త ఆనందం. జీవితం, ప్రపంచం అద్భుతమైనవి. పరిశోధిస్తూ నీ జీవన ప్రయాణాన్ని సుసంపన్నం చేసుకో.

ఇప్పుడు నీవు అనుకూలంగా, చురుకుగా, సమయోచితంగా, సమర్థవంతంగా, ఆర్థికంగా, అధ్యయన శీలివిగా, పరిశోధకురాలిగా అనందోత్సాహాద్భుతాలతో నిండావు.

రా! మనం ఈ ఆనందకరయాత్రను కొనసాగిద్దాం.

నూతనానుభవపరవశతకు పరిశోధించు, పరిశీలించు, విస్తరించు, తొలచి చూడు!

పరిశోధనకు త్వరితగతి మార్గాలు

1. కృపకు, నీ విద్యార్థులకు ప్రతిరోజూ ఓ క్రొత్త కథను చెప్పు.
2. ఆదివారాలలో కొత్త ఆనందాన్ని కలిగించే మార్గాన్ని ఎన్నకుని అనుభవించు.
3. ప్రతినెలా ఒక కొత్త విషయాన్ని, పుస్తకాన్ని అధ్యయనం చేయి.
4. నీ అద్భుతమైన కుటుంబంతో ఉత్సాహభరితమైన ప్రదేశాన్ని ఎన్నుకుని దర్శించి, ఆనందాన్ని అనుభవించు.
5. ఏడాదికి ఒకసారైనా నీ అద్భుతమైన పాఠశాల విద్యార్థులతో కలిసి చేసే ప్రయాణంలో సభ్యురాలివికా!
6. ప్రతి ఆరునెలలకు ఒకసారి నీ బలాలు, బలహీనతలు, భయాలు, అవకాశాలు, ముందుగా చేయవలసినవి, లోపాలు, సాధ్యాలను ఆత్మపరిశీలన చేసుకో.
7. నీ జీవితంలో నీకు ఆదర్శప్రాయమైన వారిని వెదకి, గుర్తించి వారి మార్గంలో నడుస్తూ, నీ ఎదుగుదలతో ఆ మార్గానికి మరింత విలువను ఆపాదించు.
8. మేడమీదకో, పర్వత శిఖరానికో చేరి చుట్టూ చూస్తూ అంతరాళాలను చూడటంలోని ఆనందాన్ని అనుభవించు.



గట్టు నారాయణ

పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు భ్రమపడిన పాలక వర్గం

(నిన్నటి పేజీ తరువాయి)

ఈ నాయకులు తమ పోట్లాటలు, ఇష్టా ఇష్టాలతో, ప్రత్యేక రాష్ట్రాన్ని కాంక్షించే ప్రజలు నిమిత్తం ఉంచుకొనలేదని సిద్ధిపేట ఎన్నిక అనంతరం గ్రహించి, తిరిగి ప్రజాసమితితో సంబంధాలు పెట్టుకొన్నారు. పంచాయతీ సమితులకు, జిల్లా పరిషత్తులకు నాయకులుగా తమ అభ్యర్థులు ఎన్నిక కావడం వల్ల పరిస్థితులు తమకు అనుకూలంగా మారుతున్నట్టు భ్రమపడిన పాలక వర్గం వారు సిద్ధిపేట నియోజకవర్గం నంపడి శాసనసభకు జరిగిన ఉప ఎన్నికలలో శృంగ భంగం పొందారు.

టి.యు.ఎఫ్. అభ్యర్థిగా శాసనసభ నియోజకవర్గం నుండి జులై మాసంలో శ్రీ వి.బి. రాజు రాజ్యసభకు ఎన్నికవడంతో సిద్ధిపేట నియోజక వర్గానికి ఏర్పడిన ఖాళీలో పోటీ చేసిన ప్రజా సమితి అభ్యర్థి శ్రీ ఏ. మదన్‌మోహన్ 20 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కమ్యూనిస్టు అభ్యర్థి డిపాజిట్ కోల్పోయారు. హోంశాఖామంత్రి శ్రీ వెంగళరావు, ప్రాంతీయ సంఘం అధ్యక్షుడు శ్రీ జె. చొక్కారావు నిర్విరామ కృషి వల్ల కాంగ్రెస్ అభ్యర్థి డిపాజిట్ మాత్రం దక్కించుకున్నారు. ఉప ముఖ్యమంత్రి శ్రీ జె.వి. నరసింగరావు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, ప్రచారానికి వెళ్ళి చీరలు పంచిపెట్టి అపహాస్యం పాలైనారు. సిద్ధిపేట ఎన్నిక ఫలితం 'తెలంగాణ ఏర్పాటు నేడో రేపో' అనే పరిస్థితి కలుగజేసి ప్రత్యేక రాష్ట్ర వాదులలో నూతన ఉత్సాహాన్ని, సమగ్రతా వాదులలో నిరాశను కలుగజేసింది.

సిద్ధిపేట ఎన్నిక ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తున్నదని కమ్యూనిస్టు పార్టీ అంగీకరించింది. ఈ పార్టీలో ఉన్న ఆంధ్ర పెత్తందార్ల తెలంగాణ తాబేదారులు, మనసులో విడిపోవాలనుకుంటున్నా, ఆ సంగతి మిత్రులతో వారు చెబుతున్నా బహిరంగంగా మాట్లాడలేకున్నారు. తెలంగాణకు రాష్ట్ర ప్రతిపత్తి ఇవ్వాలని 'సిండికేట్' కాంగ్రెస్ డొంకతిరుగుడుగా అంగీకరించింది. శ్రీ బ్రహ్మానందరెడ్డి పదవి నుండి వైదొలగి తెలంగాణా నాయకునికి కొంత కాలం ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టి అప్పటికీ సమస్య పరిష్కారం కాకుంటే విడిపోవడం తప్పదని డాక్టర్ టి.వి.యస్. చలపతిరావు (విజయవాడ) పదేపదే అంటూండగా వారి పార్టీ (కాంగ్రెస్–బి) కూడా అదే అభిప్రాయంతో ఉన్నది.

జులై లో శాసనసభ నియోజకవర్గం నుండి స్థానిక సంస్థల నియెజకవర్గాల నుండి శాసన మండలికి జరిగిన ద్వైవార్షిక ఎన్నికలలో శ్రీ చెన్నారెడ్డి వర్గం నిలిపిన శ్రీ టి. గోవింద్ సింగ్, శ్రీ యస్. వెంకట్రామారెడ్డి, శ్రీ టి. లక్ష్మారెడ్డి, ఎన్నిక కాగా, శ్రీ కొండా లక్ష్మణ్ వర్గానికి చెందిన, శ్రీ కె. రామచంద్రారెడ్డి రెండు నియోజక వర్గాల నుండి పోటీచేసి ఓడిపోయారు. ఎగువ సభలో టి.యు.యఫ్. గ్రూపు నాయకుడుగా ప్రొఫెసర్ సుధాకర్‌రావు ఎన్నికైనారు. శ్రీ వి.బి. రాజు రాజ్యసభకు వెళ్ళిపోవడం, టి.యు.యఫ్. నుండి నలుగురు సభ్యులు పాలక వర్గంలో కలవడం, ప్రధాని మొండి వైఖరి అవలంబించి విదూషకుని వలె వ్యవహరించడం ప్రత్యేక రాష్ట్ర వాదులలో కొందరికి మనస్తాపం కలిగించినది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని, టి.యు.ఎఫ్. నుండి మరి కొందరు బైటకు వెళ్ళితే ప్రధాన ప్రతిపక్షంగా దానికి ఉన్న గుర్తింపు రద్దయి, నాయకత్వం పోగలదని, శ్రీ రామచంద్రారెడ్డికి భయాన్ని కలుగజేసి తనవైపునకు లాగుకునేందుకు ముఖ్యమంత్రి చేసిన ప్రయత్నం విఫలమైనది. శ్రీ కొండాలక్ష్మణ్ సదా అసమ్మతితో రోజు రోజుకు తనకు తానే శత్రువవుతుండగా, శ్రీ చెన్నారెడ్డి మాత్రం తానే ఉద్యమానికి తిరుగులేని, ఎదురులేని, సమర్థుడైన ఏకైక నాయకుడని ప్రజతో అనుపించుకున్నారు. 'ప్రత్యేక రాష్ట్ర వాదులమని చెప్పుకునేవారు శ్రీమతి గాంధీ పార్టీ నుండి విడిపోయేందుకు కూడ సిద్ధంగా లేకుంటే మేమెలా సహాయం చేయాలి' అని పార్లమెంటులోని ప్రతి పక్షాల నాయకులు అన్నారు. ప్రజాసమితితోను, ప్రత్యేక రాష్ట్రవాదాన్ని సమర్థించే పెక్కు సంఘాలు సంస్థలలోను వైషమ్యాలను విభేదాలను సృష్టించాలని పాలక వర్గం ప్రయత్నం చేసి కొంత విజయాన్ని సాధించినప్పటికీ, ప్రజాసమితి నుండి విడిపోయిన అనేక మంది సిద్ధిపేట ఎన్నిక ఫలితం వచ్చిన తరువాత క్రమంగా తిరిగి శ్రీచెన్నారెడ్డిని ఆశ్రయించి ఆయనకు సన్నిహితులు అయినారు. పోటీ సంఘాలు పెట్టిన వారిలో కూడ కొందరు తిరిగి శ్రీ చెన్నారెడ్డిని ఆశ్రయించి మాతృసంస్థలో చేరారు. సమితి నుండి విడిపోయిన వారు తమతో బయటకు రానందున శ్రీమదన్ మోహన్‌ను ఆనాడు అవకాశవాదిగా చిత్రించి, తిరిగి నేడు శ్రీ చెన్నారెడ్డిని ఆశ్రయించడంతో నాడు శ్రీ మదన్ మోహన్ దూరదృష్టి కలిగి సక్రమ నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. యావత్ ప్రపంచదృష్టిని ఆకర్షించే విధంగా ఉద్యమాన్ని నిర్వహించిన విద్యార్థులు, తెలంగాణ ప్రజాసమితి 1970 సంవత్సరాంతంలో బలహీన పడింది. కార్యకర్తలకు చెప్పుకోదగిన కార్యక్రమాలు ఇవ్వలేకపోయింది. ప్రచారసాహిత్యం సమకూర్చలేకపోయింది. నాయకుల మధ్య విభేదాలు గోరంతలు కొండంతలుగా పత్రికలో ప్రచురణ జరుగుతున్నాయి. పరిస్థితి ఏమిటి? భవిష్యత్తు ఏమిటి? అని ప్రశ్నిస్తూ జిల్లాల నుండి పలువురు కార్యకర్తలు, విద్యార్థి నాయకులు ఆందోళన చెందారు.

(సశేషం)

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

ఆడ బిడ్డని బతకనిద్దాం.. వారికి బతుకునిద్దాం..

నేడు జాతీయ బాలికాదినోత్సవం

మన దేశంలో ఆడ పిల్ల అంటే మహాలక్ష్మి అని భావించేవారు ఇప్పటికీ ఉన్నారు. అయితే కొందరు ఇప్పుడు ఆడ పిల్ల పుడితే భారంగా భావిస్తున్నారు. భ్రూణ హత్యలకు పాల్పడుతున్న వారు ఉన్నారు. పుట్టిన నిమిషాల్లోనే ఆడ బిడ్డలను అమ్మేస్తున్నారు. చెట్ల పొదల్లో, మురికికాల్వల్లో ఆడ శిశువులు దర్శనమిస్తున్నారు. పుట్టిన క్షణం నుంచే ఆడబిడ్డలకు ఆంక్షలు విధిస్తున్నారు. ఆ అంతరాన్ని దాటి కళ్ళు తెరిచి భూమ్మీదకి వచ్చినా ఆ అమ్మాయి అడుగడుగునా వివక్షకు గురి అవుతోంది. నేడు ఆడపిల్లల భ్రూణ హత్యలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి.దీన్ని నివారించడానికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ 2008 నుంచి ప్రతి ఏడాది జనవరి 24న భారత జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ పట్ల అవగాహన కల్పించడానికి, బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్యా, సామాజికంగా ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రతి ఏడాది జనవరి 24న జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

తాజా జనగణన లెక్కల్లోనూ స్త్రీ, పురుష నిష్పత్తిలో ఆందోళనకరమైన తేడా కనిపిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యిమంది పురుషులకు 940 మంది మాత్రమే మహిళలున్నట్లు తేలింది. అలాగే, 6 సంవత్సరాల లోపు ఆడపిల్లలైతే ప్రతి 1000 మంది మగ పిల్లలకు 914 మంది మాత్రమే ఉన్నట్లు జనాభా లెక్కల్లో వెలుగు చూసింది. 26.8 శాతం మంది బాలికలకు బలవంతంగా వివాహాలు చేస్తున్నారు. ఇది ఆందోళన కలిగించే విషయమే. గత దశాబ్ద కాలంలో సుమారు 30 లక్షల మంది బాలికలు అదృశ్యమయ్యారు. దీంతో బాల బాలికల లింగ నిష్పత్తిలో వ్యత్యాసం అధికమవుతోందని, మొత్తం జనాభాలో బాలికల సంఖ్య తగ్గిందని స్పష్టంగా అర్థం అవుతోంది.

ఆడపిల్లలకు అందించే విద్యావకాశాలు కూడా దయనీయంగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ భారతంలో ఆడపిల్లల చదువులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. మగపిల్లలతో పాటు వారిని పాఠశాలల్లో చేర్పించినా, కుటుంబ ఆర్థిక అవసరాల కోసమో, ఇతర బాధ్యతలు నెరవేర్చడం కోసమో ఆడపిల్లలను చదువుకు దూరం చేస్తున్నారు. ఉన్నత విద్యావకాశాలు అందుకుంటున్న మహిళలు కూడా నూటికి 10 నుండి 30 శాతం మాత్రమే ఉండడం ఇందుకు సాక్ష్యం.నేటికీ ఆడపిల్లలు ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్య పోషకాహార లోపం. కుటుంబ ఆర్థిక సమస్యలతో ఏదో ఒక పనిచేసి కడుపునింపుకోవాల్సిన దుస్థితి వస్తోంది. ఉన్న ఊర్లో పనులు దొరకక వలసలు పోతున్న ఆడపిల్లలు, అక్కడా రక్షణ లేక లైంగిక దాడుల బారిన పడుతున్నారు. కనిపించకుండా పోతున్న వారి సంఖ్య వందల సంఖ్యల్లో ఉంది. వీటితోపాటు రోజు రోజుకూ బాలికలపై, స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలు మరొకటి. ఆడపిల్లకు బడిలో,గుడిలో,స్నేహితులమధ్య,బంధువుల మధ్య ,అత్తగారింట్లో చివరికి ఇంట్లో కూడా ఎక్కడా సరైన రక్షణ లేదు.ఆడపిల్లల పైన జరిగే ఆకృత్యాలకు అంతే లేకుండా పోయింది. వీటిని అరికట్టి బాలికలకు సమాజంలో రక్షణ ఉందనే నమ్మకాన్ని కల్పించే బాధ్యత ప్రభుత్వం, సమాజం తీసుకోవాలి.దేశంలో పుట్టిన పన్నెండు మిలియన్ల బాలికల్లో మూడు మిలియన్ల మంది తమ పదిహేనవ పుట్టిన రోజును, ఒక మిలియన్ మంది తమ మొదటి పుట్టిన రోజును జరుపుకోకుండానే మరణిస్తున్నారు, లింగ వివక్ష వల్ల ప్రతి ఆరుగురిలో ఒక బాలిక చావుకి గురవుతోంది. యాభై శాతం బాలికలకు పోషకాహారం అందడం లేదు. బాలికలలో ఇద్దరిలో ఒకరు సరైన పోషకాహారం పొందడం లేదు.



విద్యాసంస్థల్లో చదువు కొనసాగిస్తున్న వారికి భద్రత కరువయింది. పసి బాలికలపై కూడా పైశాచిక దాడులు జరుగుతున్నాయి. ప్రైవేటు రంగాల్లో పని చేసే మహిళల పని వేళలు ఎక్కువగా రాత్రివేళల్లో ఉంటున్నాయి. అలాంటి సమయాల్లో తమ ఇండ్లకు చేరుకోవడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోందని, రాత్రి సమయాల్లో బస్టాండుల్లో, రైల్వేస్టేషన్లలో ఆకతాయిల నుంచి గూండాల నుంచి తప్పించుకోవడం కష్టంగా మారుతోంది. ఆకాశంలో సగంగా పిలిచే మహిళల పట్ల అత్యంత అమానుషంగా వ్యవహరిస్తున్న ఈ తీరు ఆందోళన కలిగిస్తోంది.నగరాలలో ఏ రహదారిపై చూసినా సరస్వతి నిలయాల్లో పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన చిన్నారులు భిక్షాటన చేస్తూ కనిపిస్తున్నారు. పిల్లల అక్రమ రవాణాను నిర్మూలించడానికి పోలీసులు, రైల్వే, రవాణా, బాలల హక్కుల కమిషన్, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. అయినా వీటిలో చాల సందర్భాలలో ఏ ఒక్క శాఖకు మరో శాఖతో సమన్వయం లేకపోవడం ప్రధానలోపంగా కనిపిస్తోంది.అక్రమంగా రవాణా అవుతున్న బాలలను వారి వయస్సు బట్టి పనులు మార్చేస్తున్నారు. ఐదేళ్ల లోపు వారిని యాచకులుగా మార్చేస్తున్నారు. ఆరో సంవత్సరంలోకి అడుగుపెట్టగానే వారు బాలకార్మికులుగా మారిపోతున్నారు. బాలికల విషయంలో మరీ ఘోరం. పదకొండేళ్ల ఏళ్ల వయస్సు గల అమ్మాయిలను ఇతర ప్రాంతాలకు తరలించి వ్యభిచార రొంపిలోకి దింపుతున్నారు. వారంతా యుక్త వయస్సు చేరుకునే వరకు ఆ గృహాల్లో నిత్యం క్షోభ అనుభవిస్తున్నారు. ఇప్పటికీ మోక్షం లభించని ఎంతోమంది అక్కడే నరకం అనుభవిస్తున్నారు. బాలల అక్రమ రవాణాకు ప్రభుత్వాల నిర్లక్ష్యమే ప్రధాన కారణం. పిల్లల భద్రత గానీ, వారికి కల్పించాల్సిన సదుపాయాలపైన గానీ దృష్టి పెట్టడం లేదు. పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందిస్తామంటున్న పాలకులు దాన్ని మిథ్యగా మారుస్తున్నారు.

ఇప్పటికైనా పాలకుల ఆలోచనా విధానం మారాలి. అధికారం కోసం కాకుండా సమాజంలో మార్పు కోసం కృషి చేయాలి.

ఇలా అయితే మార్పు కష్టం: బాల్య వివాహాల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలోని బాల్య వివాహాల్లో 40శాతం భారత్‌లోనే జరుగుతున్నాయని 'యునిసెఫ్' వెల్లడించింది. దేశంలో ఏటా 2.66 కోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుత లెక్కల ప్రకారం దేశంలో ఏడు లక్షల మంది అమ్మాయిలు బాల కార్మికులుగా ఉన్నారు.ఈ జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రభుత్వం ప్రారంభించి తొమ్మిదేండ్లు నిండాయి. కానీ అప్పటి నుంచి పరిస్థితుల్లో చెప్పుకోతగ్గ మార్పు రాలేదు. బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. బాలకార్మికులు పెరుగుతూనే ఉన్నారు. ఆడ పిల్లల అక్రమరవాణా జరుగుతోంది. వివక్ష కొనసాగుతోంది. బాలికల పట్ల సమాజం ఇంత వివక్ష చూపుతున్నా దేశం పరువును అన్ని రంగాల్లో నిలబెడుతోంది మాత్రం ఆడపిల్లలే. అలాంటి అమ్మాయిలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తే తమ సత్తా చాటుకుంటారు. లింగ సమానత్వం కోసం భ్రూణహత్యలు, పౌష్టికాహార లోపాలు, అనారోగ్యం, అవిద్య, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా వంటి సమస్యలపై మరింత చిత్తశుద్ధితో పనిచేయాలి. శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక, రాజకీయ, క్రీడారంగాల్లో కీలకపాత్ర పోషించేలా తీర్చిదిద్దాలి. ఆర్థికస్వేచ్ఛ, ఉపాధి కల్పన కోసం బాలికల నైపుణ్యాలను మెరుగుపరచాలి. మంచి స్పర్శ, చెడుస్పర్శ, అనుచిత ప్రవర్తనపై బాలికలకు అవగాహన కల్పించాలి. పాఠశాల స్థాయిలో నైతిక, మానవతా విలువలను నేర్పించే విద్యను ప్రవేశపెట్టాలి. ఇలా అనేక పథకాలు ప్రవేశపెట్టి బాలికలకు తోడ్పాటును అందించినా.. మంచి మార్పు కావాలంటే మాత్రం తల్లి దండ్రులు, సమాజ సహకారాలు కూడా తప్పక అవసరం.



–కాళంరాజు వేణుగోపాల్
8106204412

పీజీటీ మేథమేటిక్స్ అభ్యర్థులకు సర్టిఫికేట్ల వెరిఫికేషన్

పీజీటీ మేథమేటిక్స్ టీచర్ పోస్టుల కోసం పరీక్షలు రాసి ఎంపికైన వారికి సర్టిఫికేట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్– రిక్రూట్‌మెంట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. జనవరి 24వ తేదీ మధ్యాహ్నం నుంచి జనవరి 28వ తేదీ మధ్యాహ్నం వరకు ఈ సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుంది. సర్టిఫికేట్ల వెరిఫికేషన్ కోసం ఎంపికైన అభ్యర్థుల వివరాలను జనవరి 21న TREIRB వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపింది. అలాగే ఎంపికైన అభ్యర్థుల మొబైల్ నంబర్లకు వెరిఫికేషన్ సమయం మెసేజ్ పంపినట్లు తెలిపింది. అభ్యర్థులు పూర్తి వివరాల కోసం TREIRB వెబ్‌సైట్‌లో చూసుకోవాలని తెలిపింది.

ప్రకటనలు – ఊహనలు (ప్రతిపాదనలు)

1) ప్రకటన :
X కంపెనీ యొక్క స్వచ్ఛమైన మరియు సహజ సిద్ధమైన తేనెనే కొనండి
ప్రతిపాదనలు:
1) కృతిమ తేనెను తయారు చేయవచ్చు
2) ప్రజలు స్వచ్ఛమైన సహజమైన తేనెను కొనుగోలు చేయుటకు ఎక్కువ మూల్యమును చెల్లించడానికి వెనకాడరు
3) వేరే కంపెనీ కూడా స్వచ్ఛమైన తేనెను సరఫరా చేయదు
A) ఒకటి మాత్రమే సరి అయినది
B) ఒకటి మరియు రెండు మాత్రమే సరి అయినవి
C) అన్నీ సరైనవి
D) ఒకటి మరియు మూడు మాత్రమే సరి అయినవి

2) ప్రకటన :
ఈ ప్రదేశంలోని పరిస్థితిని ఇంకను ఉద్రిక్తంగాను, పరిధిని మించి ఉన్నది. ప్రజలందరూ వారి గృహాల లోనే ఉండవలెనని విజ్ఞప్తి చేయుచున్నాము.
ప్రతిపాదనలు :
1) అక్కడ కొన్ని అపాయకరమైన సంఘటనలు జరిగినవి
2) ప్రజలు ఆఫీసులకు వెళ్లరు
3) సామాన్య పరిస్థితులు కొంతకాలం ఒనగుడును
A) ఒకటి మాత్రమే
B) ఒకటి మరియు రెండు మాత్రమే సరైనవి
C) అన్నీ సరి అయినవి
D) ఏదీ సరియైనది కాదు

3) ప్రకటన :
A, Bతో చెప్పెను అజయ్‌కు అతని పుట్టినరోజు సందర్భంగా నేను యోగా నిపుణుల గురించి ఒక పుస్తకమును బహుమతిగా ఇవ్వవలెను అని తలచుచున్నాను
ప్రతిపాదనలు:
1) అతని పుట్టినరోజు సందర్భంగా అజయ్ A నువ్వు ఆహ్వానించును
2) ఎవరికి ఆ పుస్తకమును బహుమతిగా ఇవ్వదలచిన అతను ఆరోగ్యవంతుడు కాదు
3) పుస్తకము పుట్టినరోజు సందర్భముగా బహుమతికి తగినది
A) 1 మరియు 2 మాత్రమే సరి అయినవి
B) 2 మరియు మూడు మాత్రమే సరి అయినవి
C) 1 మరియు మూడు మాత్రమే సరి అయినవి
D) ఏదీ సరైనది కాదు

4) ప్రకటన :
చాలామంది సృజనాత్మకత కల వ్యక్తులు కళాకారులు అవుతారు
ప్రతిపాదనలు:
1) కొంత మంది కళాకారులు సృజనాత్మకత వ్యక్తులు
2) కళాకారుడు కావడానికి ఉన్నతస్థాయి సృజనాత్మకత అవసరము
3) సృజనాత్మకమైన వ్యక్తి తప్పనిసరిగా కళాకారుడు అవుతాడు
A) ఒకటి మరియు రెండు మాత్రమే సరైనవి
B) ఒకటి మాత్రమే నిజమైనది
C) రెండు మాత్రమే నిజమైనది
D) మూడు మాత్రమే నిజమైనది

5) ప్రకటన :
కళాకారులు అందరూ విపరీత బుద్ధి కలిగి ఉంటారు. అధిక స్కేటర్‌లు కళాకారులుగా ఉంటారు
ప్రతిపాదనలు :
1) కొంతమంది స్కేటర్లు విపరీత మనస్తత్వం కలిగి ఉంటారు
2) అధిక మంది కళాకారులు స్కేటర్‌లు
3) స్కేటర్‌లందరూ విపరీత మనస్తత్వం కలిగి ఉంటారు
A) ఒకటి మాత్రమే సరి అయినది
B) రెండు మూడు మాత్రమే నిజమైనవి
C) మూడు మాత్రమే నిజమైనది
D) ఏదీ నిజం కాదు

6) ప్రకటనలు :
భారీ వర్షాలు ఉన్నప్పటికీ ఈ సంవత్సరం ట్రాఫిక్ సమస్య అంతగా కనిపించలేదు
ప్రతిపాదనలు :
1) భారీ వర్షాలలో మాత్రమే ట్రాఫిక్ సమస్య ఉంటుంది
2) వర్షాలు ట్రాఫిక్ కదలికలకు ఏ మాత్రం అవాంతరం కాదు
3) వర్షాకాలం మొత్తం చాలా ముందు జాగ్రత్తలు తీసుకొని నిర్వహించడమైనది
A) ఒకటి మరియు రెండు మాత్రమే సరి అయినది
B) ఒకటి మాత్రమే సరి అయినది
C) రెండు మూడు మాత్రమే నిజమైనవి
D) మూడు మాత్రమే నిజమైనది

7) ప్రకటన :
పరీక్షలో విజయం సాధించాలంటే కష్టపడాలని వినయ్‌కు రాజు చెప్పెను
ప్రతిపాదనలు :
1) రాజు యొక్క సలహా వినయ్ పాటిస్తాడు
2) ఒక పరీక్షలో విజయం సాధించుట కావాలి
3) అభ్యసనము విజయానికి. బాట అవుతుంది
A) ఒకటి మరియు రెండు మాత్రమే సరైనవి
B) రెండు మూడు మాత్రమే సరైనవి
C) ఒకటి మరియు మూడు మాత్రమే సరైనవి
D) అన్నీ సరైనవి

8) ప్రకటన :
దుకాణమునకు వచ్చి అన్ని వెరైటీలు 20 శాతం రిబేట్టుతో కోరండి
ప్రతిపాదనలు :
1) డిస్కౌంట్ ఆకర్షణ వలన చాలామంది దుకాణము సందర్శిస్తారు
2) డిస్కౌంట్ ప్రకటిం చనట్లయితే కస్టమర్లు వేరే దుకాణాలకు వెళ్తారు
3) కస్టమర్లను ఆకర్షించడానికి డిస్కౌంట్ ప్రకటించడం మాత్రమే సరి అయిన పద్ధతి
A) ఒకటి మాత్రమే సరైనది
B) రెండు మాత్రమే సరైనది
C) రెండు మూడు మాత్రమే సరి అయినది
D) ఒకటి మరియు రెండు మాత్రమే సరైనవి

9) ప్రకటనలు :
ఒక స్కూలు నందు బస్సు సర్వీసు స్పోర్ట్స్ కంప్యూటర్ కోచింగ్ సాంస్కృతిక కార్యక్రమాలు మరియు చదువుతో పాటు అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కోచింగ్ ఇవ్వబడును
ప్రతిపాదనలు :
1) ఈ రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు మిగిలిన వాటికంటే కావున అందరూ వారి పిల్లలను ఆ స్కూల్ లోనే జాయిన్ చేస్తారు
2) ఎక్కువ మంది పేరెంట్స్ అన్ని వసతులు కలిగిన పాఠశాలలోనే తమ పిల్లలను జాయింట్ చేస్తారు
3) గృహంలో తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేస్తున్న ఈ రోజుల్లో ఇలాంటి అన్ని వసతులు అవసరం
A) ఒకటి మాత్రమే సరైనది
B) రెండు మాత్రమే సరైనది
C) ఒకటి మరియు రెండు మాత్రమే సరైనవి
D) అన్నీ నిజమైనవి

పోటీ పరీక్షల కోసం..

10) ప్రకటన :
కంప్యూటర్ రంగ మందు అత్యుత్తమ శిక్షణ మా సంస్థ నందు అందించబడుతుంది
1) ప్రజలలో చాలామంది కంప్యూటర్ విద్య పట్ల ఆసక్తి కలిగి ఉన్నారు
2) ప్రజలు అత్యుత్తమ శిక్షణ కోరుకుంటారు
3) కంప్యూటర్ విద్యలో ఉద్యోగాలు సులభంగా పొందవచ్చును
A) ఒకటి మాత్రమే సరి అయినది
B) రెండు మూడు మాత్రమే నిజమైనవి
C) పైవన్నీ నిజమైనవి
D) రెండు మాత్రమే నిజమైనవి

11) ప్రకటన : డాక్టర్ అవ్వడము సులభము అయితే నేను డాక్టర్ అవ్వను
ప్రతిపాదనలు :
1) వ్యక్తిత్వం ఉన్నవారు ప్రొఫెషనల్ గా ఉండాలనుకుంటారు
2) కొంతమంది కష్టసాధ్యమైన పనులనే సాధించాలను కుంటారు
3) డాక్టర్ కావడము చాలా సులభము
A) ఒకటి మాత్రమే సరైనది
B) మూడు మాత్రమే నిజమైనది
C) రెండు మూడు మాత్రమే నిజమైనవి
D) రెండు మాత్రమే నిజమైనది

12) ప్రకటనలు:
ఆ ప్రదేశములో లైబ్రరీ నిర్మించడం మంచిది కాదు
ప్రతిపాదనలు:
1) ఆ ప్రదేశంలో నివసించువారు నిరక్షరాస్యులు
2) ఆ ప్రదేశంలో నివసించే ప్రజలు సమాచారం తెలుసుకోవడానికి ఆసక్తి చూపరు
3) ఆ ప్రదేశంలో అంతకుముందే చాలా లైబ్రరీలున్నాయి
A) ఒకటి మరియు రెండు నిజమైనవి నిజమైనది
B) ఒకటి మాత్రమే నిజమైనవి
C) ఒకటి మరియు మూడు మాత్రమే నిజమైనది
D) రెండు మాత్రమే నిజమైనది
E) ఒకటి లేదా రెండు లేదా మూడు లలో ఏదో ఒకటి నిజమైనది

13) ప్రకటన :
ఒకే రకమైన వస్తువు ధర మార్కెట్లోని పెద్ద షాపులలో అధికంగాను ప్లాట్ ఫారం మీద లేదా చిన్న షాపులలో తక్కువగానూ ఉంటుంది
ప్రతిపాదనలు :
1) షాపుల్లో లభించే వస్తువులు నమ్మదగినవి కాదు
2) పెద్ద షాపుల యజమానులు కస్టమర్లను మోసం చేస్తున్నారు
3) పెద్ద పెద్ద షాపులను నిర్వహించడం చాలా ఖర్చుతో కూడుకున్న పని కావున ఆ షాపులో లభించే దొరికే వస్తువుల ధరలు పెంచి అమ్ముతారు
A) ఒకటి మాత్రమే సరి అయినది
B) మూడు మాత్రమే నిజమైనది
C) రెండు లేదా మూడు ఏదో ఒకటి నిజమైనది
D) ఏది నిజమైన ది కాదు
E) రెండు మాత్రమే నిజమైనది

14) ప్రకటనలు :
ఎక్కువ మంది విద్యార్థులు వీడియో గేమ్స్ ఆడడానికి ఇష్టపడతారు
ప్రతిపాదనలు :
1) స్కూల్స్‌లో వీడియో గేమ్స్ ఆడించరు
2) వీడియో గేమ్స్ వలన వ్యక్తిత్వం పెరుగుతుంది
3) గేమ్స్ ఆడటం పిల్లలకు సరదా
A) మూడు మాత్రమే నిజమైనది
B) ఒకటి మరియు మూడు మాత్రమే నిజమైనది
C) ఒకటి మరియు రెండు మాత్రమే నిజమైనవి
D) రెండు మాత్రమే సరైనది అన్నీ సరైనవి

15) ప్రకటన :
దయచేసి క్రిందకు దిగేటప్పుడు లిఫ్ట ఉపయోగించకండి– అపార్టుమెంటులోని లిఫ్టు వద్ద అతికించబడిన నోటీసు ఇది
ప్రతిపాదనలు:
1) కరెంటు బిల్లు అధికంగా రావచ్చును
2) క్రిందకు దిగేటప్పుడు లిఫ్టులు బరువులను మోయలేవు
3) లిఫ్ట్ కల్పించడము ఒక సౌకర్యం కానీ హక్కు కాదు
A) మూడు మాత్రమే సరైనది
B) ఏదీ కాదు
C) రెండు మరియు మూడు మాత్రమే నిజమైనవి
D) అన్ని సరి అయినవి
E) ఒకటి మాత్రమే నిజమైనది

16) ప్రకటన :
కదులుతున్న బస్సు యొక్క ఫుట్పాత్ వద్ద ప్రయాణికులు ఎవరు నిలబడరాదు ఇది ఒక నోటీస్
ప్రతిపాదనలు :
1) క్రింద పడిపోయే ప్రమాదం ఉన్నది
2) బస్సు ఎక్కి ప్రయాణికులకు అసౌకర్యం
3) ఫుట్‌పాత్ మీద నిలబడిన వారు ఇంకో టికెట్ తీసుకోనవసరం లేదు
A) మూడు మాత్రమే సరి అయినది
B) రెండు మరియు మూడు మాత్రమే సరైనది
C) ఒకటి మరియు రెండు మాత్రమే సరి అయినవి
D) అన్ని సరి అయినవి
E) ఏదీ సరైనది కాదు

17) ప్రకటనలు :
కార్యక్రమము సరిగా జరగకపోతే నీకు డబ్బు ఇవ్వను. ఈ మాట నిర్వాహకుడి తో యజమాని అన్న మాట
ప్రతిపాదనలు :
1) కార్యక్రమం సజావుగా జరగాలని కోరుకుంటున్నాను
2) డబ్బు ఎ గర కొట్టే ఆలోచనతో ఉన్నారు
3) నిర్వాహకుడు మరియు యజమాని శత్రువులు
A) ఒకటి మరియు రెండు నిజమైనవి
B) మూడు నిజమైనది
C) ఒకటి మాత్రమే నిజమైనది
D) అన్ని నిజమైనవి
E) ఏదీ నిజమైనది కాదు

18) ప్రకటన :
భారత క్రికెట్ టీం ఆట తీరు ప్రస్తుతము అసలు బాగాలేదు
ప్రతిపాదనలు:
1) ఇండియా క్రికెట్ టీం రద్దు చేయబడుతుంది
2) ఇక నుండి భారత్ ప్రతి ఆట ఓడిపోతుంది
3) ఆటగాళ్ల వ్యక్తిగత విషయాలే ప్రస్తుతఇ ఇండియా టీం దుర్భర స్థితికి కారణము
A) మూడు మాత్రమే సరైనది
B) రెండు మరియు మూడు మాత్రమే
C) అన్నీ సరైనవి
D) ఏదీ సరైనది కాదు
E) ఒకటి మరియు మూడు మాత్రమే సరి అయినవి

19) ప్రకటన :
ఈ వ్రేలాడే వంతెనను దాటితే మనందరం క్షేమంగా ఉన్నట్లు యాత్రికులతో ఒక గైడు మాట్లాడిన మాట
ప్రతిపాదనలు :
1) వంతెన దాటి అవతలకు వెళ్ళడము అసాధ్యము
2) అందరూ వంతెనను దాటి సురక్షితంగా వెళ్లగలరు
3) ఆ వంతెన చాలా ప్రమాదకరం
A) రెండు మాత్రమే సరైనది
B) మూడు మాత్రమే నిజమైనది
C) ఒకటి మరియు మూడు మాత్రమే నిజమైనది
D) రెండు మరియు మూడు మాత్రమే నిజమైనది
E) ఏదీ నిజమైనది కాదు

20) ప్రకటన :
మహేష్ నన్ను ఎదిరించాడు కావున పవన్ అయిన నేను మహేష్ ను గాయపరిచారు న్యాయస్థానములో జడ్జితో పవన్ అన్నమాట
ప్రతిపాదనలు :
1) మహేష్ పవన్‌ను హత్య చేయడానికి పథకం వేశాడు
2) పవన్ నిజాయితీగా జడ్జితో జరిగినదంతా చెప్పాడు
3) పవన్ మరియు మహేష్ మంచి స్నేహితులు
A) అన్నీ సరైనవే
B) ఏదీ సరైనది కాదు
C) మూడు మాత్రమే సరి అయినది
D) ఒకటి మాత్రమే సరి అయినది
E) రెండు, మూడు మాత్రమే నిజమైనది

Ans : 1) A 2) B 3) C 4) B 5) D 6) D 7) B 8) A 9) D 10) C 11) D 12) E 13) B 14) A 15) B 16) C 17) C 18) D 19) B 20) B



– ముత్తినేని వీరయ్య
ఎంఫిల్, మ్యాథ్స్, బీఈడీ
గణిత విశ్లేషకులు,
అర్థమేటిక్& రీజనింగ్ షార్ట్ కట్స్ రచయిత,
సీనియర్ కాలమిస్ట్,
డైరెక్టర్, రామానుజన్ స్టడీ సర్కిల్

Miscarriage (Abortion)

Definition

• It is expulsion or extraction of products of conception before fetal viability i.e. before 24 weeks of gestation.

Incidence

• About 15% of clinically recognized pregnancies end in abortion (this rise to 30% if unrecognized pregnancies are included).

• Most abortions occur between 8 and 12 weeks of pregnancy.

Etiology

A. First trimester abortion:

1. Fetal chromosomal abnormalities particularly trisomy, triploidy& monosomy

• is the commonest cause of abortion

• 50– 70 % of the first trimester abortions are due to chromosomal abnormalities

• the incidence of these abnormalities increased with the increase in the maternal age

2. Anembryonic pregnancy– Blighted ovum: there is no fetal pole formed.

3. Multiple pregnancy

4. Parental balanced translocation

5. Infections: genital tract infection, systemic infection with pyrexia &ToRCH syndrome

6. Endocrine disorders:Diabetes, thyroid disorders, PCOS & corpusluteum insufficiency

7. Uterine disorders: Uterine anomalies, submucus fibroid &Asherman's syndrome

8. Thrombophilia: Congenital deficiency of protein C & S, & antithrombin III

9. Immunological disorders:Anticardiolipin syndrome and SLE

10. Cigarette smoking, anaesthetic agents & chemical agents.

11. Psychological disorders

B. Second trimester abortion – Causes:

1. Multiple pregnancy
2. Cervical incompetence (congenital &acquired)
3. Uterine anomalies and submucous fibroid
4. Genital tract infection and Premature Rupture OfMembranes

Types

1. Threatened abortion
2. Inevitable abortion
3. Incomplete abortion
4. Complete abortion
5. Missed abortion
6. Septic abortion
7. Recurrent abortion

1. Threatened abortion

1. **History** – Mild vaginal bleeding.
– No abdominal pain or mild abdominal pain
2. **Examination**– Good general condition.
– The cervix is closed
– The uterus is usually the correct size for date
3. **U/S which is essential for the diagnosis Shows the presence of fetal heart activity**

Management

1. Reassurance If fetal heart activity is present, > 90% of cases will be progressed satisfactorily
2. **Advice:** Decrease physical activity (bed rest is of no therapeutic value) avoid intercourse
3. **Hormones** i.e. Progesterone &hCG Which are used in the first trimester to support pregnancy.
4. **Anti D:** An adequate dose of antiD should be given to all Rh –ve,nonimmunized patients, whose husbands are Rh +ve
5. **Ante Natal Care as high risk patients**
Because those patients are liable to late pregnancy complications such as Ante Partum Hemorrhage and preterm labour.

2. Inevitable and incomplete abortions

1. History
– Heavy vaginal bleeding.
• with no passage of products conception (inevitable)
• with the passage of products of conception (incomplete abortion)
– Severe lower abdominal pain which follows the bleeding.

2. Examinations
– Poor general condition.
– The cervix is dilating and products of conception may be passing trough the os
– The uterus may be the correct size for date (inevitable abortion) or small for date (incomplete abortion)

3. U/S– Fetal heart activity may or may not present in inevitable abortion or retained products of conception (RPOC) in incomplete abortion Management

4. CBC, blood grouping, Cross matching and reserve 2 units of blood
5. Resuscitation– large IV line, fluids & blood transfusion
6. Oxytoxic drugs– Ergometrine 0.5 mg IM + Oxytocin infusion (2040 units in 500 cc saline)
7. Evacuation & curettage.
8. Postabortion management.

3. Complete abortion

1. History
– Heavy vaginal bleeding – which has been stopped.
– lower abdominal pain which follows the bleeding –which has been stopped.
2. Examination – The cervix is closed
3. U/S – showed empty uterine cavity or Retained Products Of Conception
4. Evacuation & curettage in the presence of RPOC.
5. Postabortion management.

4. Missed abortion

1. Most of missed abortions are diagnosed accidentally during routine U/S in early pregnancy.
In some cases there may be a history of :
– Episodes of mild vaginal bleeding
– Regression of early symptoms of pregnancy.

సర్సింగ్ పోటీ పరీక్షల కోసం

SUBJECT : MIDWIFERY

About 15% of clinically recognized pregnancies end in abortion (this rise to 30% if unrecognized pregnancies are included). Most abortions occur between 8 and 12 weeks of pregnancy.



– Stop of fetal movements after 20 weeks gestation.
2. Examination
– The uterus may be small for date
3. U/S (which is essential for diagnosis) diagnosed if two ultrasound (T/V or T/A) at least 7days apart showed an embryo of > 7 weeks gestation (CRL > 6mm in diameter and gestational sac > 20 mm in diameter) with no evidence of heart activity.

Management
4. CBC, blood grouping, Cross match 2 units of blood
5. Platelets count, – to exclude the risk of DIC
NB : DIC does not occur before 5 weeks of missed abortion or IUFD and if occurred will be of mild grade
3. Options of treatment
– Conservative treatment: – if left alone spontaneous expulsion will occur
– Surgical evacuation of the uterus; by D & C: Indicated in 1st trimester missed abortion
– Medical termination of pregnancy: by Misoprostol (PGE1)
Cytotec: Indicated in 1st& 2nd trimesters missed abortions.
– Cytotec vaginal (is the best) or oral tab. 200 ug, 2 tab/ 3 hrs/ up to 5 doses daily, which can be repeated next day if there is no response in the first day
– Subsequent surgical evacuation is needed in cases of RPOC
– The main side effects of cytotec are nausea, vomiting and fever.
3. Postabortion management.
– **Anembryonic pregnancy**
(Blighted ovum)It is due to an early death and resorption of the embryo with the persistence of the placental tissue
– It is diagnosed if two ultrasound (T/V or T/A) at least 7 days apart showed after 7 weeks of gestation i.e. gestational sac > 20mm, an empty gestational sac with no fetal echoes seen.
– It is treated in a similar way to missed abortion .

5. Septic abortion

Definition:
–It is an incomplete abortion which complicated by infection of the uterine contents .
– This may be due to criminal interference
Features : Poor general condition
– Include the features of incomplete abortion ie severe vaginal bleeding with passage of product of conception, with or without history of evacuation.
Features of pelvic infection i.epyrexia , tachycardia , general malaise , lower abdominal pain , pelvic tenderness & purulent vaginal discharge
Bacteriology : Mixed infection
– The commonest organisms are :
1. Gram–ve : E.coli, strepto&staphylococcu
2. Anaerobics :Bacteroides
– Rarely Cl.tetani , which is potentially lethal if not treated adequately .
Types :
– Mild – the infection is confined to decidua : 80%
– Moderate – the infection extended to myometrium15%
– Severe – the infection extended to pelvis + Endotoxic shock + DIC 5%

Management :
1. Investigations :
– CBC, blood grouping , Cross Match 2 units of blood.
– Cervical swabs (not vaginal) for culture and sensivity
– Coagulation profile, serum electrolytes & blood culture if pyrexia > 38.5
2. Antibiotics: Cephalosporin I.V + Metronidazole I.V
3. Surgical evacuation of uterus – usually 12 hrs after antibiotic therapy (until a reasonable tissue levels of antibiotics have been achieved)
4. Postabortion management.

Complications of abortion

1. Haemorrhage.
2. Complication related to surgical evacuation ie E&C and D&C.
– Uterine perforation which may lead to rupture uterusin the subsequent pregnancy.
– Cervical tear &excessive cervical dilatation – which may lead to cervical incompetence.
– Infection – which may lead to infertility &Asherman's syndrome.
– Excessive curettage – which may lead to Adenomyosis
3. Rh– isoimmunisation– if the anti –D is not given or if the dose is inadequate.
4. Psychological trauma.

Post abortion management

In cases of incomplete, inevitable, com plete, missed & septic abortions
1. Support: from the husband, family& obstetric staff
2. Anti D–to all Rh –ve, nonimmunised patients, whose husbands are Rh+ve
3. Counseling & explanation:
A. Contraception (Hormonal, IUCD, Barrier) Should start immediately after abortion if the patient choose to wait, because ovulation can occur 14 days after abortion and so pregnancy can occur before the expected next period.

(ఇంకా వుంది)



– Mrs. Madhulika uday
మేనేజర్, నర్సింగ్ ఎడ్యుకేషన్,
అపోలో మెడ్‌స్కిల్స్ లిమిటెడ్,
హైదరాబాద్

ట్రెండ్

ఏ స్కర్ట్‌కు ఎలాంటి టాప్ మ్యాచ్ అవుతుందంటే..

ఇప్పుడు స్కర్ట్స్ హవా నడుస్తోంది. లాంగ్, నీ లెంగ్త్, షార్ట్... ఇలా చెప్పలేనన్ని రకాలొచ్చేశాయి. అయితే ఆ దుస్తుల్లో మరింత అందంగా కనిపించాలంటే నప్పే టాప్‌తో జత చేయాలి! ఏ స్కర్ట్ ఎలాంటి టాప్ మ్యాచ్ అవుతుందంటే...

పొడవాటి స్కర్ట్స్కు వీలైనంత చిన్న టాప్ ఎంచుకోవాలి. ఒకే రంగు స్కర్ట్స్కు గ్రాఫిక్ టీ షర్ట్ చక్కగా మ్యాచ్ అవుతుంది. షిఫాన్ స్కర్ట్ వేసుకుంటే వినెక్, క్రాప్ టాప్స్ బాగుంటాయి.

ముదురు రంగు ప్రింట్లు, గ్రాఫిక్ డిజైన్లు ఉండే మోకాలి కిందవరకూ ఉండే స్కర్ట్లు ఎంచుకుంటే వాటికి తెల్లని టాప్ చక్కగా సూటవుతుంది. అయితే టాప్ స్లీవ్స్ పొడవుగా, ఉండి, మెడ దగ్గర స్లిట్ ఉండేలా చూసుకోవాలి. స్టైల్‌గా కనిపించాలనుకుంటే స్లీవ్స్ చివర్లో ఫ్రిల్స్ ఉండాలి.



గుట్ట పూసల హారాలు

తక్కువ బంగారంతో భారీ లుక్













నగలలో కొత్త ట్రెండ్స్ పుట్టుకొస్తుంటే.. పాతవి అంతరిస్తూ ఉంటాయి అనుకుంటే పొరపాటు. సంప్రదాయ ఆభరణాల విషయంలో పాత నగల హవా నడుస్తూనే ఉంటుంది. వాటికి కొత్తవి తోడవుతూ ఉంటాయి. అయితే కాలక్రమేణా కొన్ని ఆభరణాల వాడకమే అంతరించిపోతోంది. కాబట్టి తాజా ట్రెండ్ ఏంటో కనిపెట్టి దానికి తగ్గట్టు అలంకరించుకోవాలి.

సాధారణంగా నగల్లో ముత్యాల వాడకం కొంత తక్కువే! అయితే గుట్ట పూసల హారంలో ముత్యాల పాత్రే కీలకం. పగడాలు, గోమేధికాలు, వజ్రాలు... ఎన్ని జాతిరాళ్లు వాడి నగ తయారుచేసినా, గుట్ట పూసల లుక్ తెప్పించడం కోసం ముత్యాలు వాడాల్సిందే! ప్రతి నగకూ లెక్కలేనన్ని చిన్నపాటి ముత్యాలు వేలాడుతూ కనిపించాల్సిందే! నగ అంచుల వెంబడి కొక్కేనికి ముచ్చటగా మూడు ముత్యాల చొప్పున సన్నని బంగారు తీగతో ముడి పెట్టడం ఈ నగ ప్రత్యేకత. నగ భారీతనాన్నిబట్టి ఒక కొక్కేనికి ఐదు... ఆరేసి ముత్యాలు వేలాడేలా కూడా తయారు చేయించుకోవచ్చు. లేదంటే పూర్తి ముత్యాలనే వాడి తాడులా కూడా తయారు చేయించుకోవచ్చు. వీటికి నప్పే జూకాలు కూడా అంతే నిండుగా ఉండేలా ఎంచుకోవాలి. నాణ్యమైన ముత్యాలయితే ఎక్కువ కాలం రంగు మారకుండా ఉంటాయి. కాబట్టి రెడీమేడ్ నగలు కొనేటప్పుడు పేరున్న బంగారం షాపులో, గ్యారెంటీ సర్టిఫికెట్ గురించి నిర్ధారించుకుని ఈ నగలు కొనాలి. తక్కువ బంగారంతో భారీగా కనిపించాలనుకుంటే ఈ గుట్ట పూసల నెక్లెస్ సెట్ మించిన ప్రత్యామ్నాయం లేదు

ద్రాక్ష గుత్తుల్లా ఒత్తుగా అమర్చిన బంగారు మువ్వలు చూడటానికి అందంగా కనిపించడంతో పాటు భారీగానూ కనిపిస్తాయి. బంగారంతో భారీ లుక్ తెప్పించాలనుకుంటే మువ్వల హారం చేయించుకోవాలి, లేదా మువ్వల నెక్లెస్ ధరించాలి. మువ్వలు బంగారంతో తయారైనవైనా, నెక్‌లెసలో ధరించే దుస్తులకు నప్పే జాతి రాళ్లు పొదిగితే నెక్లెస్ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

ముత్యాలను బంగారంలో పొదగొచ్చు. బంగారం తీగతో గుచ్చి నచ్చిన ఆకారంలో అల్లుకోనూవచ్చు. కొంత సృజనాత్మకత జోడిస్తే ముత్యాలతో ఎన్నో రకాల ఆభరణాలు తయారు చేయించుకోవచ్చు. ముత్యాల క్లస్టర్ జ్యువెలరీ కావాలనుకుంటే ముందు ఆ నగలను ధరించే సందర్భాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఆధునిక దుస్తులతో జ్యువెలరీ మ్యాచ్ అవ్వాలంటే ఆవగింజంత ముత్యాలను ఎంచుకుని, వాటితో హారాలు తయారు చేయించి, తాడులా మెలిక తిప్పి అల్లించాలి. వీటికి సూటయ్యే క్లస్టర్ స్టడ్స్ లేదా హ్యాంగింగ్స్ ధరించాలి. సంప్రదాయంగా కనిపించాలనుకుంటే ముత్యాల హారాల వరుసలు ఒత్తుగా అల్లించుకుని, వాటికి భారీ చెవి కమ్మలు పెట్టుకోవాలి.

–విజయారెడ్డి













నెయిల్ రింగ్స్





నెయిల్స్‌కు నెయిల్ పాలిష్, నెయిల్ ఆర్ట్, ఇలా రంగురంగుల నెయిల్ పాలిష్ అద్దగానే సరికాదు.. ప్రస్తుతం వాటికి సరిపడా ఆభరణాలు కూడా లభిస్తున్నాయంటున్నారు ఫ్యాషన్ డిజైనర్లు, స్టైలిస్టులు. నెయిల్ ఆర్ట్స్ చాలా ట్రెండ్స్ వచ్చాయి. గోళ్లకు వేలాడే ఆభరణాలు (నెయిల్ పీర్సింగ్స్), టిప్ ఫింగర్ బాండ్ నెయిల్ ఆర్ట్ రింగ్స్ లాంటివి చాలా ఉన్నాయి. కేవలం వేళ్లకు మాత్రమే రకరకాల రాళ్లున్న రింగులు పెట్టుకోవడం పాత ఫ్యాషన్. గోళ్లకు కూడా ఆభరణాలు ధరించి ఎంచక్కా మెరిసిపోండి.









కొప్పుకు నాజూకైన అలంకరణలు

సింపుల్ అనిపిస్తూనే చూపరులను ఇట్టే ఆకట్టుకునేలా కొప్పుకు నాజూకైన అలంకరణలు ఎన్నో వచ్చాయి. వాటిలో మీరు మెచ్చే కొప్పుల ఆభరణాలు ఇవి. కొప్పున మల్లె మొగ్గలను సింగారించడానికి ఇప్పుడు చాలా భిన్నమైన, సులువైన పద్ధతులున్నాయి. హెయిర్ పిన్‌కు మల్లెలు చుట్టి వాటిని కొప్పులో క్రాస్‌గా గుచ్చితే చాలు. తల మీదుగానే కాదు కొప్పును కింద నుంచి అలంకరించే ఆధునికపు కేశాలంకరణ క్లిప్స్ వచ్చాయి. ఇవి వెస్ట్రన్ స్టైల్ కేశాలంకరణకు మరింత వన్నె తెస్తాయి. హెయిర్ పిన్... కొప్పులో సింగారించడానికి దువ్వెన పళ్ల మాదిరి ఉండే క్లిప్స్ మార్కెట్లో లభిస్తున్నాయి. వీటిని కొప్పుకు ఓ వైపుగా లోపలికి గుచ్చితే చాలు. బయటకు కనిపించే పిన్ డిజైన్ ఇట్టే ఆకట్టుకుంటుంది. ఇది ఒక పువ్వులా ఉండి కొప్పు మధ్యన చందమామలా మెరిసిపోతుంటుంది.









ఆహా!



బామ్మ చిట్కాలు

- సేమ్యా ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే వేయించి గాజు సీసాలో ఉంచాలి.
- గోధుమలు ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే ఎండిన నిమ్మకాయలకు కొద్దిగా ఉప్పు జేర్చి పది ఎండు మిరపకాయలను కలిపి గోధుమల్లో పడేసి ఉంచాలి.
- టమాటాతో వంట చేసుకున్నప్పుడు ఒక చెమ్చాడు పంచదార కలిపితే రంగు, రుచి బాగుండటమేగాక టమాటా వాసన ఉండదు.
- వంకాయకూర చేసేటప్పుడు దానిలో కొద్దిగా పసుపు వేసి పాలు పోయాలి. అలా చేస్తే కూర నల్లగా తయారవదు. కనరెక్కదు. కొద్ది నిమ్మరసం కలిపితే రుచి బాగుంటుంది.
- క్యారట్‌కు ఇరువైపులా తోకలు కోసి పాలిథిన్ కమర్‌లో ఉంచితే వడలకుండా తాజాగా ఉంటుంది. లేకపోతే రెండు రోజుల్లో వడలిపోతుంది.
- ఏ కూరనైనా కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి ఆ తరువాత దానిని నీటిలో వేసి తరిగితే సులువుగా తరగబడి తాజాగా ఉంటాయి. ఆ నీళ్లలో ఉప్పు వేస్తే కూరల తాజాదనం పెరుగుతుంది.

బాదంతో ప్రయోజనాలు ఎన్నో..

నేటి ఒత్తిడుల జీవనానికి ఆహారపుటలవాట్లు ఎంతో ఇంపార్టెంట్. మంచి ఆహారంతో ఒత్తిడిని అధిగమించవచ్చు. ఒత్తిడి వల్ల నిరంతరం పోగుపడుతున్న రుగ్మతల నుంచి బయటపడొచ్చు. అందుకు బాదం ఉత్పత్తులతో చేసిన పదార్థాల సేవనం వల్ల ఎంతో మేలు జరుగుతుందని ప్రముఖ ఆహార నిపుణులు చెబుతున్నారు. ఒక్క బాదంతోనే 20–30 రకాల వంటల్ని ఇంట్లోనే తయారు చేసుకునేందుకు వీలుందని చెబుతున్నారు. ఊబకాయం నుంచి థైరాయిడ్ సమస్యలు, హృదయ, కాలేయ సంబంధ వ్యాధుల నుంచి బయటపడే సుగుణాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ఇంకా ఎన్నో ప్రయోజనాలపై నిపుణులు చెబుతున్న సంగతులివి..

బాదాం హల్వా



దేశవ్యాప్తంగా బాదం హల్వా ప్రత్యేకతే వేరు. పండుగలలో, వేడుకలలో, పెళ్లిళ్లలో, పేరంటాలలో ఇలా వివిధ సంతోషకర సందర్భాలలో బాదం హల్వాని తయారుచేసుకుంటారు. బాదం, చక్కెర మరియు నేతిని ప్రధాన పదార్థాలుగా తీసుకుని తయారుచేసే ఈ బాదం హల్వా రుచి అమోఘంగా ఉంటుంది. నోట్లో వేసుకోగానే కరిగిపోయే ఈ బాదం హల్వాను పిల్లల నుంచి పెద్దల వరకు అమితంగా ఇష్టపడతారు. బాదంలతో తయారయ్యే ఈ బాదం హల్వాలో పోషకవిలువలు అమితంగా లభిస్తాయి. ఒకే సారి రెండు స్పూన్ల కంటే ఎక్కువ హల్వాని తినలేరు. ఈ రుచిగల తీపి పదార్థాన్ని సులభంగానే ఇంటివద్దే తయారుచేసుకోవచ్చు. అయితే, ఈ స్వీట్‌ని తయారుచేసే క్రమంలో మిశ్రమాన్ని బాగా కలుపుతూ ఉండాలి. అలా కలుపుతూ మిశ్రమమనేది సరైన కన్సిస్టెన్సీకి వచ్చేలా చూసుకోవాలి. ఈ స్టెప్‌ని సరిగ్గా పాటిస్తే అద్భుతమైన హల్వా తయారవుతుంది.

కావలసిన పదార్థములు

బాదం 1 కప్పు, చక్కెర టీ కప్పు, నీళ్లు 5 కప్పులు, నెయ్యి కప్పు, కుంకుమపువ్వు పోగులు 78.

తయారుచేయు విధానము

1. వేడిచేసిన ప్యాన్‌లో నాలుగు కప్పుల నీటిని జోడించండి. 2. దాదాపు 2 నిమిషాల వరకు నీటిని మరగనివ్వండి. 3. ఇప్పుడు బాదాం పప్పులను జోడించి ఒక లిడ్‌తో ప్యాన్‌ను కవర్ చేయండి. 4. హై ఫ్లేమ్‌లో దాదాపు 8 నుంచి పది నిమిషాల వరకు ఇలా కుక్ చేయండి. 5. బాదం సరిగ్గా ఉడికిందో లేదో చెక్ చేయండి. ఇందుకు, ఒక బాదంను తీసుకుని బాదం చెక్కు సులభంగా వచ్చిందో లేదో చూడండి. ఒకవేళ బాదం చెక్కు సులభంగా వస్తే బాదాం సరిగ్గా ఉడికినట్టేనని అర్థం. 6. స్టవ్ పైనుంచి ప్యాన్‌ను తీసుకుని అందులోనున్న ప్యాన్‌లో నున్నవాటిని ఒక బౌల్‌లోకి బదిలీ చేయండి. ఆ తరువాత, అయిదు నిమిషాల వరకు ఆ బౌల్‌లోని పదార్థాలని చల్లబడనివ్వండి. 7. ఇప్పుడు, ఇంకొక బౌల్‌లో ఒక కప్పుడు నీటిని తీసుకోండి. 8. బాదంని ప్రెస్ చేసి బాదం చెక్కులను తొలగించండి. ఇలా చేయడం ద్వారా బాదం చెక్కులను త్వరగా తొలగించవచ్చు. 9. బాదం చెక్కులను తొలగించిన తరువాత బాదం పప్పులను వేరొక బౌల్ లోకి బదిలీ చేయండి. 10. ఇప్పుడు, బాదంలను ఒక మిక్సర్ జార్‌లోకి తీసుకోండి. 11. ఒక పావు కప్పుడు నీటిని జోడించి, బాదం పప్పులను చక్కటి పేస్ట్ లా నూరుకోండి. ఇప్పుడు, ఈ పేస్ట్‌ని ఒక పక్కన పెట్టుకోండి. 12. వేడిచేసిన ప్యాన్ లో ఒక పావు కప్పుడు నీటిని తీసుకోండి. 13. ఇప్పుడు, చక్కెరని జోడించి బాగా కలపండి. చక్కెర కరిగిపోయే వరకు బాగా కలపండి. 14. ఇందులో, కుంకుమ పువ్వు పోగులను జోడించండి. 15. ఒక నిమిషం పాటు ఈ మిశ్రమాన్ని మరగనివ్వండి. ఆ తరువాత, లో ఫ్లేమ్‌కి మార్చండి. 16. మరొక వేడిచేసిన ప్యాన్ లో నేతిని పోయండి. 17. నేయి కరగగానే, బాదం పేస్ట్‌ను జోడించండి. 18. దాదాపు 8 నుంచి పదినిమిషాల పాటు ఈ మిశ్రమాన్ని బాగా కలుపుతూ ఉండండి. ఈ మిశ్రమం అనేది గ్రాన్యులర్ కన్సిస్టెన్సీకి వచ్చేవరకు ఇలా కలుపుతూనే ఉండాలి 19. ఇప్పుడు, చక్కెర పాకాన్ని వేసి దాదాపు రెండు నిమిషాల వరకు బాగా కలుపుతూ ఉండాలి. నేయి అనేది సెపరేట్ అయ్యే వరకు బాగా కలుపుతూ ఉండాలి. 20. ఇప్పుడు, స్టవ్ మీద నుంచి ప్యాన్ ను తీసుకుని అందులోని హల్వాను ఒక బౌల్ లోకి మార్చండి. 21. రూమ్ టెంపరేచర్‌లో గాని లేదా చల్లగా గానీ బాదం హల్వాని వడ్డించుకోవచ్చు.

సూచనలు

- బాదం బాగా ఉడికిన తరువాత ఆ నీటిని వడగట్టి అప్పుడు బాదం చెక్కును తొలగించవచ్చు.
- బాదం పప్పులను ముందురోజు రాత్రి బాగా నానబెడితే బాదం చెక్కులు సులభంగా తొలగిపోతాయి.
- బాదం చెక్కులను తొలగించిన తరువాత బాదం పప్పులను నీటితో నిండిన బౌల్‌లోకి మార్చితే బాదం రంగు మారకుండా ఉంటుంది.



బాదం వంటకాల్లో విజేతలు వీళ్లే

బాదంతో ఈ ఏడాదంతా ఆరోగ్యంగా జీవించడానికి ప్రణాళిక అవసరమని ప్రముఖ ఆహార నిపుణురాలు షీలా కృష్ణస్వామి తెలిపారు. ఆరోగ్యంగా ఉండాలి, ఆరోగ్యకరమైనవి తినాలి అని 2019లో తీర్మానాలు చేసుకోవాలని సూచించారు. కాలిఫోర్నియా ఆల్మండ్స్ బాదాం రుచులకు సంబంధించి జరిగిన గృహిణుల వంటకాల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల్ని విజేతలకు ఈ సందర్భంగా అందించారు. కొంతం నందిని, ఆశ ఇరువురు పలు విభాగాల్లో ప్రథమ బహుమతులు గెలుచుకోగా, దండు విజయలక్ష్మి ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. బాదం లడ్డు, బాదం హల్వా, బాదం స్నాక్ వంటి ఐటెమ్స్‌ను హైదరాబాద్ ర్యాడిసన్ హోటల్లో జరిగిన కాంపిటీషన్స్‌లో చెఫ్‌లు వండారు. చెఫ్ సుదర్శన్ సింగ్, ఆహార నిపుణురాలు షీలా కృష్ణస్వామి ఈ పోటీని పర్యవేక్షించారు.

ప్రముఖ చెఫ్ సుదర్శన్ సింగ్ మాట్లాడుతూ..

"ఆరోగ్యంగా ఉండాలంటే.. మనం తీసుకునే స్నాక్స్ గురించి కూడా ఆలోచన చేయాలని తెలిపారు. సహజంగా ఎవరైనా రోజూ తీసుకునే ఆహారంపైనే దృష్టి పెడతారు కానీ, ఆహారానికి ఆహారానికి మధ్య తీసుకోవాల్సిన దానిపై పెద్దగా పట్టించుకోరని పేర్కొన్నారు. ఆహారానికి ఆహారానికి మధ్య బాదం పప్పు తింటే ఆకలి తీరడంతోపాటు ఆరోగ్యానికి బాటలు వేసినట్లేనని తెలిపారు. చిరుతిళ్లకు బదులు బాదం తింటే పరిపూర్ణ ఆరోగ్యం మీ సొంతమవుతోందని వివరించారు. బాదం తినడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతోందని తెలిపారు. విటమిన్ ఈ, కాల్షియం, కొవ్వులు, పీచు పదార్థాలు బాదంలో ఉండటం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. దీంతో రోజంగా ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రయాణంలో సిద్ధపడినప్పుడు ఆహారం విషయంలో రాజీ పడటం అంత మంచిది కాదన్నారు. ఇంటి వద్ద ఉన్నా, ఏ పనిలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా బాదంను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యం మీ వెంటే ఉంటుంది" అని తెలిపారు.

ఆహార నిపుణురాలు షీలా మాట్లాడుతూ..

గుప్పెడు బాదం గింజలు అనగా 30 గ్రాములు లేదా 23 బాదం రోజంగా తినడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని పేర్కొన్నారు. ఒక చిన్న బాక్సులో బాదం గింజలను ఉంచుకొని వాటిని వివిధ రకాలైన పళ్లతో గానీ, ఇతర స్నాక్స్‌తోగానీ కలిపి తినడం అలవాటు చేసుకోవాలన్నారు. జనవరి నెలలో ఎక్కువగా పండగలు, పెళ్లిళ్లు ఉంటాయని.. వీటిలో ఎక్కువ క్యాలరీల ఆహారం తినడం తగ్గించాలన్నారు.







జనాలను బాధిస్తోన్న లింఫోమా వ్యాధి


లింఫోమా ఇటీవల పలువురిని బాధిస్తున్న రోగం. లింఫోమా వస్తే దాన్ని గుర్తు పట్టడం ఎలా, చికిత్స ఏ విధంగా ఉంటుంది, చికిత్స తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరముంది. లింఫోమా ఉన్నదా, లేదా అని ఏ పరీక్షల ద్వారా నిర్ధారిస్తారనే విషయాలతో పాటు చికిత్సా పద్ధతులు, చేసుకోవాల్సిన ఆహారపు అలవాట్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



ప్లేహం పెరగడం, పొట్టలో నొప్పి, గజ్జల్లో వాపు, జ్వరం, చలి, రాత్రి పూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం లక్షణాలు లింఫోమా లక్షణాలు. లింఫోమా అనేది లింఫోసైట్‌లను (తెల్ల రక్త కణాలు) ఉత్పత్తి చేసే, నిల్వచేసే, తీసుకెళ్లే కణజాలాలు అయిన సిస్టమ్‌లో కలిగే క్యాన్సర్‌లు. లింఫోమా ప్రాథమికంగా రెండు రకాలుగా ఉంటుంది. హడ్జ్‌కిన్స్ లింఫోమా, నాన్ – హడ్జ్ కిన్స్ లింఫోమా.

లింఫోమా చిహ్నాలు, లక్షణాలు

- నొప్పి లేకుండా మెడలో, చంకలో లేదా గజ్జల్లో వాపు
- ప్లేహం పెరగడం, పొట్టనొప్పి, అసౌకర్యం కలిగించవచ్చు.
- చలి జ్వరం లేదా రాత్రిళ్లు చెమటలు పట్టడం
- శక్తి లేకపోవడం
- వివరించలేని విధంగా బరువు తగ్గడం



- దురద (25 శాతం నుండి రోగులకు దురద ఉంటుంది.)

మామూలు రోగ నిర్ధారణ పరీక్షలు

- రక్త పరీక్షలు, బయాప్సీ
- ఎముక మూలగ పరీక్ష
- సెరెబ్రో స్పైనల్ ఫ్ల్యూయిడ్ పరీక్ష
- మాలిక్యులర్ రోగ నిర్ధారణ పరీక్షలు

ఇమేజింగ్ పరీక్షలు

1.ఎక్స్‌రే
2.కంప్యూటరైజ్‌డ్ టోమోగ్రఫీ (సీటీ) స్కాన్.
3.మ్యాగ్నెటిక్ రెసోనన్స్ ఇమేజింగ్ (ఎంఆర్ఐ)
4.పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ (పిఇటి) స్కాన్

లింఫోమా దశ

- క్షుణ్ణంగా వైద్య పరిశీలన, పరిశోధనలు చేసిన తరువాత మీ శరీరంలో లింఫోమా వ్యాప్తి ఏ మేరకు ఉందో ఫిజిషియన్‌కు తెలుస్తుంది.

చికిత్స ఎంపిక మూడు విషయాలపై ఆధారం

- మీకు ఏ రకమైన లింఫోమా ఉంది?
- లింఫోమా దశ (అంటే లింఫోమా వల్ల ప్రాంతాలు దెబ్బతిన్నాయని అర్థం)
- మీ సాధారణ ఆరోగ్యం

లింఫోమా తరువాత జీవితం

- ఆరోగ్యంగా ఉండటానికి చేయవలసినవి, చేయకూడనవి తెలుసుకోవాలి. బాగా తినాలి. ఒకే సారి ఎక్కువ భోజనం చేసే బదులుగా కొద్ది కొద్దిగా భోజనం ఎక్కువ సార్లు తినాలి.
- నోట్లో పుండు ఉంటే మెత్తని ఆహారం తినాలి. మసాలా ఆహారాలు తినవద్దు. బత్తాయి రసం తాగాలి.
- ద్రవ పదార్థాలు పుష్కలంగా తాగాలి (రోజుకు 8 గ్లాసులు)
- మీ వైద్యులు సూచిస్తే వ్యాయమాన్నిచేయాలి. (సింపుల్ స్ట్రేచింగ్ లేదా కొద్ది దూరం నడవడం)
- తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నిద్రపోవాలి.
- స్వచ్ఛమైన గాలి పీల్చాలి.
- మళ్లీ కలుగుతుందేమోననే భయం ప్రధాన ఆందోళన కలిగిస్తూ ఉంటుంది. ఇలాంటి కుంగుబాటు లేదా ఆతృత ఎక్కువ కాలం ఉన్న వారు వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

లింఫోమా చికిత్స తరువాత మీ లిపిడ్‌లను, థైరాయిడ్‌ని, కాలేయాన్ని, మూత్ర పిండాలను క్రమపద్ధతిలో చెక్ చేయించుకోవాలి. క్లినికల్ రొమ్ము పరీక్ష, మమ్మోగ్రఫీ, పాప్ పరీక్షలు, కొలెరక్టర్ స్క్రీనింగ్‌లు, ప్రొస్టేట్ పరీక్షలు, ఎముక – సాంద్రత స్కాన్‌లు చేయించుకోవాలి.



డాక్టర్ అనిల్ కె.అర్భండి
కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్,
కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ

హెల్త్

ఊపిరితిత్తులకు వచ్చే ఇన్‌ఫెక్షన్ న్యూమోనియా

న్యూమోనియా అంటే ఊపిరితిత్తులకు వచ్చే ఇన్‌ఫెక్షన్. ఇది బాక్టీరియా, వైరస్ లేదా రెండు కాని ఎటిపికల్ ఆర్గానిజమ్స్ వలన సాధారణంగా వస్తుంది. ఇది ఒకరి నుండి ఇంకొకరికి కూడా రావచ్చు. రాకుండా ఉండాలంటే వ్యక్తి శారీరక, పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యం. ఇది సాధారణంగా చలి, జ్వరం, దగ్గు, దగ్గుతో కళ్లె పడటం, ఆయాసం, ఛాతిలో నొప్పి, ఒక్కో సారి దగ్గులో రక్తం పడటం లాంటి లక్షణాలతో వస్తుంది. కొందరిలో ఊపిరితిత్తుల చుట్టూ నీరు లేదా చీము చేరుతుంది. నీరు ఎక్కువగా పడి ఆయాసం బాగా ఉన్నా, చీము అని నిర్ధారణ అయినా, పరీక్షలను బట్టి నీరు తీసేయాలి అని నిర్ధారించినా ఛాతిలోకి గొట్టం వేసి తీసేయాలి.


ఇది ఏ వయసు వారికైనా రావచ్చు. షుగర్ ఉన్నా, గుండె లేదా కిడ్నీ జబ్బులు ఉన్నా, లివర్ సిర్రోసిస్ ఉన్నా, వయస్సు 60 సంవత్సరాలకు పై బడినా, రెండు వైపులా న్యూమోనియా వచ్చినా, బిపి (బ్లడ్ షుగర్) తక్కువగా ఉన్నా, కన్‌ఫ్యూజన్ ఉన్నా, కిడ్నీలు దెబ్బతిన్నా సీరియస్ న్యూమోనియా అంటారు. ఇలాంటి వారిని ఐసీయులో చేర్చి ట్రీట్‌మెంట్ చేయాలి. కొందరిలో ఊపిరి తీసుకునే కండరాలు ఫెయిల్ అవుతాయి. లేదా ఏఆర్‌డీఎస్ (ఎక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సింద్రోమ్) అనే ప్రమాదకర స్టేజికి ముదరవచ్చు. అలాంటి వారిని వెంటిలేటర్‌పై ఉంచి కోలుకునే దాకా కృత్రిమ శ్వాస అందించాల్సి ఉంటుంది.

సాధారణంగా పై లక్షణాలు కనపడిన వారికి రక్త పరీక్షలు, కళ్లె పరీక్షలు, ఛాతి ఎక్స్‌రే తీసి న్యూమోనియా నిర్ధారిస్తారు. న్యూమోనియా అనుకున్నప్పుడు ఎంత తొందరగా యాంటి బయాటిక్ మందులు వాడటం ప్రారంభిస్తే అంత మంచిది. మందులు కూడా అన్ని రకాల క్రిములని చంపే విధంగా ఎంపిక చేసుకోవాలి. చుట్టు ప్రక్కల ప్రాంతాలలో క్రిములకి డ్రగ్ రెసిస్టెన్స్ ఎంత ఉంది అనే విషయం కూడా పరిగణలోకి తీసుకోవాలి. లేదంటే మందులు వాడుతున్నా జబ్బు సీరియస్ అయ్యే ప్రమాదం ఉంది. ఒకసారి సీరియస్ అయ్యిందంటే ఖర్చు పెరుగుతుంది. దానితో పాటు ప్రాణహానీ పెరుగుతుంది. అంతే కాకుండా పేషెంట్‌కి ఐ.వి.ఫ్లూయిడ్స్, అవసరమైతే ఆక్సిజన్ కూడా ఇవ్వవలసి ఉంటుంది. వీటన్నింటికీ గైడ్‌లైన్స్ ఉన్నాయి. ఎంత తొందరగా పల్మోనాలజిస్ట్ (ఛాతి వైద్యుడు)ని సంప్రదించి మందులు వాడుకుంటే అంత మంచిది.

న్యూమోనియాని కమ్యూనిటీ ఎక్వైర్డ్, హాస్పిటల్ ఎక్వైర్డ్, హెల్త్ కేర్ అసోసియేటెడ్, వెంటిలేటర్ అసోసియేటెడ్ అని క్లాసిఫై చేశారు. ఇప్పటి వరకు మనం తెలుసుకున్నది కమ్యూనిటీ ఎక్వైర్డ్ న్యూమోనియా గురించే. హాస్పిటల్‌లో ఉండగా వారికి 48 గంటల తరువాత న్యూమోనియా వస్తే దానిని హాస్పిటల్ ఎక్వైర్డ్ అని, దీర్ఘకాలిక వ్యాధులు ఉండి లేదా మరే ఇతర కారణాల వల్ల గాని, ఇంటి దగ్గర గాని, హాస్పిటల్‌లో గాని నర్సింగ్ కేర్ లేదా పేషెంటుకి ట్యూ బులు గాని, లైనులు గాని వాడుకలో ఉంటే, వారికి న్యూమోనియా వస్తే దానిని హెల్త్ కేర్ అసోసియేటెడ్ అని అంటారు. ఇలాంటి న్యూమోనియాలన్ని సీరియస్. వీరిలో తగు పరీక్షలు చేసి మందులు వాడటం మంచిది.



డాక్టర్ ఎస్.ఎ.రఫీ
కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్





వివాదం కేరాఫ్ ఆర్జీవీ

ఆర్జీవీ దెబ్బకు ఎరక్కపోయి ఇరుక్కుపోయారా? ఆయన ప్రచారార్భాటం 'లక్ష్మీస్ ఎన్టీఆర్' నిర్మాతలకు ఊహించని చిక్కులొచ్చి పడ్డాయా? అంటే అవుననే అర్థమవుతోంది. ఇప్పటికే వర్మ దర్శకత్వం వహిస్తున్న 'లక్ష్మీస్ ఎన్టీఆర్' వివాదం రచ్చకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇదివరకూ రిలీజ్ చేసిన వెన్నుపోటు సాంగ్ చిత్రయూనిట్ ని ముప్పు తిప్పలకు గురి చేస్తోంది. ఈ పాటలో సీఎం చంద్రబాబును విలన్ గా చూపించారు వర్మ. ఎన్టీఆర్ కి వెన్నుపోటు పొడిచింది అల్లుడు చంద్రబాబే అంటూ పాటలో ఎలివేట్ చేశారు. దీంతో వర్మపై పలువురు కేసులు వేశారు. కోర్టులో కేసు పరిశీలనకు వెళ్లింది. తాజాగా తెలంగాణ హైకోర్టు ఏకంగా ప్రాంతీయ సెన్సార్ బోర్డ్ కే లీగల్ నోటీసులు పంపించడం సంచలనమైంది. బోర్డ్ చైర్మన్ సహా చిత్ర నిర్మాత రాకేష్ రెడ్డికి నోటీసులు పంపారట. తూ.గో జిల్లాకు చెందిన ఎస్.వి.ఎస్.ఎన్ అనే పిటిషనర్ ఈ కేసును సీరియస్ గా హ్యాండిల్ చేస్తున్నారట. ఇప్పటికే తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. తొలిగా సెన్సార్ బోర్డ్, చిత్రనిర్మాతలకు నోటీసులు పంపడంతో ఫిలింవర్గాల్లో ఇది వేడి పెంచుతోంది. మూడు వారాల్లోగా ఈ కేసు విషయమై పూర్వాపరాల్ని పరిశీలించాలని అధికారుల్ని కోర్టు ఆదేశించింది. ప్రస్తుతం గొడవ ముదిరిపాకాన పడుతోంది. మరోవైపు కె.ఎ.పాల్ వంటి వారిపై ఆర్జీవీ ట్విట్టర్‌లో అనుచిత వ్యాఖ్యలు చేయడంపైనా టీవీ చానెళ్లలో డిబేట్ రన్ అవుతోంది. ఆర్జీవీ ఈ ప్రమాదాలన్నిటినీ ఎలా డీల్ చేస్తారు? అన్నది వేచి చూడాల్సిందే.



ఐస్మార్ట్ శంకర్ కథేమి?

రామ్ –పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో ప్రకటించిన 'ఐస్మార్ట్ శంకర్' హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ వేడుకలో రామ్ కొత్త లుక్ లో వెరైటీగా కనిపించాడు. పూరి మార్క్ హీరోయిజంతో పాటు చాలా స్పెషల్స్ ఈ చిత్రంలో ఉన్నాయని అర్థమవుతోంది. ముహూర్తపు సన్నివేశానికి రామ్ పెదనాన్న స్రవంతి రవి కిషోర్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ఛార్మీ క్లాప్ కొట్టారు. కేవలం మూడు నెలల వ్యవధిలో షూటింగ్ పూర్తయ్యేలా ప్లానింగ్ చేసుకున్న పూరి మేలో రిలీజ్ చేసేందుకు టార్గెట్ పెట్టుకున్నారు. వేగంగా తీస్తూనే క్వాలిటీ మిస్ కాకుండా చూసుకునే పూరి కొంత గ్యాప్ తర్వాత తన రేంజ్ హిట్ మూవీ ఇదే అవుతుందన్న నమ్మకంతో ఉన్నాడు. ఈ మధ్య రొటీన్ లవర్ బాయ్ పాత్రలతో బోర్ కొట్టేసిన రామ్ ఆశ్చర్యకరమైన రీతిలో ఐస్మార్ట్ శంకర్ కోసం రెడీ అయ్యాడు. చాలా కాలం తర్వాత పూరి మూవీకి మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందించడం మరో విశేషం. టెంపర్ కు పాటలు కంపోజ్ చేయకపోయినా అద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో దానికి మణిశర్మ ప్రాణం పోసాడు. ఇప్పుడు మొత్తం బాధ్యత తీసుకోవడంతో పోకిరి రేంజ్ మేజిక్ అంచనా వేస్తున్నారు ఫ్యాన్స్. సత్య దేవ్‌పునీత్ ఇస్సార్‌ఆశిష్ విద్యార్థిమిలింద్ గునాజి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ మూవీని పూరి అంతా తానై నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంతో రామ్–పూరి మొదటిసారి జట్టు కట్టడం విశేషం.



నీ కోసం తొలి పాట

ప్రేమకథలు ఎన్నిసార్లు చెప్పినా బోర్ కొట్టదు. ట్రెండ్ కు తగ్గట్టుగా అప్డేట్ అవుతూ దర్శకులు కూడా ఈ కథలను నవతరానికి నచ్చేలా రాస్తున్నారు తీస్తున్నారు. అలా న్యూ ఏజ్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోన్న చిత్రం నీ కోసం. రెండు జంటల మధ్య ప్రేమకథను ఈ తరానికి నచ్చేలా తెరకెక్కుతోన్న సినిమా ఇది. వినోదం ఏమాత్రం తగ్గకుండానే ప్రేమకథలో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించబోతోన్న ఈ చిత్ర టీజర్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇక తాజాగా నీకోసం చిత్రంలోని తొలి పాటను ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేతుల మీదుగా విడుదల చేశారు. 'తొలితొలిగా' అంటూ సాగే ఈ పాట విన్న వెంటనే భరద్వాజ చాలా బావుందని మెచ్చుకున్నారు. సినిమా మంచి విజయం సాధించాలని ఆకాక్షించారు. నీ కోసం సినిమా యూనిట్ కు ఆల్ ది బెస్ట్ చెప్పారాయన. లవ్ స్టోరీలో ఎమోషన్ కు ఎప్పుడూ ఎక్కువ స్కోప్ ఉంటుంది. అలాంటి ఎమోషనల్ టచెస్ తో పాటు మంచి ఎంటర్టైన్మెంట్ కూడా ఉంటుంది చిత్రంలో. ఇది ప్రేమకథే అయినా అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టునే అన్ని అంశాలూ ఉంటాయి. ఇక తీర్థసాయి ప్రొడక్షన్స్ బ్యానర్ పై అల్లూరమ్మ(భారతి) నిర్మిస్తోన్న ఈ చిత్రానికి అవినాష్ కోకటి దర్శకుడు. ఇప్పటికే టాకీ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ వరక్స్ జరుపుకుంటోంది. అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసి వచ్చే నెలలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతోంది.

ప్లేబోయ్ లవర్ అయితే..! –అఖిల్

నటించిన తొలి రెండు చిత్రాలతో అఖిల్ తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు. అఖిల్, హలో చిత్రాలు జయాపజయాలతో సంబంధం లేకుండా నటుడిగా, డ్యాన్సర్ గా క్రిటిక్స్ ప్రశంసలు అందుకున్నాడు. అందుకే ఇప్పుడు అఖిల్ నటిస్తున్న మూడవ సినిమా 'మిస్టర్ మజ్ను'పై అభిమానులు సహా ఆడియెన్‌లో ఆసక్తి నెలకొంది. తొలిప్రేమ ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన మిస్టర్ మజ్ను ఈనెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. హైదరాబాద్‌లో అఖిల్ మీడియాతో మాట్లాడారు. ఆ విశేషాలివి..



మజ్ను కథ వినగానే ఆకట్టుకున్న తొలి పాయింట్?

నాకు ఈ కథ వినగానే .. అందులో నా పాత్ర చిత్రణ నచ్చింది. ఒక క్యారెక్టర్ బేస్డ్ సినిమా ఇది. ప్లేబోయ్ లవర్‌గా మారితే ఎలా ఉంటుంది? అన్నదే కథ. ఆ పాత్ర చిత్రణ నాకు చాలా ఆసక్తిగా ఛాలెంజింగ్ గా అనిపించింది. నేను ఇంతకుముందు చేసిన రెండు సినిమాలకి ఇది పూర్తిగా అపోజిట్ చిత్రం. సినిమాలో మంచి వినోదంతో పాటు మంచి ఎమోషన్ ఆకట్టుకుంటుంది. ఖచ్చితంగా అందరికీ నచ్చుతుంది అనుకుంటున్నాను.

వెంకీ అట్లూరి గురించి?

వెంకీ మంచి పనితనం ఉన్న దర్శకుడు. తనలో మంచి రైటర్ ఉన్నాడు. వెంకీ డాడీకి పెద్ద అభిమాని. నాన్నగారు నటించిన నిన్నే పెళ్లాడతా, మన్మధుడు చిత్రాల ప్రేరణతోనే ఈ సినిమా చేశాడు. త్రివిక్రమ్ కథలు, దర్శకత్వ శైలికి సంబంధించిన స్ఫూర్తి తనకు ఉంది.

దర్శకుడు ఎంతకాలంగా స్నేహితుడు?

వెంకీ నాకు పదేళ్లుగా తెలుసు. కాకపోతే బెస్ట్ ఫ్రెండ్ ఏమీ కాదు. కామన్ ఫ్రెండ్స్ ద్వారా చాలా సార్లు కలిసాం. కానీ మా మధ్య క్లోజ్‌నెస్ అయితే లేదు. మజ్ను దగ్గర నుంచే తను నాకు సన్నిహితుడు అయ్యాడు.

అఖిల్, హలో కంటే.. ఈ సినిమా వేగంగా పూర్తి చేశారు!

అలా ఏం లేదు. హలోకి స్క్రిప్ట్ విషయంలో చాలా ఎక్కువ సమయం తీసుకున్నాం. అలాగే ఆ సినిమాకి చాలా ఎక్కువ రోజులు అవసరం అయ్యింది. అఖిల్‌కి కూడా అలాగే జరిగింది. కానీ 'మిస్టర్ మజ్ను' ఫుల్ స్క్రిప్ట్‌తో వెంకీ రెడీగా ఉండటం వల్ల ఈ సినిమా కొంచెం స్పీడ్ గా అయింది.

మజ్ను ముందు మిస్టర్ ఎందుకు?

మిస్టర్ అని పెట్టడానికి ప్రత్యేకమైన కారణాలు అయితే ఏమి లేవు. కాకపోతే ఓన్లీ మజ్ను అని పెడితే కొంచెం ఎక్కడో ట్రాజడీ ఫీలింగ్ ఉంటుందేమో అని, వెంకీ మజ్నుకి ముందు మిస్టర్ అని పెట్టాడు. అలాగే మిస్టర్ పెట్టడం వల్ల, సినిమాలోతను ఒక మోడ్రన్ మజ్నును చూపించబోతున్నాడనే సెన్స్ ను కూడా హైలెట్ చెయ్యొచ్చు అనే ఆలోచనతో వెంకీ అలా టైటిల్ పెట్టడం జరిగింది. ఓవరాల్ గా మజ్ను అనే టైటిల్ బాగా కలిసొచ్చింది మా ఫ్యామిలీకి.

ప్రేమకథేనా.. యాక్షన్ ప్రాముఖ్యత ఎంత?

యాక్షన్ పార్ట్ కూడా ఉంటుంది. మూడు ఫైట్స్ ఉన్నాయి. నాకూ, నా బాబాయ్, పిన్నికి మధ్య వచ్చే ట్రాక్ బాగుంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి.

ఎన్టీఆర్ నుంచి మాస్ నేర్చుకోమని నాన్నగారు అన్నారు కదా..!

అవును.. మాస్ నేర్చుకోమన్నారు. అదే ఎలా నేర్చుకోవాలో తెలియట్లేదు. ఇక ఎలా నేర్చుకోవాలి అని నాన్నగారినే అడగాలి. జనరల్ గా బయట తారక్ నాకు కాంప్లిమెంట్స్ ఇవ్వడు. కానీ ఆడియో ఈవెంట్ లో నా గురించి మాట్లాడుతూ చాలా కాంప్లిమెంట్స్ ఇచ్చాడు.

తమన్ మ్యూజిక్ పై?

ఒక లవ్ స్టోరీకి మ్యూజిక్ ఏంత ముఖ్యమో అందరికి తెలుసు. తమన్ మ్యూజిక్ మజ్నును మరో లెవల్ కి తీసుకువెళ్తుంది.

మల్టీస్టారర్ ఆసక్తి ఉందా?

చేస్తాను. గతంలోనే ఓ మల్టీస్టారర్ చెయ్యమని అడిగారు. కానీ అప్పుడు చెయ్యటం కరెక్ట్ కాదు అని చెయ్యలేదు. కథ నచ్చితే మాత్రం చేస్తాను.

తదుపరి ప్రాజెక్టులు?

ప్రస్తుతం నా దృష్టి అంతా పూర్తిగా మిస్టర్ మజ్ను పైనే ఉంది. ఈ సినిమా విడుదలైన తరువాతే నా తదుపరి చిత్రం గురించి ప్రకటిస్తాను. ఫిబ్రవరిలో ఓ రెండు సినిమాలకు సంబంధించిన ప్రకటన ఉంటుంది.

మాస్ .. నాన్న గారే నేర్పించాలి..

అఖిల్, హలో సినిమాల అనుభవం .. వాటి నుంచి మీరు ఏం నేర్చుకున్నారు? మీ నుంచి కొత్తగా ఏం ఆశించవచ్చు?

ఈసారి ఖాయంగా ఎక్స్ పెక్ట్ చెయ్యొచ్చు. మిస్టర్ మజ్నులో నా బాడీ లాంగ్వేజ్ .. డిక్షన్, యాక్షన్.. ప్రతిదీ కొత్తగానే ఉంటాయి. వెంకీ, నేను చాలా హార్డ్ వర్క్ చేశాం. ఇదే విషయమై ఆడియో ఈవెంట్ లో తారక్ అన్నయ్య చెప్పారు. ఎప్పటికప్పుడు మన పనిలో మనం ఆత్మ విమర్శ చేసుకోవడం మంచిది. నేను అలాగే విమర్శించుకుంటాను.. అని అఖిల్ ఎంతో పరిణతితో అన్నారు. ఆడియో ఈవెంట్‌లో నాన్నగారు ఎన్టీఆర్ నుంచి నేర్చుకోమని సూచించారు కదా? అని ప్రశ్నిస్తే.. మాస్ నేర్చుకోమన్నారు. అదే ఎలా నేర్చుకోవాలో తెలియడం లేదు. ఎలా నేర్చుకోవాలి అనేది నాన్నగారినే అడగాలి... అంటూ నవ్వేశాడు అఖిల్. ఓపెన్ గా నాకు తారక్ అన్నయ్య ఏ కాంప్లిమెంట్స్ ఇవ్వడు. కానీ ఆడియో ఈవెంట్ లో నా గురించి మాట్లాడుతూ చాలా కాంప్లిమెంట్స్ ఇచ్చాడు... అది ఉత్సాహం నింపింది! అని అన్నారు.





మిఠాయి తిన్నారా?

భ్రమల్లో.. పగటి కలలు కనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని కంపెనీ ఉద్యోగం నుంచి తొలగిస్తుంది. పెళ్లి చేసుకోవాలనుకుంటే... ఓ సమస్య ఎదురవుతుంది. మూడు రోజుల్లో ఓ దొంగను పట్టుకుంటేనే పెళ్లి జరుగుతుంది. పట్టుకోలేదంటే పెళ్లి జరగదు. అటువంటి సందర్భంలో తన స్నేహితుడు జానీతో కలిసి దొంగను పట్టుకోవడానికి సాయి బయలుదేరతాడు. ఈ ప్రయాణంలో అతడికి ఎదురైన సమస్యలేంటి? సాయి దొంగను పట్టుకున్నాడా? లేదా? అసలు, ఆ దొంగ ఎవరు? సాయి పెళ్లి జరిగిందా? లేదా? ఫిబ్రవరి 22న విడుదలవుతున్న మా చిత్రం చూసి తెలుసుకోమంటున్నారు దర్శకుడు ప్రశాంత్ కుమార్. రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి కథానాయకులుగా ప్రశాంత్ కుమార్ దర్శకత్వం వహించిన డార్క్ కామెడీ చిత్రం 'మిఠాయి'. డాక్టర్ ప్రభాత్ కుమార్ నిర్మాత. ఫిబ్రవరి 22 న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం టీజర్ విడుదల చేశారు.

RRRలో నవాబ్ బ్యూటీ



రామ్ చరణ్– రామారావు– రాజమౌళి కాంబినేషన్ మూవీ RRR ప్రస్తుతం శరవేగంగా పూర్తవుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే రెండో షెడ్యూల్ ప్రారంభించారు జక్కన్న. ఈ సినిమా కోసం సెట్స్ వేసి, ఆన్ లొకేషన్ ఇల్లు కట్టుకుని మరీ జక్కన్న తపస్సు చేస్తున్నాడు. ఈ చిత్రంలో నటించే కథానాయికలు ఎవరు? అన్నదానికి ఇప్పటికీ ఆన్సర్ రాలేదు. కీర్తి సురేష్, దీపిక పదుకొనే, ఆలియా భట్ వంటి పేర్లు వినిపించాయి. కానీ ఎవరినీ ఫైనల్ చేయలేదు. తాజా సమాచారం ప్రకారం.. హైదరాబాదీ సోగ్గత్తె .. 'నవాబ్' నాయిక అదితీరావ్ హైదరీ ని జక్కన్న లాక్ చేశాడని ప్రచారం సాగుతోంది.

హంస రాణివా.. గులాబీ సఖివా?

మరాఠా కుటుంబం నుండి వచ్చిన హంసా నందిని అసలు పేరు పూనం. అనుమానాస్పదం సినిమా సమయంలో దర్శకుడు వంశీ హంసా నందినిగా మార్చారు. 2014లో గుణశేఖర్ దర్శకత్వంలో వచ్చిన చారిత్రక సినిమా రుద్రమదేవి లో మదనిక పాత్రలో కనిపించింది. హంసా నందిని పూణే నుంచి మోడలింగ్ చేయడంకోసం ముంబైకి వచ్చింది. 2002 నుంచి మోడలింగ్ రంగంలో ఉంటూ, పలు టెలివిజన్ ప్రకటనలలో నటించింది. 2013 లో మిర్చి, భాయి, అత్తారింటికి దారేది మరియు రామయ్యా వస్తావయ్యా , బాలకృష్ణ హీరోగా నటించిన లెజెండ్ సినిమాలలో ప్రత్యేక గీతాలలో నటించింది. నాగార్జున, జగపతిబాబు సినిమాల్లోనూ నటించింది. గత కొంతకాలంగా ఈ బ్యూటీ టాలీవుడ్ సర్కిల్స్ నుంచి మిస్సయ్యింది. తాజాగా సామాజిక మాధ్యమాల్లో కొత్త ఫోటోషూట్ తో మరోసారి టచ్ లోకి వచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో జోరుగా వైరల్ అవుతున్నాయి.

విజయక్రాంతి
గురువారం 24
జనవరి 2019
హైదరాబాద్
11

స్వీట్‌హోమ్

కఫాన్ని తగ్గించే సొరకాయ..



సొరకాయ ఒంటికి చలువ చేస్తుంది. హృదయాన్ని పదిలంగా ఉంచుతుంది. సొరకాయ కూరను చాలామంది పథ్యం కూరగా భావిస్తారు. కానీ తరచుగా తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి.

ఇది శరీరంలో వేడిని, కఫాన్ని తగ్గిస్తుంది. దప్పికను నివారిస్తుంది. వాంతులు, విరేచనాలతో బాధపడేవారు ఈ ఆహారాన్ని తీసుకుంటే మంచిది. సొరకాయ పురుషులలో వీర్యవృద్ధినీ పెంచుతుంది. హృదయ వ్యాధులన్నింటికి సొరకాయ కూర మంచి ఆహారం. దీనితో పాటు శొంఠి పొడి, మిరియాల పొడిని గానీ కలిపి తీసుకుంటే పడని వారికి జలుబు చేయదు.

సొరకాయ ముదురు గింజలను వేయించుకుని, కొంచెం ఉప్పు, ధనియాలు, జీలకర్ర కలిపి నూరి, కొంచెం అన్నంలో కలుపుకుని తింటే పురుషులకు చాలా మంచిది.

కొన్ని ప్రాంతాల్లో సొరకాయని అనపకాయలని కూడా అంటారు. పొడవుగా ఉండే సొరకాయలు, కుదిమట్టంగా ఉండే అనపకాయలు రెండూ ఒకే గుణాన్ని కలిగివుంటాయి. ఎక్కువగా సొరకాయ కూరను తింటుంటే ఆరోగ్యం వృద్ధి చెందుతుంది.

పిల్లల విషయంలో జాగ్రత్త..



పిల్లలన్నాక అల్లరి సహజమే. పెద్దలు ఎంత బిజీగా ఉన్నా, ఎంత ముఖ్యమైన పనిలో ఉన్నా, పిల్లలను ఓ కంట కనిపెడుతూనే ఉండాలి. ఎందుకంటే తెలిసీ తెలియని తనంతో, ప్రమాదమో లేదో తెలియకుండానే సమస్యలకు గురవుతుంటారు. ఆడుతూనే దెబ్బలు తగిలించుకోవడం, ఏదైనా కొత్తగా కనిపించగానే ఆత్రుతతో వెళ్లి పట్టుకోవడం వంటి చిన్న చిన్న పొరపాట్లు జీవితాంతం మచ్చగా మిగిలిపోయే పనులు చేసేస్తుంటారు. కాబట్టి పిల్లలను ఒంటరిగా వదిలేయొద్దు. ఒకవేళ వదిలేసినా వెంటవెంటనే వెళ్లి చూస్తుండాలి. పిల్లలకు ఎదురయ్యే సమస్యలేంటో ఓసారి తెలుసుకుందామా..

చిన్నపిల్లలు ఉన్న ఇంట్లో పెద్దలు, పిల్లలను ఓ కంట కనిడుతూ ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలి. ఎందుకంటే చిన్నారులకు అపాయాన్ని గురించి ఆలోచించే వయస్సుండదు. అనుకోకుండా కొన్ని ప్రమాదాలు ఏర్పడితే, మరికొన్నింటిని ప్రమాదమేమో అని తెలియకుండా కొని తెచ్చుకునేవి కొన్ని. పిల్లలకు ప్రమాదం కలిగితే పెద్దలు ఎక్కువగాభయపడుతూ, పిల్లల్లో భయాన్ని కలిగించకుండా, వెంటనే ప్రథమచికిత్స పద్ధతులను పాటించాలి. ఆ తర్వాత పిల్లల వైద్యునికి చూపించి, అవసరమయితే చికిత్స చేయించి, మందులు వాడాలి. ఏ ప్రమాదానికి ఏ విధమైన ప్రథమ చికిత్స చేయాలనేది పెద్దలకు సరైన అవగాహన ఉండాలి.



వేడి వస్తువులకు దూరంగా..

చిన్నారులను వేడి వస్తువుల దగ్గరకు రానీయకుండా, వంటింట్లో పరుగులు తీయకుండా చూసుకోవాలి. వేడి నీళ్ళలో చేయి పెట్టినా చేతులు కాలి, లేత చర్మానికి బొబ్బలొస్తాయి. వెంటనే పిల్లల చేతులు మీద ధారగా చన్నీళ్ళను పోయాలి. ఆ తర్వాత చల్లని నీళ్ళతో తడిపిన బట్టను చర్మం మీద ఉంచి, వెంటనే డాక్టర్ వద్దకు తీసుకెళ్ళాలి. చిన్నపిల్లలకు అందనంత ఎత్తులో వేడి కుక్కర్‌ను, వేడి పాత్రలను, బాణలి లాంటి వాటిని ఉంచాలి. డైనింగ్ టేబుల్ మీద, టేబుల్ క్లాత్‌ను కిందకు వేలాడుతున్నట్లుగా వేయకూడదు. ఎందుకంటే టేబుల్ క్లాతును పిల్లలు లాగితే, వాటి మీద ఉంచిన పాత్రలు, వేడి పదార్థాలను మీద వేసుకునే ప్రమాదం ఉంటుంది. చర్మం కాలే అవకాశాలుంటాయి. కాలినప్పుడు చర్మం మీద చల్లటి నీటిని ధారగాపోయడమే సరైన పద్ధతి. తేనె పూయడం లాంటి తెలియని పనులు పనులు చేయకుండా, డాక్టర్‌కు చూపించాలి. వెంటనే, బొబ్బలను చిదపకూడదు. చర్మాన్ని రబ్బేయకూడదు.

కత్తితో ఆటలు ప్రమాదమే..

పెద్దల నిర్లక్ష్యం, అశ్రద్ధ, మతిమరుపు వల్ల కూడా చిన్నారులకు పదునైన వస్తువులు కోసుకునే ప్రమాదం వుంటుంది. కూరలు తరిగే కత్తిపీట, చాకు, కత్తెర, బ్లేడు లాంటి పరికరాలను వాడిన తర్వాత, వాటిని పిల్లలకు అందుబాటులో లేకుండా జాగ్రత్తగా ఉంచాలి. పిల్లలు ఆడే ఆట వస్తువుల వల్ల కూడా వారికి చర్మం కోసుకుని లోతుగా దిగే ప్రమాదం ఏర్పడవచ్చు. పదునుగా వుండే ఆట వస్తు వులు, రేకులున్న ఇనుప బొమ్మలు, మేకులు, స్క్రూలు లాంటివి ఉన్న బొమ్మలు పిల్లలకు ఆటవస్తువులుగా కొనివ్వకూడదు. గాజు సీసాలు, గాజుపాత్రలు పిల్లలకు అందనంత ఎత్తులో ఉంచాలి. పొరపాటుగా పిల్లలు కోసుకుని నెత్తురు కారుతుంటే, చల్లటి నీటితో తడిపిన బట్టను చుట్టాలి. లేదా ఐస్ ముక్కలను బట్టలో ఉంచి రక్తం కారుతున్న ప్రదేశంలో ఒత్తిపెట్టి ఉంచితే రక్తం కారటం ఆగిపోతుంది. లోతుగా కోసుకుంటే, ఆ భాగాన్ని ఎత్తుగా వుంచి, చల్లటి నీటితో తడిసిన బట్టను ఉంచాలి. రక్తస్రావం ఆగిపోయిన తర్వాత, శుభ్రమైన బట్టతో తెగిన ప్రదేశంలో చర్మాన్ని కప్పి, ఒదులుగా చుట్టి, ఆ తర్వాత వైద్యుని వద్దకు తీసుకువెళ్ళి చూపించి, అవసరమైన చికిత్సను చేయించాలి.

ఉరుకులాటలో జారిపడితే..

పిల్లలు నేలమీద, మెట్లమీద నుంచి ఎత్తుగా ఉండే అరుగుల మీద నుండి జారిపడి దెబ్బలు తగిలించుకోవచ్చు. దెబ్బ తగిలిన నొప్పికంటే, భయంతోనే ఎక్కువగా ఏడ్చేస్తారు. పిల్లల ఏడుపు విని కంగారు పడకూడదు. వాళ్లని భయపడవద్దని బుజ్జగిస్తూ, ఏం జరిగిందో, ఎలా పడిందో, దెబ్బ ఎక్కడ తగిలిందనే విషయాలను తెలుసుకోవాలి. చర్మం చీరుకుపోయి రక్తం వస్తుంటే డెటాల్ నీళ్లతో చర్మాన్ని శుభ్రంగా కడిగి, టించర్‌ను దూదితో అద్దాలి. రక్తం ఆగకుండా వస్తుంటే, తడిబట్టతో కొంతసేపు నొక్కి ఉంచాలి. ఆ తర్వాత వైద్యుని వద్దకు తీసుకువెళ్ళి వైద్య సలహా ప్రకారంగా కట్టుకట్టించడమో, మందులు ఇవ్వడమో చేయాలి.

కీటకాలు కుడితే..

కొన్ని రకాల కీటకాలలో కొంత విషపదార్థం ఉంటుంది. అటువంటి విషకీటకాలు కుడితే పిల్లలకు ఎలర్జీ కలిగి, ఆ తర్వాత కుట్టిన చర్మం మీద బాధ కలుగుతుంది. గొంగళి పురుగులు లాంటివి కుడితే, చర్మం మీద పాకితే దురదలు, దద్దుర్లు వచ్చి పిల్లలకు ఇబ్బందిగా ఉంటుంది. అప్పుడు, గోరువెచ్చని నీటితో స్నానం చేయించి, దద్దుర్లు, దురద తగ్గటానికి గొంగళిపురుగు పాకిన ప్రదేశంలో విభూదిని బాగా రుద్దాలి. కొన్ని విషకీటకాలు కుడితే ఎలర్జీ ఏర్పడటమే కాకుండా, మరికొన్ని తీవ్రమైన మార్పులు వస్తాయి. దద్దుర్లు ఎర్రగా మారినప్పుడు, ఊపిరి పీల్చుకోవడంతో ఇబ్బంది కలిగినప్పుడు పెదాలు నల్లబడటం, నాలుక తడారిపోవడం లాంటి లక్షణాలు ఏర్పడితే ఆలస్యం చేయకుండా పిల్లలను వైద్యుని వద్దకు తీసుకెళ్లి, అవసరమైన వైద్యాన్ని పిల్లలకు అందించాలి.



మందులు, రసాయనాలు

మందులు, క్లీనింగ్ లోషన్స్ పిల్లలకు అందనంత ఎత్తుగా ఉంచాలి. పిల్లలు ఏమైనా మందులు తాగినా, మందుబిళ్ళలు తింటే వాటిని కక్కించడానికి, ఉప్పునీళ్ళు తాగించడం, మంచినీళ్ళు ఎక్కువగా తాగించడం లాంటి పనులు చేయకూడదు. అలా చేస్తే కడుపులో చేరిన మందులు, వెంటనే రక్తంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. బిడ్డకు ప్రాణాపాయ స్థితి ఏర్పడవచ్చు. ఇటువంటివి జరిగినప్పుడు, వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. కీటకాలను సంహరించే మందులను భద్రంగా ఉంచాలి. మందును స్ప్రే చేసినప్పుడు పిల్లలను ఆ ప్రదేశానికి దూరంగా ఉంచాలి. దోమలు, నల్లులు, ఎలుకలు, బొద్దింకలు చీమల సంహారక మందులను పిల్లలు నిద్ర పోయిన తర్వాత ఉపయోగించి, పిల్లలు నిద్రలేవకముందే క్లీన్ చేసేయ్యాలి. వాటిని పిల్లలకు తెలియకుండా దాచాలి.

పిల్లలకు ఏర్పడే కొన్ని ప్రమాదాలకు తక్షణ ప్రథమచికిత్స చేయాలి. మరికొన్ని ప్రమాదాలకు ఎంతమాత్రం ఆలస్యం జరగకుండా వైద్య చికిత్స జరిపించాలి. ముఖ్యంగా, పిల్లలకు ప్రమాదాలు జరిగినప్పుడు పెద్దలు, ఆందోళన, గాబరా పిల్లల ముందు ప్రదర్శించకూడదు. పనులు చేసేటప్పుడు చిన్న పిల్లలున్నారన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మరుపు, అశ్రద్ధ, నిర్లక్ష్యం లేకుండా ప్రవర్తించడం మంచిది. పిల్లలకు జరిగే ప్రమాదాలు ప్రాణాపాయ స్థితికి చేరకుండా తక్షణమే, చర్యలు తీసుకోవాలి.

స్మైల్.. ప్లీజ్..



నవ్వు నాలుగు విధాల చేటు అనేవారు అప్పటి పెద్దలు. కానీ నవ్వు ఆరోగ్యానికి పలు విధాల మేలు అంటున్నాయి ఈనాటి అధ్యయనాలు. ఒక్క చిరునవ్వు వంద బాధలను దూరం చేస్తుంది. అలాంటి ఒక చిన్న నవ్వు మనలోని చిరునవ్వుకి ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే. అమ్మాయి నవ్వుకి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు.

ఇక ఎవరినైనా పలకరించేటప్పుడు చిన్న చిరునవ్వు చిందిస్తే అందం, ఆప్యాయతతో పొంగిపోతారు. అయితే చిరునవ్వు ఆరోగ్యానికి కూడా ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. అయితే ఎలాంటి కారణం లేకుండా నవ్వడానికి ఇప్పటికీ.. చాలా మంది ఇష్టపడరు. మనం సాధారణంగా నవ్వుకి కారణం ఉంటేనే నవ్వుతాం. అలాగే ఏదైనా గుడ్ న్యూస్ లేదా ఏదైనా సంతోషకరమైన విశేషం ఉంటేనే నవ్వుతాం. కానీ ఊరికే నవ్వడం వల్ల అనేక ప్రయోజనాలుంటాయని.. అందుకే నవ్వడానికి కారణం అవసరం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. నవ్వు మనుషులకు ప్రకృతి ప్రసాదించిన బహుమతిగా భావిస్తారు. స్మైల్ గురించి మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేసే విషయాలు ఇప్పుడు చూద్దాం..

ఆరోగ్యానికి

నవ్వు మిమ్మల్ని మంచి, ఆరోగ్యకరమైన వ్యక్తిగా మారుస్తుంది. నవ్వు వల్ల ఎండోర్ఫిన్స్ మెదడులో రిలీజ్ అవుతాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మంచిది.

కంటాజియస్

నవ్వు కూడా ఒకరకమైన వ్యాధి లాంటిది. ఎందుకంటే, ఒకరి నుంచి ఒకరికి సోకుతుంది. ఒకరు నవ్వడం చూస్తే మనకూ నవ్వు వచ్చేస్తుంది. ఇదే నవ్వులోస్పెషాలిటీ.

ఎట్రాక్టివ్ లుక్

నవ్వుతో తమ పార్ట్‌నర్‌ని మహిళలు చాలా ఎట్రాక్ట్ చేస్తారని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. దీనివల్ల అందం రెట్టింపవుతుంది. ఒక నవ్వుతో అన్నిరకాల బాధలను మరిచిపోవచ్చు.

ఫ్రెండ్స్

నవ్వినప్పుడు ఎదుటివాళ్లు మీపై మంచి ఫీలింగ్ పొందుతారు. ఫ్రెండ్లీ పర్సన్‌గా భావిస్తారు. దీనివల్ల రిలేషన్స్ హ్యాపీగా బాగుంటాయి.

లైఫ్ స్పాన్



నవ్వుతూ ఉండేవాళ్లు, ఎప్పుడూ నవ్వడాన్ని ఇష్టపడేవాళ్లు ఎక్కువ కాలం బతుకుతారని, స్టడీస్ చెబుతున్నాయి. కాబట్టి నవ్వుతూ ఉంటే, ఎక్కువకాలం బతికేయచ్చు. మరి ఎక్కువ నవ్వి ఆయుష్షు పెంచుకుందామా..


సోషియబుల్

ఎలాంటి సందర్భంలోనైనా, పార్టీల్లోనైనా, నవ్వుతూ ఉండే వ్యక్తి చాలా మందిని ఎట్రాక్ట్ చేస్తారు. కాబట్టి ఎప్పుడైనా, ఎక్కడైనా చిన్న స్మైల్ ఇచ్చేయండి.

సంతోషం

స్మైల్ వల్ల సంతోషం, చాలా హ్యాపీగా ఉన్నాననే ఫీలింగ్ వస్తుంది. జీవితంపై సంతృప్తిని కలిగిస్తుంది. కాబట్టి ఎప్పుడూ నవ్వుతూ ఉండండి. నవ్వండి.. నవ్వించండి.

'చిటికె'లో సాధ్యం..!



- గదిని శుభ్రం చేసే నీటిలో అరకప్పు గులాబీ నీటిని వేస్తే, గదంతా పరిమళంగా ఉంటుంది.
- అల్లం వెల్లులి పేస్టు చేసేటప్పుడు, అల్లం నలభై శాతం, వెల్లుల్లి అరవై శాతం మోతాదులో తీసుకొని గ్రైండ్ చేయాలి. ఈ పేస్ట్ కూరకి మంచి రుచిని ఇస్తుంది.
- నిమ్మ, నారింజ, బత్తాయి తొక్కల లోపలి భాగాలతో పళ్ళపై రుద్దితే పళ్ళు తెల్లబడతాయి.

ముఖంపై మచ్చలా..!





అందానికి మారుపేరు ముఖం. అలాంటి అందమైన ముఖంపై మొటిమలు, మచ్చలు అందవిహీనంగా కనిపిస్తే చికాకుగా అనిపిస్తుంది. ముఖాన్ని మరింత అందంగా చేస్తూ, మచ్చల్ని మాయం చేసే చిట్కాలేంటో చూసేద్దామా...

మచ్చలు మాయం..

తులసిరసం, నిమ్మరసం సమాన భాగాలుగా తీసుకొని ముఖానికి పట్టించి, అరగంట ఆగి గోరువెచ్చని నీళ్లతో ముఖం కడుక్కుంటే ముఖంపై ఉండే నల్ల మచ్చలు తొలగిపోతాయి.

చర్మం కాంతివంతగా..

మేకపాలలో పచ్చి పసుపు, మంజిష్ట, నెయ్యి ఆవాలు కలిపి నూరి ముఖానికి, చర్మానికి రాస్తే ముఖం నిర్మలంగా, సౌందర్యంగా కనిపిస్తుంది.

మృదువైన చర్మానికి..

నిమ్మరసంలో మునగాకుల రసం కలుపుకొని ప్రతిరోజు ముఖానికి రాసుకుంటే చర్మం మృదువుగా తయారవుతుంది. మున్ముందు మచ్చలూ, మొటిమలు వచ్చే అవకాశం కూడా ఉండదు.

మొటిమలు, మచ్చలు..

దాల్చిన చెక్క, నిమ్మరసం కలిపి బాగా నూరి ఆ ముద్దను ముఖంపై లేపనంగా పెట్టుకొని, అరగంట ఆగి గోరువెచ్చని నీళ్లతో కడుక్కుంటే మొటిమలు, మచ్చలు మటుమాయమౌతాయి.

ముడతలు..

రెండు చెంచాల పెరుగును, అరస్పూన్ సెనగపిండిని, చిటికెడు పసుపు, ఒక చెంచా నిమ్మరసం కలిపి ఉదయం పూట ముఖానికి పట్టించి, అరగంట ఆగి శుభ్రంగా కడుక్కుంటే కొద్ది రోజుల్లోనే ముడతలు తగ్గిపోతాయి.

ఎర్రెర్రని పెదవులకు..

గ్లిసరిన్, నిమ్మరసం రెండు చుక్కలు కలిపి రాత్రి పడుకునేటపుడు పెదవులకు రాసుకుంటే, పెదాలు ఎర్రగా మెరుస్తాయి.



మాటే మంత్రం..



శత్రువుల గురించి ఆలోచిస్తూ..
సమయాన్ని వృధా చేసుకోకు..



కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	398	విజయవాడ	417
ముంబయి	453	ఢిల్లీ	435
చెన్నై	430	బెంగళూరు	415



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	120	ఢిల్లీ	130
కరీంనగర్	120	ముంబయి	125
వరంగల్	120	చెన్నై	135

సెన్సెక్స్ –136.17
36,106



నిఫ్టీ –91.25
10,831

రూపాయి
₹71.32
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
33,080.2
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 (గ్రాములకు/(రూ.)లలో

నిస్సాన్ కిక్స్ న్యూ సిరీస్ లాంచ్



నిస్సాన్ న్యూ కిక్స్ కార్‌ను లాంచ్ చేస్తున్న సిస్సాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అతుల్ సహానే

విజయక్రాంతి, హైదరాబాద్: నిస్సాన్ మోటార్ ఇండియా కొత్త ఎస్‌యూవీ ని హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో లాంచ్ చేశారు. 'కిక్స్' పేరుతో ఒక కొత్త సబ్ కాంపాక్ట్ ఎస్‌యూవీని వైస్ ప్రెసిడెంట్, డీలర్ నెట్ వర్క్ డెవలప్‌మెంట్ అతుల్ సహానే ఆవిష్కరించారు. నాలుగు వేరియంట్లలో నిస్సాన్ కిక్స్ లభ్యం కానుంది. ఎక్స్‌ఎల్, ఎక్స్‌వి, ఎక్స్‌వి ప్రీమియం, ఎక్స్‌వీ ప్రీమియం ప్లస్ అనే నాలుగు వెర్షన్స్‌ను తీసుకొచ్చింది. ప్రధాన ప్రత్యర్థులు హ్యుందాయ్ క్రెటా, రెనాల్ట్ డస్టర్, మారుతి ఎస్‌క్రాస్‌కి ధీటుగా, పోటీగా ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది.



కుప్పకూలిన దేశీయ మార్కెట్లు

- భారీ నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ
- నష్టపోయిన ఆటోమొబైల్స్, బ్యాంక్, ఐటీ రంగాల షేర్లు
- లాభపడిన ఫార్మా రంగం షేర్లు



ముంబై: దేశీయ సూచీలు బుధవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన మార్కెట్లు నష్టాల్లోనే కొనసాగుతూ వచ్చి చివరకు కుప్పకూలాయి. చివరి గంటలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు భారీ నష్టాల్లోకి వెళ్లాయి. ఆటోమొబైల్స్, బ్యాంకులు, వినియోగ, ఐటీ, మౌలిక రంగ షేర్లు నష్టపోవడం మార్కెట్లపై ప్రభావం చూపింది. లోహ, ఫార్మా రంగ షేర్లు లాభపడ్డాయి. బుధవారం సెన్సెక్స్ 10 పాయింట్లకు పైగా నష్టంతో ప్రారంభం కాగా, నిఫ్టీ 3 పాయింట్ల నష్టంతో 10,926 వద్ద ట్రేడింగ్ ఆరంభించింది.

చివరకు సెన్సెక్స్ 336.17 పాయింట్ల నష్టంతో 3,6108.476 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 91.03 పాయింట్లు కోల్పోయి 10831.50 పాయింట్లకు చేరింది. ఎన్ఎస్ఈలో సన్ ఫార్మా, యస్ బ్యాంకు, జీ ఎంటర్‌టైన్‌మెంట్, టాటా స్టీల్, విప్రో తదితర కంపెనీల షేర్లు లాభపడ్డాయి. ఐటీసీ, గ్రాసిమ్, ఇండియాబుల్స్ హెచ్ఎస్‌జీ, టైటాన్ కంపెనీ, ఇన్ఫోసిస్ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.71.34వద్ద ట్రేడవుతోంది.

ఎన్‌పీసీఐ గుత్తాధిపత్యంపై ఆర్‌బీఐ ఆందోళన



ఢిల్లీ: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసీఐ) కార్పొరేషన్ దేశంలోని చెల్లింపు సేవలపై గుత్తాధిపత్యం సాధిస్తోందని ఆర్బీఐ ఆందోళన చెందుతోంది. ఒక వేళ ఇదే పరిస్థితి ఏర్పడి ఆ సంస్థ ఏదైనా సాంకేతిక సమస్యల్లో చిక్కుకుంటే భారత్‌లోని రిటైల్ చెల్లింపు సేవలు కష్టమై పోతాయని భావిస్తోంది. ఇప్పటికే ఎన్‌పిసీఐ దేశంలోని సగానికి పైగా డిజిటల్ చెల్లింపులను పర్యవేక్షిస్తోంది. ఇటీవల దేశంలో చెల్లింపు సేవలను కొన్ని సంస్థలకే పరిమితం చేయడంపై జరిగిన చర్చలో ఆర్‌బీఐ ఈవిధంగా అభిప్రాయపడింది. కొన్ని రకాల చెల్లింపు సేవలకు నేషనల్ ఫైనాన్స్ స్విచ్, ఇమిడియట్ పేమెంట్ సర్వీస్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ వంటివి మాత్రమే ఉన్నాయి. ఈ రంగంలో పోటీని, సృజనాత్మకతను ప్రోత్సహించాల్సి ఉందని పేర్కొంది. అత్యంత వేగంగా ఎదుగుతున్న ఈ రంగంలో కొత్త సంస్థల అవసరం చాలా ఉందని ఆర్బీఐ భావిస్తోంది. దేశ వ్యాప్తంగా చెల్లింపు సేవలను ప్రోత్సహించేందుకు రిజర్వు బ్యాంక్ ఈ రంగంలో కొత్త వారిని ప్రోత్సహిస్తుంది. రిటైల్ చెల్లింపు సేవలన్నీ ఒకే చోట కేంద్రీకృతం కాకుండా ఉండటమే ఆర్బీఐ లక్ష్యం. ఆర్థిక స్థిరత్వం దిశగా పురోగతి సాధించేందుకు కూడా పోటీ, సృజనాత్మకతను ప్రోత్సహించాల్సి ఉంది" ఆర్‌బీఐ పేర్కొంది.



జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

ఢిల్లీ: వస్తు సేవల పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్టీఏటీ) నేషనల్ బెంచ్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. జీఎస్‌టీఏటీకి ఒక అధ్యక్షుడిని నియమిస్తారు. బెంచ్‌లో కేంద్రం నుంచి ఒక టెక్నికల్ మెంబర్, రాష్ట్రం నుంచి ఒక టెక్నికల్ మెంబర్ ఉంటారు. ఢిల్లీలో ఈ బెంచ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని క్యాబినెట్ సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు.

నేషనల్ బెంచ్ ఏర్పాటుకు ఏకకాలిక ఖర్చు రూ.92.50 లక్షలు అవుతుందని, రికరింగ్ ఎక్స్‌పెండీచర్ ఏటా రూ.6.86 కోట్లు అవుతుందని చెప్పారు. జీఎస్‌టీ కింద వివాదాల పరిష్కారంలో ఏకరూపత తీసుకువచ్చేందుకు కామన్ ఫోరంగా జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉంటుందని, తద్వారా దేశవ్యాప్తంగా ఏకీకృత జీఎటీ అమలు సులభతరం అవుతుందని రవిశంకర్ ప్రసాద్ తెలిపారు.


దిగివచ్చిన బంగారం.. పెరిగిన వెండి ధరలు



ఢిల్లీ: అంతర్జాతీయ పరిణామాల కారణంగా బుధవారం బంగారం ధర తగ్గింది. రూ.115 తగ్గడంతో పది గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.33,210కి చేరింది. దేశీయ మార్కెట్లో ఆభరణాల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ మందగించడం బంగారం తగ్గుదలకు మరో కారణంగా బులియన్ ట్రేడింగ్ వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉంటే వెండి ధర మాత్రం పెరిగింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ లభించడంతో వెండి ధర పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. రూ.310 పెరగడంతో కిలో వెండి రూ.40,160కి చేరింది.

అటు అంతర్జాతీయంగాను బంగారం ధర తగ్గింది. న్యూయార్క్ మార్కెట్లో బంగారం ధర 0.11శాతం తగ్గడంతో ఔన్సు 1,284.30డాలర్లు పలికింది. వెండి 0.16శాతం పెరగడంతో ఔన్సు 15.43డాలర్లు పలుకుతోంది. 99.9శాతం పసిడి ధర రూ.33,210గా ఉండగా, 99.5శాతం పసిడి ధర రూ.33,060గా ఉంది. మంగళవారం ట్రేడింగ్‌లో పసిడి రూ.125 పెరిగిన విషయం తెలిసిందే.

ఎయిరిండియా మాజీ ఎండీ అరవింద్ జాదవ్‌పై సీబీఐ కేసు



ఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా మాజీ ఛైర్మన్, ఎండీ అరవింద్ జాదవ్‌పై సీబీఐ కేసు నమోదైంది. ఎయిరిండియా నియామకాల్లో జాదవ్ అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. కెప్టెన్ ఎ.కథ్‌పాలియా, కెప్టెన్ అమితాబ్ సింగ్, కెప్టెన్ రోహిత్ భాసిన్, అప్పటి ఎయిరిండియా జనరల్ మేనేజర్లకు ప్రయోజనాలు చేకూర్చేలా జాదవ్ నియామకాలు చేపట్టారని ఆరోపణలు వచ్చాయి. దీంతో దర్యాప్తు చేపట్టిన సీబీఐ జాదవ్‌పై పాటు ఎయిరిండియా మాజీ సీనియర్ ఉద్యోగులపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

స్పోర్ట్స

చివరి రెండు వన్డే, టీ20లకు కోహ్లికి విరామం

- రోహిత్‌కు పగ్గాలు



ముంబై: న్యూజిలాండ్‌తో జరగనున్న చివరి రెండు వన్డేలకు, టీ20 సిరీస్‌కు టీమిండియా సారథి విరాట్ కోహ్లీ దూరం కానున్నాడు. ఈ మేరకు చివరి రెండు వన్డేలకు, టీ20 సిరీస్ నుంచి కోహ్లికి విశ్రాంతి ఇవ్వన్నున్నట్లు బీసీసీఐ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. కోహ్లీ స్థానంలో ఆ బాధ్యతలను వైస్ కెప్టెన్ రోహిత్ శర్మకు ఇవ్వనున్నారు. గతేడాది జరిగిన ఆసియాకప్ నుంచి కూడా కోహ్లీకి విశ్రాంతి లభించడంతో రోహిత్ శర్మ కెప్టెన్ పగ్గాలు అందుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు కివీస్‌తో జరిగే మరో రెండు వన్డేలకు మాత్రమే కోహ్లీ అందుబాటులో ఉండనున్నాడు. నాలుగు, ఐదో వన్డే మ్యాచ్, వచ్చే నెలలో జరిగే మూడు టీ20 మ్యాచ్‌లకు కోహ్లీకి విశ్రాంతి లభించనుంది. గత కొద్ది నెలల నుంచి విరామం లేకుండా కోహ్లీ ఆడుతున్నాడు. దీంతో ఫిట్‌నెస్, ఆరోగ్యం రీత్యా బీసీసీఐ అతడికి విశ్రాంతి ఇచ్చినట్లు చెప్పింది. విరామం లేకుండా ఆడటం వల్ల ఆ ప్రభావం ప్రపంచ కప్ మీద పడే అవకాశం ఉందని దీంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ తెలిపింది. న్యూజిలాండ్ పర్యటన తర్వాత ఆసీస్‌తో పరిమిత ఓవర్ల మ్యాచ్‌లను టీమిండియా ఆడనుంది. ఈ మ్యాచ్‌ల తర్వాత ఐపీఎల్ కూడా ప్రారంభం కానుంది. ఈ ఏడాది మే 30 నుంచి ప్రపంచకప్ సమరం మొదలవుతుంది. అయితే ఇక వరల్డ్‌కప్‌కు సమయం తక్కువగా ఉండటంతో కోహ్లికి విశ్రాంతి ఇవ్వడానికి ఇదే సరైన సమయమని బీసీసీఐ భావించినట్లు తెలుస్తోంది.

తొలి వన్డే భారత్ దే..

- రాణించిన శిఖర్ ధావన్
- కుల్దీప్ స్పిన్‌కు కుప్పకూలిన కివీస్ జట్టు
- ఐదు వన్డేల సీరీస్‌లో 1–0 ఆధిక్యంలో భారత్
- సూర్యుని కిరణాలు వల్ల ఆగిన మ్యాచ్
- డక్‌వర్త్ పద్ధతిలో టీం ఇండియాను వరించిన విజయం

నేపియర్: టీం ఇండియా తన జైత్రయాత్రను న్యూజిలాండ్‌లో కూడా కొనసాగిస్తోంది. ఇటీవల ఆస్ట్రేలియాలో టెస్టు, వన్డే సిరీస్‌ల విజయం అనంతరం భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో టీమిండియా 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ భారత బౌలర్ల ధాటికి 38 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. మ్యాచ్ ప్రారంభం అయిన కొద్ది సేపటికే ఓపెనర్లు మార్టిన్ గప్తిల్ (5), మన్రో (8) లను మహమ్మద్ షమీ ఔట్ చేసి కివీస్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాడు. వన్‌డౌన్ బ్యాట్స్‌మెన్‌గా బరిలోకి దిగిన కెప్టెన్ విలియమ్సన్ క్రీజులో నిలదొక్కుకున్నాడు. రాస్ టేలర్‌తో కలిసి విలియమ్సన్ కుదురుకునే ప్రయత్నం చేశాడు.



చాహల్ వేసిన 15వ ఓవర్‌లో రాస్ టేలర్ ఇచ్చిన క్యాచ్‌ను అద్భుతంగా పట్టుకుని పెవిలియన్‌కు పంపాడు. దీంతో టేలర్, విలియమ్సన్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన లాథమ్, నికోలస్, శాంటర్న్‌లు సైతం ఎక్కువసేపు క్రీజులో నిలదొక్కుకోలేక పోయారు. ఈ క్రమంలో ఒంటరి పోరాటం చేసున్న కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అర్థ శతకం నమోదు చేశాడు. అయితే 34వ ఓవర్‌లో 64 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద విలియమ్సన్‌ను కుల్‌దీప్ యాదవ్ ఔట్ చేశాడు. ఈ



మ్యాచ్‌లో విలియమ్సన్ (64), రాస్ టేలర్ (24) లు మినహా మరెవరూ రెండంకెల స్కోరును సాధించలేక పోయారు. దీంతో న్యూజిలాండ్ 38 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో కులదీప్ 4 వికెట్లు, చాహల్ 3, షమీ 2, జాదవ్ ఒక వికెట్ సాధించారు. అనంతరం కివీస్ నిర్దేశించిన 158 పరుగుల లక్ష్యాన్ని 34.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి గెలుపొందింది భారత్. భోజన విరామం తర్వాత మైదానంలోకి వచ్చిన భారత బ్యాట్స్‌మెన్ సూర్యుని కిరణాలు వల్ల బంతి సరిగా కనిపించకపోవడంతో 30 నిమిషాలు ఆటను నిలిపివేశారు. దీంతో డక్‌వర్త్ లూయిస్ ప్రకారం మ్యాచ్‌ను 49 నిమిషాలకు కుదించారు. దీంతో విరామం అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భారత బ్యాట్స్‌మెన్ ధావన్ అర్ధశతకం చేయడంతో ఛేదనలో టీమిండియా పెద్దగా కష్టపడాల్సిన అవసరం రాలేదు.

భోజన విరామానికి ముందు దూకుడుగా ఆడిన టీమిండియా.. బ్రేక్ అనంతరం ఓపెనర్ వికెట్ కోల్పోయింది. పదో ఓవర్‌లో బ్రేస్‌వెల్ వేసిన రెండో బంతికి రోహిత్ శర్మ.. గప్తిల్‌కి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ విరాట్ తోడుగా ధావన్ రెచ్చిపోయి ఆడాడు. ఇద్దరూ కలిసి బౌండరీలు బాదారు. కివీస్ బౌలర్లతో ఆటాడుకున్నారు. విరాట్ ధావన్ జోడీ కలిసి జట్టుకు 91 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఈ క్రమంలో కోహ్లీ అర్ధశతకం చేసేలా కనిపించాడు. అయితే 29 ఓవర్‌లో కోహ్లిని లాకియా ఫెర్గూసన్ పెవిలియన్ చేర్చాడు. 29వ ఓవర్‌లో లాకియా వేసిన నాలుగో బంతిని ఆడిన కోహ్లీ(45).. లాథమ్‌కు క్యాచ్ ఇచ్చాడు. అయితే అప్పటికి టీమిండియా విజయానికి 20 పరుగులు మాత్రమే చేయాల్సి ఉంది.

తర్వాత క్రీజులోకి వచ్చిన రాయుడు(13)తో కలిసి ధావన్(75) స్కోరు బోర్డును పరుగులు పెట్టించి 24 పరుగుల అజేయ భాగస్వామ్యంతో టీమిండియాకు విజయాన్ని అందించారు. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1–0 ఆధిక్యంలో నిలిచింది.





కరోలినా ప్లిస్కోవా

ఆస్ట్రేలియా ఓపెన్ సెరీనా జోరుకు బ్రేక్..

సెమీస్‌లో కరోలినా ప్లిస్కోవా, జకోవిచ్.. నేడు స్టెఫనోస్‌తో నాదల్ ఢీ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న అమెరికా నల్లకలువ సెరీనా విలియమ్స్ జోరుకు బ్రేక్ పడింది. టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన సెరీనా క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. క్వార్టర్స్ ఓటమితో మార్గరెట్ కోర్ట్ పేరిట ఉన్న 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను సమం చేసే అవకాశం చేజారిపోయింది. క్వార్టర్ ఫైనల్స్‌లో చెక్ రిపబ్లిక్ కరోలినా ప్లిస్కోవాతో జరిగిన మ్యాచ్‌లో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్ విజయంతో కరోలినా ప్లిస్కోవా సెమీఫైనల్స్‌కు చేరింది. తదుపరి మ్యాచ్‌లో జపాన్ సీడ్, యుఎస్ ఓపెన్ ఛాంపియన్ నవోమీ ఒసాకాతో తలపడనుంది. వరల్డ్ నం. 1 సీడ్ హాలెప్‌ను నాలుగో రౌండ్‌లో ఓడించి క్వార్టర్‌లోకి అడుగుపెట్టిన సెరీనా క్వార్టర్స్‌లో వరల్డ్ 7 సీడ్ 6–4, 4–6, 7–5 ప్లిస్కోవా చేతిలో ఓడిపోయింది.



నవోమి ఒసాకా

సెరీనా మొదటి సెట్‌లో 5–1తో ఉన్నప్పుడు అనవసర తప్పిదాలు చేయడంతో మ్యాచ్‌ను చేజార్చుకుంది . మ్యాచ్ అనంతరం ప్లిస్కోవా మాట్లాడుతూ "సెరీనా చాలా అద్భుతంగా ఆడిందని, ముఖ్యంగా సెకండ్ సెట్ చివరిలో మంచి షాట్లతో దూకుడును ప్రదర్శించిందని వివరించింది. గతంలో యుఎస్ ఓపెన్ ఫైనల్ మ్యాచ్‌లో ఒసాకాతో జరిగిన పోరులో టైటిల్‌ను కోల్పోయింది.

జకోవిచ్ దూకుడు

పురుషుల సింగిల్స్ విభాగంలో సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో తన దూకుడును కొనసాగిస్తూనే



జకోవిచ్

ఉన్నాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో జరిగిన మ్యాచ్‌లో 8 సీడ్ కేయ్ నిషికోరిపై 6–1, 4–1 తేడాతో జకోవిచ్ గెలుపొందడంతో ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఏడోసారి సెమీఫైనల్స్‌లోకి దూసుకెళ్లాడు. టాప్‌సీడ్, 6 సార్లు ఛాంపియన్ అయిన జకోవిచ్ శుక్రవారం జరుగనున్న సెమీ ఫైనల్‌లో ఫ్రెంచ్ సీడ్ లూకస్ పొయిలీతో తలపడనున్నాడు. మరోవైపు నేడు జరుగనున్న మరొక సెమీఫైనల్‌లో స్పెయిన్ బుల్ నాదల్ గ్రీస్ ఆటగాడు స్టెఫనోస్‌తో పోటీ పడనున్నాడు.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.